
# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక సెప్టెంబర్ 2010 ₹ 20/-



గణేష్ – శిల్పి: జానకిరామ్

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 21 సెప్టెంబర్ 2010 సంచిక 9**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (బుద్ధఘోషుడు)

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

*సహాయ సంపాదకులు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536, Cell : 94412 74960

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹ 20/- సంవత్సరానికి : ₹ 200/-

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25.00


# ఈ నెల...


ఒక జీవి ఉనికి ........ 3

– *కె. రామలక్ష్మి*

నికోలస్ రోరిక్ ........ 7

– *కాండ్రేగుల నాగేశ్వరరావు*

సర్ ఆర్థర్ కాటన్ ........ 13

– *చెరుకూరి వీరయ్య*

మాటలకందని పయనం ........ 19

– *డా. రావూరి భరద్వాజ*

ఆధునిక అరబ్ కవిత్రయం ........ 27

– *డా. దిలావర్*

నేనూ అమ్మనే... ........ 32

– *డా. యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి*

తెలుగు రుబాయీలు ........ 33

– *డా. ఎండ్లూరి సుధాకర్*

తుమ్మెద ... ఓ తుమ్మెదా... ........ 34

నా కళా జీవితం – నెల్లూరు – నవ్వుల రమణయ్య ........ 35

– *నటరాజ రామకృష్ణ*

విశ్వభారతికి ఆహ్వానం... ........ 40

– *రవీంద్రనాథ్ టాగూర్*

సత్యం శివం సుందరం ........ 46

– *గోవింద గుంజన్*

ద్రావిడ నాగరకతా విస్తరణ ........ 48

– *బి.యస్.ఎల్. హనుమంతరావు*

మనిషిగా పుట్టిన గంధర్వుడు – బళ్ళారి రాఘవ ........ 52

– *డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

మానవ శాస్త్రం విస్మృతమా? ........ 56

– *ముంగర జాషువ*

తెలుగు కథకు వెలుగుబాట – గోపిచంద్ ........ 58

– *నర్రా కోటయ్య*

అందమే ఆనందం ........ 62

– *డా. కాకుమాని శ్రీనివాసరావు*


***చిత్రకారులు:***

| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* | : విదేశీ అతిథులు | ... నికోలస్ రోరిక్ |
| *రెండవ అట్ట* | : గణేష్ | ... *శిల్పి : జానకిరామ్* |
| *మూడవ అట్ట* | : Lady lying on Lion's skin | *ఆల్మా టడేమా (వివరాలు 55వ పుటలో)* |
| *చివరి అట్ట* | : దేవికారాణి | *స్వెతొస్లావ్ రోరిక్* |

భారతీయ భాషలలోని సాహిత్యంతో పోలిస్తే మనం ఎక్కడ వున్నామో తెలుసుకోవటానికే సరస్వతి సమ్మాన్ పొందిన రచయితలను, రచయిత్రులను వారి అంతరంగాన్ని (మనోజ్‌దాస్, దలీప్ కౌర్ టీవానా వంటి వారిని) పరిచయం చేస్తున్నాము. అటువంటి వారితో సరితూగే వారు మనలో ఎంతమంది వున్నారని ఆలోచించాలి.

సొంతకతలు చెప్పడం ఎంత కష్టమో, వినేవాళ్ళకి మాత్రం ఇతరుల బ్రతుకులలోకి తొంగి చూడాలనే తపన అంత మెండుగానే వుంటుంది. అందుకనే ఆ ప్రక్రియ కత్తిమీద సాము లాంటిది. శ్రీమతి రామలక్ష్మి గారు మా పిలుపు మేరకు, తన కతను అలవోకగా, అర్థవంతంగా చెప్పారు.

పరిణతవాణిలో రావూరి భరద్వాజ బ్రతుకు తెరువు ఎన్ని ముళ్లో – ఎన్ని బళ్లో దాటుకుంటూ ఎందరో మహానుభావుల మంచితనంతో, ఆయనలోని ప్రతిభను సమాజానికి ఉపయోగకరంగా వినియోగించారు.

నటరాజ రామకృష్ణ ఇతరులకు ఊహించ వీలులేని తన తీపి, చేదు గురుతలను – అందులో మనకు నవ్వుల రమణారెడ్డి గారిని పరిచయం చేసిన తీరు – ఎవ్వరికీ ఎరుక లేనిది.

బళ్ళారి రాఘవ గొప్ప నటునిగా పేరుగడించినా, ఆయన ఔదార్యమైన వ్యక్తిత్వం వారి వృత్తిలోని ఔన్నత్యం జానమద్దిగారు మన ముందుంచారు.

గొప్పవారి ముందుచూపు ఎప్పుడూ ముందు తరాల బాగునే కోరుకుంటుంది. కాటన్ మహానుభావుని దూరదృష్టి – కార్యదీక్ష ఇప్పటి తరానికీ దారిచూపే దివిటీయే.

కృష్ణదేవరాయలు వివాహం చేసుకుని ఉపేక్షించిన తుక్కదేవి రచించిన 'పంచకం' అందిస్తున్నాం.

త్రిపురనేని గోపీచంద్‌ను తెలుగువారికి పరిచయం చేయవలసిన పనిలేదు. ఈ నెల ఎనిమిదిన వారి నూరేండ్ల పుట్టిన రోజు. వారి అభిమాని, సన్నిహితుడు నర్రా కోటయ్య గారితో పాటు మనం కూడా గోపీచంద్‌ను గుర్తు చేసుకుందాం.

**– సంపాదకులు**



# ఒక జీవి ఉనికి

**- కె. రామలక్ష్మి**

నేను పుట్టినప్పుడు మా తాత, మా నాన్నకు ఓ పోస్టు కార్డు రాశాడు. 'ఆడపిల్ల పుట్టింది, కాస్త కన్ను మెల్ల. కాలు సొట్ట. ముఖం వెర్రాదియ్య'లాగ వుంది. ఎదిగితే బాగానే వుంటుందని కాస్త ఆశ చివర చొప్పించాడు. చాలా కాలం ఆ కార్డు నాన్న దగ్గిర ఉండేది! నేనూ చూశాను. ఆ రోజుల్లో పోస్టుకార్డు సైజు కూడ చాలా చిన్నది. మరెందుకలా రాశాడో తాత తెలియదు గాని – బహుశా అలాగే వుండేదాన్ని కాబోలు. మా అన్న హీరో లాగా, అక్క పసిడి బొమ్మలాగా పెరిగింది. నేనే నలుపూ, మోటుతనం – అన్నీ కలబోసి పెరిగాను. నా కంఠస్వరం కూడా కీచు / బొంగురు అన్నీను! నా పేరు నా మేనత్త పేరు. రామలక్ష్మమ్మ. ఆవిడ బాల వితంతువు. నాన్నకీ, ఆవిడకీ పదిహేడేళ్ల తేడా. అంచేత ఇంటి పెత్తనం ఆవిడదే. ఆవిడ మరీ పచ్చగా వుండేది. మాటకారి కూడా. నన్నెవరేనా 'బండరాముడూ' అని పిలిస్తే మీదపడి కరిచినంత పని చేసేది. నేనంటే చాలా యిష్టం. ఈగ వాలనిచ్చేది కాదు.

అదీ వచ్చిన చిక్కు. "అతిముద్దు చేసి అక్షరం అబ్బకుండా చేస్తున్నావే అప్పా!'' అని నాన్న కోప్పడేవాడు. 'అదేనేర్చుకుంటుందిరా' అనేసేది. ఆయన మాటే నిజమైంది. నాకు చాలా కాలం అక్షరం అబ్బలేదు. అత్తయ్య, వేలుకి అలవాటవుతుందని గుంట ఓనమాలు రాయించాలని చేయని ప్రయత్నం లేదు. తల దువ్వుకోడం, కాస్త కాటుక, బొట్టూ పెట్టించుకోడం, మంచి బట్టలు వేసుకోడం లాంటివి ఛస్తే ఒంటబట్టలేదు. మా పెరట్లోకి ఎవరు వచ్చినా పేచి పెట్టడం, మా కుళాయి దగ్గిర వీథిలో వాళ్లు నీళ్ళు పట్టుకుంటూంటే చాలు చాలు అని గోల పెట్టడం చేసేదాన్ని. ఇదీ మరీ రెండు మూడేళ్ల వయస్సులో కాదు. ఐదేళ్ళు దాటాక భాగోతమే.

ఆ తరువాత అత్తయ్య నన్ను బడికి పంపించాలని నిర్ణయించి – అక్కడి ఓ బడిలో – దాన్నెందుకో 'గానుగ బడి' అనేవారం. ఆ బడి కాంపౌండులో ఆడ్డం మాసేసిన సున్నం గానుగ చిహ్నాలుండేవి, పెద్దరాతి చక్రం – గానుగ సర్కిల్ కూడ అలాగే వుండేవి. స్కూలు హాయిగానే ఉండేది. ఒకర్తే టీచరు. అప్పటికే ఆవిడ పెద్దావిడ. మంచావిడ. సరదా మనిషి. ఆ రోజుల్లోనే నయం స్కూళ్లలో అందరికీ బెంచీలూ, ముందు బల్లా వుండేది. క్లాసుకి ఒక బ్లాక్ బోర్డూ, డస్టరూ, సుద్దముక్కలూ వుండేవి. అప్పుడే నయం. స్కూలు స్కూలుగా వుండేది. 'కా, కాకు గుడిస్తే కీ లు' వేదఘోషలా సాగించే దావిడ. పాపం అక్షరాలూ నేర్పింది. చాలా మంది బాగానే నేర్చుకున్నారు. కాని నాకూ, నా మిత్రురాలికీ అరవడం బాగానే వుండేది కాని రాయడం – చదవడం చస్తే రాలేదు. నా ఫ్రెండు ఎవరో అనుకునేరు. సూర్యకాంతం. ఇద్దరం ఒకరి పక్క ఒకరం కూర్చుని పోటీగానే కా, కీ, కూ లు అరిచే వాళ్లం. చాలా మంచి దోస్తులం. అది ఏం తెచ్చినా నాకు పెట్టేది. కాని నేనే ఏం తెచ్చుకొనే దాన్ని కాదు. 'తిండే తింటావు అక్షరాలు ఒంటపట్టవు' అని అత్తయ్య ఇంట్లో ఏదో పెట్టి తీసుకెళ్లి దింపేది! అయితే కాంతం ఇద్దరికి సరిపడ తెచ్చేది – వేరుసెనక్కాయలు, బఠానీలు – చిన్న చిన్న జీళ్లు – కనబడకుండా నోట్లో పడేసుకునేవి – పట్టుకు వచ్చేది. దానికి అక్షరాలు బాగానే వచ్చేవి. నాకే పలక పట్టు కోవడం పెద్ద శిక్షగా వుండేది. అలా మూడేళ్లు మేం ఒకే బెంచీలో, ఒకే పంతులమ్మ దగ్గిర చదువు నేర్చాం. కాని క్లాసు మారలేదు!

కె. రామలక్ష్మి, ఫోన్ 040-24162885

అత్తయ్య ఒక రోజు బడికి వచ్చి టీచరమ్మతో పేచీ పడింది. "ఒక్కక్షరం రాయడం లేదు? క్లాసు మార్చడం లేదు "అంటూ. ఆమెగారు నవ్వి "ఈ రోజు మీ రాముడి చేత పలక మీద రాయించి పంపిస్తాను అవి చూసి మీరే చెప్పండి – నేనేం చేయాలో" అని పంపించేసింది. ఆ రోజు పలక మీద అ, ఆ లే కాకుండా ఓ కా గుణింతం కొంత రాయించింది. "ఇది తుడిచేయకుండా మీ అత్తయ్యకి చూపించి ఏమన్నారో నాకు చెప్పు" అంటూ పంపింది. కాంతం 'తప్పు రాస్తే అత్తయ్య తన్న గలదు చెరిపెయ్యవే' అన్నా నేను అలాగే ఇంటికి పట్టుకెళ్ళి అత్తయ్యకి పలక ఇచ్చాను. ఆమెగారు ముందు కాస్త బిక్క ముఖం పెట్టి తరవాత నవ్వాపుకోలేక పోయింది. 'ఇదెలా రాశావు?' అడిగింది. "అ ఆ లు కుడి చేత్తో, కా కీ లు ఎడం చేత్తో" అని గర్వంగానే చెప్పాను. ఇంట్లో పలక చూసి అందరూ నవ్వడమే – నాకు అర్థం కాలేదు. కాని తరవాత తెలిసిందేమిటంటే అక్షరాలు కుండలు బోర్లించినట్లు తల్లకిందులుగ రాశాను. 'అప్పా. పోయి టీచరమ్మని కూడ అడగాలా యీ తెలివికి? దీనికి అక్షరం ముక్క రాదు, చంపుకు తినక వదిలెయ్' అన్నారు. అసలప్పుడు కొట్టడం అనేది లేదు నన్ను. అమ్మే ఏదో వంకన జుట్టు దువ్వేప్పుడు వీపు మీద ఒకటి రెండు పిడి గుద్దులు పడేసేది. అలాంటి వాటికి నేను ఎప్పుడు ఏడవడం ఎరగను! ఇక స్కూలు కెందుకు ఇంటి దగ్గిర మాష్టారు చెప్తారని... ఒకాయిన్ని పిలిపించింది. పాపం బ్రాహ్మడు. చాలా ప్రయత్నించాడు అక్షరమాల సరిగా రాయించాలని. ఆయన తరం కాలేదు. 'యీ అమ్మాయికి అక్షరాలు రావు. మాటలతో ప్రారంభిస్తా'నన్నారాయన. అలా తల, వల, చెట్టు, గట్టులతో చదివించే ప్రయత్నం చేశారు. ఈ పద్ధతిలో నాకు కాస్త అక్షర జ్ఞానం అబ్బడం మొదలైందని అత్తయ్య మురిసి పోయింది. అల్ప సంతోషి.

క్షణాలమీద నన్నో 'సకల కళావల్లతన'గా తయారు చేసేయాలని ఆవిడ ఆశ. ఓ సంగీతం మాష్టారు వచ్చారు. సరళ స్వరాలు రాలేదు గాని ఆయన ముక్కు పొడుం. కంఠం వచ్చింది. వీణ నేర్పిద్దామనుకుంది. అబ్బే! అది చాలా సున్నితమైన వాద్యం – నాకు ఘటంలాంటిదే – తగు' అని నాన్న చెప్తున్నా వినలేదు. పేరింటి కత్తె మీద ప్రేమ అంత బలంగా వుండేదామెకి. ఆమె మూలాన్నే నేను బండగా, మొండిగా, తిక్కగా, బుద్ధి లేకుండా తయారయ్యానని మా అమ్మ గోల. ఎందరేమనుకున్న నాకు చదువు చాలా లేటుగానే ప్రారంభమైంది.

ఒకసారి చదువు కోవాలని పట్టుదలవచ్చాక – ఇక వెనక్కి తిరిగి చూడడం జరగలేదు. రాజమండ్రిలో భగీరథ గారి దగ్గిర, పిలకా నరసింహమూర్తిగారి దగ్గిర వాటర్ కలర్ చిత్రీకరణ నేర్చుకున్నాను. వారికి దగ్గిరలో ఒక డాన్సు స్కూలు వుండేది. చూశాక కాస్త అదీ చూస్తే ఎలా వుంటుందనిపించి, అత్తయ్యని అడిగాను. 'గాత్రం అయింది. వీణ అయింది. చదువయింది. చిత్రకళ అయింది ఇప్పుడింక నాట్యాన్ని హింస పెట్టాలా?' అని నాన్న కోప్పడ్డారు. 'లాలిత్యం లేకుండా నాట్యమేమిటే నీ ముఖం. ముందు ఆడపిల్లలాగ వుండు' అంది అత్తయ్య కూడా. కాని నాన్న నవ్వి 'దీనికి మామూలు ఇలాంటి అలాంటి నాట్యం దండగ. కథక్ లాంటిది నేర్పుతాను' అన్నారు. అలాగే నేను గాడిచర్ల సత్యనారాయణ మేష్టారి దగ్గిర చేరాను. ఆయన ఉత్తరాది సంస్థానాలలో వుండి వచ్చినవారు. అదో పిచ్చి కొంత కాలం.... ఇవన్నీ అయ్యాయి.

మా అక్క పెళ్లి అయ్యాక మద్రాసుకి మారాం. ఇక్కడ స్కూలు, ఆంగ్ల మాధ్యమం చేశాను. చాలా కష్ట పడ్డాను. తెలుగు క్లాసులో తప్ప తెలుగులో మాట్లాడితే ఫైనేసే గవర్నమెంటు స్కూలు! మొత్తానికి అక్కడ గట్టెక్కి – స్టెల్లా మారిస్‌లో చేరాను. అక్కడ బాగా మెరిసానని చెప్పగలను. ఆ కాలేజీలో తెలుక్కి ప్రాణ సంకటం! గురువులు దొరికేవారు కాదు. తెలుక్కి ఉన్నది ముగ్గురం. మగవాడు నిషిద్ధం. ఇక తప్పక పోతే ఎవరో ఒకర్ని తెచ్చేవారు. అలా నలుగురైదుగురు మారారు. టేబిల్ మీద కాళ్లెట్టి పాఠం చెప్తున్నాడని ఒకర్ని, కాళ్లూపుతూ చెప్తున్నారని ఒకర్నీ, టేబిల్ మీద కూర్చుని పాఠం చెప్తున్నారనీ ఒకర్నీ – పంపేయడం జరిగింది. ఇంతా చేసి క్లాసులో (బి.ఏ.) వున్నదే ముగ్గురం – నేనూ, కల్పకం (ఏచూరి తల్లి), ఉషారాణి (కుమ్మరి పద్మావతిగారి కుమార్తె) అప్పుడింక తప్పక సీతమ్మ గారని ఒకామెని వెల్లింగ్‌టన్ టీచర్స్ ట్రైనింగ్ కాలేజీ నుంచి తీసుకొచ్చారు. ఈమె నిత్య విషాదిని! నిత్య శంకిని! ఉషారాణి చలంగారి బ్రదర్ కూతురని తెలిసి తెగ ముద్దు చేసేది. 'ఆయన వదిలేయమంటేనే భర్తని విడిచి స్వేచ్ఛ పొందా' అని గర్వంగ చెప్పేది. ఇంకా అప్పటికి నాకు చలాన్ని చదివే అవకాశం రాలేదు! ఉషయితే సిగ్గుపడి ముఖం జేవురించుకునేది! ఇలా కాలేజీ రోజులు బాగానే గడిచాయి. చదవడం కుతూహలం వుంటే, పరీక్షలు భయపెట్టవని అప్పుడే

తెలిసింది. ఫైనల్ సంవత్సరంలో శ్రీ ఖాసా సుబ్బారావుగారు ముఖ్య అతిథిగా కాలేజీలో సభ పెట్టాం. సభ అయి వెడుతూ "బి.ఏ. పరీక్ష రాయగానే వచ్చి నాకు కనిపించు. ఉద్యోగం చేద్దామనుకుంటున్నావా?" అని అడిగారు. 'మనం ఇంగ్లీషులో అలా దంచామన్నమాట' అని నా మిత్రులు ఏడిపించారు కూడా.

నిజంగా వెళ్ళాను స్వతంత్ర ఆఫీసుకు. 'ఏం ఇన్ని నెలలు వచ్చి కనబడలేదు?' అడిగారు. 'క్లాసొస్తుందో రాదో' నని నసిగాను. ఆయన నవ్వేశారు. "దానికీ, దీనికి సంబంధం ఏమిటి? టైపు చేయడం నేర్చుకున్నావా? "లేదు. రెండు నెలలైనా ఎ.ఎస్.డి.ఎఫ్. దాటి వేళ్లు వెళ్ల లేదు" అని నిజం చెప్పేశాను. 'ప్రూఫ్ ఎలా చదువుతారో తెలుసా? తెలియదా?' 'గుడ్. యు ఆర్ ఫిట్ టు బి ఎన్ ఎడిటర్!' అన్నారు. అలా స్వతంత్రలో చేరి జర్నలిజంలో అడుగు వేయడం (ముందు నిలబడడం) నేర్చుకున్నాను. నిలబడ్డాను.

అప్పుడు ''తెలుగు స్వతంత్ర'లో గోరా శాస్త్రి, సంపాదకుడు. అక్కడికి వచ్చేవారు. సాయంత్రం అయ్యేసరికి – చాలా మంది కవులూ రచయితలూ, అలా కొంచెం కొంచెం తెలుగు బాగా పరిచయం అయింది. "రామలక్ష్మికి తెల్ల కాగితం యిచ్చి ఆవు మీద కాంపోజిషన్ రాయమంటే – నాలుగు లైన్లు కూడ రాయలేదని' అందరిముందు వేళాకోళం చేసేవాడు. 'వై షి టాక్స్ గుడ్ తెలుగు. అని సుబ్బారావుగారు నా పక్షం వహించి వాదించి చూసేవారు. అసలు తెలుగులో చేరలేదని గోరాశాస్త్రి కినుకు. రాని పని చేయడం బాగుండదని నా ఉద్దేశ్యం.

ఇదిగో ఈ కవి కథక మూకలోనే, నేను తొలిసారి ఆరుద్రని చూశాను. తరువాత అతని తత్వం మృదు భాషణం గౌరవం అన్నీ చూశాను. పెద్ద ప్రేమా, దోమా కాదుగాని – ఇంతమంది, ఇంత గోలగా వాదిస్తున్నా, సైలెంట్‌గా నవ్వేరకం ఆరుద్రది. చాలా చాలా మితభాషి. అంటే నాకు తల్లకిందులు!

నేనప్పుడు కొంచెం కొంచెం రాస్తున్నాను తెలుగులో. ఆ రోజుల్లో నాకు షా నాటకాలు, సారోమన్ కథలూ చాలా యిష్టం. బహుశా స్కెచ్ అన్నదాన్ని నేను రాయటం సారోమన్‌ని చూసే.

నా తొలి కథల సంపుటి "విడదీసే రైలు బళ్ళు." దీనికి ఆరుద్రని ముందుమాట రాయమని అడిగ. రాస్తానన్నారు.



ఆరుద్ర

అంతే ముందుమాట రాయడానికి ఏళ్ళూ, పూళ్లు పడుతుందని నా కప్పట్లో తెలియదు. అడిగాక – పుస్తకం అచ్చు వేసేస్తే – మర్యాదకాదు. అంచేత అడక్కుండా ఊరుకోలేను. దాదాపు ఏడెనిమిది నెలలు ముందుమాట కోసం తిరిగి తిరిగి – అతనితో అన్ని విషయంలోనూ కొంపలంటుకున్నట్టు వాదించి వాదించి నాకు మంచి మిత్రుడు దొరికాడు అనుకున్నాను. అయినా నా మిత్ర బృందంలో ఆరుద్ర ఒకరు. నాకు కవులు, చిత్రకారులు రాసే వాళ్లు – కబుర్లు చెప్పేవాళ్లు ఎందరో వుండేవాళ్లు. వారిలో ఆరుద్ర చేరిపోయారు. సాయంత్రం – ఆఫీసు నుంచి ఇద్దరం కలిసి నడిచి వచ్చి – అంతే అంతా గోలే. అన్నిటినీ చీల్చి చెండాడడమే పని – అందరూ లేకుంటే గుంపుగా అందరం అడ్డదారిన మెరినాబీచ్‌కి పోయే వాళ్లం. అక్కడ వాదనలు కొనసాగింపే. మాతో వెంటబడి నా కుక్క కూడ వచ్చేది దాని పేరు చాకీ. గొప్ప క్లాసు కుక్క కాదు నాకదో పెద్ద రక్షకుడిలా వుండేది. ఎవరు గట్టిగా మాట్లాడినా అరచేసి గోల చేసేది. ''చాకీ ఇది దెబ్బలాడ్డం కాదు వాదించుకోవడం' అని చెప్తే అర్థమయినట్టే తోక ఆడించేది. 'దీనికి మీ భాష బాగా అర్థం అవుతోంది' అని జోక్ చేసేవారు ఆరుద్ర. 'నేను ఓడిపోతానేమోనని దాని భయం. అంతకంటేం లేదు' అనేదాన్ని.

ఆ జీవితం వేరు. ఆ ఛాలెంజిలు వేరు... ఆ మాట తీరు, ప్రవర్తన, ఒకరిపై ఒకరికి గౌరవం, స్నేహం. దేనికదే ప్రత్యేకం.. అందుకే మా పెళ్లి తరవాత 1 SPM వీథిలాగే ముందు 26 బజార్ రోడ్డు కూడా మిత్రులతో నిండు కొలువులా వుండేది. మేం ఉండేదప్పుడు రెండు గదులూ – ఒక వంటిల్లూ. ఓ గదిలో యీ గోల. అమ్మ నాన్న నా కెప్పుడు చెప్పలేదు ఇదేం గోల అని. ఎందుకంటే నేను తప్పు చెయ్యను. తప్పు చేసిన వారిని గౌరవించను, భరించను అని వాళ్లకి బాగా తెలుసు. ఆడ పిల్లలా మెలికలు తిరిగి పోడం నాకు తెలియదు.

ఆరుద్ర మా నాన్నకి కూడా చాలా యిష్టం. 'ఏం పంతులు గారూ' అని పల్కరించే వాడు. నాన్న కూడ ఏం పంతులూ అనేవారు.

ఈ నా యింట్లో మిత్రుల సమావేశాల గురించి విని గోరా శాస్త్రి 'రేనా సర్కార్'! అని వేళాకోళం చేసేవాడు. కాని నా ధైర్యం దాపరికం లేని తనం అతనికి నచ్చేవి కాదు – సుబ్బారావు గారలా కాదు. మేం ఆయనకి ఛాలెంజి అనేవారు. హాయిగా నవ్వుకునే వారు! కెన్ ఐ జాయిన్? అని జోక్ చేసేవారు... 'బి.పి. పెరుగుతుంది వద్దు' అనే దాన్ని.

ఇప్పుడు అనుకుంటాను – నే నలా ఎలా వుండ కల్గేదాన్ని? డబ్బు లేదన్న భయంలేదు. మంచి మంచి బట్టలు లేవన్న చింతలేదు. తిండికీ అంత అర్రులు చాచడం తెలియదు. ఆ రోజుల్లో నా జీవితం – ఒక నచ్చిన గందర గోళం. స్నేహితుల అడవి. నవ్వుల సంగీతం. కష్ట సుఖాలతో పని లేకుండా జీవనం సాగించాను.

ఆరుద్రని నేను పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు చాలా మంది పందెం కట్టుకున్నారు. 'మూడు నెలలా? ఆరు నెలలా?' కలిసి వుండేది అని. నాకు బాగా సన్నిహితులైన మిత్రులు కూడా – అలాగే అనుకున్నారు – కారణం ఒక్కటే – నా తత్వానికి అతని తత్వం తల్లకిందులు! కాని ఇద్దరికీ – ఒకే రకమైన ఆరాధనా భావం వుంది – ఒకరిమీద ఒకరికి అదే బహుశా మమ్మల్ని నడిపించింది. ఇక మా పెళ్లి – ఆరుద్ర బంధువుల బాధ – చాలా కథ జరిగింది... అందుకే అప్పట్లో కథ త్వరగా ముగియలేదు. అదంతా ఇంకో సారి.

 మి

---

## వర్షం

"దేవుడు బండి యెక్కి యాకాశము మీద తిరుగు చుండును. ఆ బండిచప్పుడే యురుము. అప్పుడప్పుడా బండి సీల లూడి క్రింద బడుచుండును. అవియె పిడుగులు. దేవుని బండికి గట్టిన గుఱ్ఱాల డెక్కలు రాళ్ళమీద తగులుట వల్ల నిప్పులు, మంటలు బయలు దేరును. అవియె మెఱుపులు. వాననగా, తిరిగి తిరిగి వచ్చిన మీదట దేవుని వంటిమీద పట్టిన చెమట. గాలి వీచునప్పుడు వానరాకపోవుటకు గారణమేమో తెలుయునా? గాలి విసరినప్పుడు చెమట ఆరిపోవును. సూర్యుడనగా దేవుడుగారి యింట బెట్టి కొన్న కుంపటి. చంద్రుడంటే దేవుడుగారి యింట్లో యిత్తడిగిన్నె."

## ఉష్ణం

"జ్వరమెందుకు వచ్చుననగా మన కడుపులో బొడ్డు దగ్గర దీపముండును. ఆ దీపమొకప్పుడు భగ్గున మండి పెద్దదగును. అప్పుడు లోపల వేడి చాల పుట్టును. లోపల వేడిచేత పై చర్మము గూడ వెచ్చబడును. లోపల దీపము మండుచుండుట చేతనే జబ్బుగా నున్నవానికి కడుపులో మంటలు బయలుదేరును. ఆ దీపము తగ్గి యథాప్రకారమైతే జ్వరము తగ్గిపోవును. ఆ దీప మాఱిపోయినప్పుడు మనము చచ్చిపోవుదము. ఆ దీపము వెలుగుటకై మనమన్నములో నెయ్యి, చమురు వేసికొన వలెను. చమురు లేకపోతే దీపాలు వెలుగవు కదా!"

**గణపతి** (గణపతి – చిలకమర్తి లక్ష్మీనరసింహం)



## మంచుకొండల అందాలను ప్రపంచానికి అందించిన

# నికోలస్ రోరిక్

**- కాండ్రేగుల నాగేశ్వరరావు**

**20**వ శతాబ్దం తొలినాళ్ళకి పాశ్చాత్య చిత్రకళ ఆధ్యాత్మికతకు దూరమవుతూ వచ్చింది. ఆధ్యాత్మికతకు కళలలో ప్రవేశపెట్టిన జ్యూస్, క్రైస్తవ మిషనరీల ప్రాబల్యం తగ్గిపోనారంభించింది. గణితం, భౌతిక శాస్త్రాలలో సాగిన పరిశోధనల ఫలితంగా యేర్పడ్డ నవీన సిద్ధాంతాల రాకతో మత ప్రాబల్యం సన్నగిల్లింది. రోమారోలా కన్నా ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రజలకు చేరువైనాయి. మనిషి మనస్తత్వం అనే కొత్త కోణాలు ఆవిష్కరించబడ్డాయి. ఆ ధోరణిలో పికాసో, డికేంపో వైవిధ్య భరితమైన చిత్రాలు వేశారు. కొత్తగా వచ్చిన ఈ ప్రక్రియల వైపు ప్రజలు మొగ్గారు. కళలో మానవ విలువలను పట్టించుకొనే నాథుడు లేకపోయాడు.

ఈ సంక్లిష్ట సమయంలో మానవతా విలువలకు పట్టం కడుతూ, ప్రకృతిని ఆరాధిస్తూ, ఆ ఆరాధనలో దైవాన్ని దర్శిస్తూ నికోలస్ రోరిక్ చిత్రకళలో ఆధ్యాత్మిక వాదాన్ని పునఃప్రతిష్ఠింప చేశాడు. చిత్రకళ ఆయన ఆధ్యాత్మ చింతనలో ఒక భాగం. మొదట్లో పారిస్ నగరంలో ఆయన చిత్రకళను అభ్యసించారు. అది ఆరంభ, ప్రాథమికదశ వరకే పరిమితము. ఆయన సాధించిన నైపుణ్యం ఏబడిలోనూ అభ్యసించినది కాదు. అది స్వతసిద్ధంగా జన్మతః వచ్చిన వరం. సున్నితమైన వెలుగు రేఖలు అతని చిత్రాలకు జీవనాడి. దానికి కారణం బహుశ ఆ కాంతి రేఖ తదేక దీక్షతో అంతర్ముఖుడయిన అతని యోగ ఫలితం కావచ్చును. ఈ ఆధ్యాత్మ భావన బౌద్ధ ధర్మం నుంచి ఆవిర్భవించినదిగా ఆయన పేర్కొన్నారు.

జారిష్టు రష్యాలో 1874 వ సంవత్సరంలో ఆయన జన్మించారు. తండ్రి ధనవంతుడై, పేరు గడించిన న్యాయవాది, కుమారుని బాగా చదివించాడు. తండ్రి కోరికపై న్యాయశాస్త్రం అభ్యసించాడు. బుద్ధుని శాంతి ప్రవచనాలు ఆయనను ఆకర్షించాయి. వివిధ దేశాల భిన్న సంస్కృతీ రక్షణల కోసం న్యాయశాస్త్ర నిబద్ధమయిన ఒక ముసాయిదాను తయారు చేయటంలో ఆయన న్యాయశాస్త్ర ప్రావీణ్యం అక్కర కొచ్చింది. [Roerich pact to protect the cultural heritage of Nations]

1923వ సంవత్సరం నాటికి ఆయనలో ఆధ్యాత్మిక భావాలు దృఢంగా వేళ్ళూనుకున్నాయి. 1924లో మధ్య ఆసియా దేశాలలో ఆయన విస్తృతంగా ప్రయాణించారు. Central Asian Expedition under his leadership started at Sikkim in 1925. మధ్య ఆసియా పర్యటనలో గంభీరమైన హిమాలయాల సౌందర్యం ఆయన్ను కట్టి పడేసింది. ప్రపంచంలో ఎక్కడ లభించని మానసిక ఆనందాన్ని పొందగలిగాడు. ఉత్కృష్టమైన అలౌకిక భావనలను ఆ హిమ సమూహ కౌగిలిలో పొందగలిగాడు. మరో ఇరవై అయిదు సంవత్సరాలు, 1947లో మరణించేంతవరకు ఆ హిమగిరుల లాలిత్యాన్ని, ఉదయాస్తమయాలను మనోహరంగా చిత్రిస్తూ చివరకూ అక్కడే మంచులా కరిగిపోయారు. ఆ ప్రశాంత ప్రకృతిలో ఒక భాగంగా లీనమయ్యారు. ఇంతవరకూ కేటలాగ్ చేయబడ్డ ఆయన చిత్రాల సంఖ్య 7 వేలకు పైనే.

1923లో భార్యా బిడ్డలతో ఆయన డార్జిలింగ్‌లోని కాంచన గంగ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పట్లో డార్జిలింగ్ సిక్కింలో ఒక భాగంగా ఉండేది. ఒక మంగోలియన్ లామా స్థాపించిన మొనాస్ట్రీస్ 'గూమ్' అనే ప్రాంతంలో మొదట నివాసం ఏర్పరుచుకున్నాడు. మైత్రేయ అనే పెద్ద బౌద్ధ విగ్రహం ఉండేదక్కడ. 15 నెలల పాటు 13వ దలైలామాతో కలిసి నివసించారు. మరొక లామా అయిన మింజర్ దొర్జీతో కలిసి కులూ లోయకు ప్రయాణమైనాడు. తరువాత ఆయన జీవితమంతా కులూలోయలోనే గడిచింది. కులూలో ఉన్నపుడు తాను డార్జిలింగ్‌లో ప్రారంభించిన Himalayan Reserach Institute అనే యూనివర్సిటీని 1929లో కులూ లోయకు తరలించాడు.

ఆయన తన మహాప్రస్థానానికి ముందు హిమాలయాలలో సుదీర్ఘ ప్రయాణాలు చేశారు. ఇండియా, చైనా, సోవియట్ రష్యా, మధ్య ఆసియా, సైబీరియా, ఆల్‌టాయ్, మంగోలియా, టిబెట్ దేశాల మధ్య స్నేహ పూరిత సుహృద్భావాల పెంపు కోసం ఆయన చేసిన సేవ మరపురానిది. అంతవరకూ ఎవరూ ప్రయత్నించని, గుర్తించని హిమాలయ దారులను ఆయన గుర్తించి రికార్డు చేశారు. హిమాలయాలలో కనిపించే అపురూపమైన, అరుదైన, వృక్ష, పక్షి, జంతు సముదాయాలను గుర్తించటంలో, అక్కడ శిథిలావస్థలో నున్న ప్రాచీన, చారిత్రక కట్టడాలను, వాటి వెనుకనున్న చరిత్రను బయటకు తీసుకొని వచ్చి వాటి మూలసంస్కృతిని వెలుగులోకి తీసుకురావటంలో ఆయన చేసిన కృషి మరపురానిది. అక్కడితో ఆగకుండా అక్కడి జానపద గీతాలను వాటి అర్థాలను, నేపథ్యాన్ని అధ్యయనం చేసి రికార్డు చేశారు. ఆయనవొక పురాతత్వ యాత్రికుడు.

20వ శతాబ్దపు తొలి మూడు దశాబ్దాలలో చిత్రకారులు తమ చిత్రాలలో ఆధ్యాత్మికతను పూర్తిగా పరిహరించారని చెప్పటం సత్య దూరం కాదు. ఫిలాసఫీ వయసుడిగిన వారికి మాత్రమే పరిమితమైన తత్వంగా చాలా మంది భావించారు. ప్రపంచ యుద్ధంలో, ప్రజలు ఎదుర్కొన్న ఇక్కట్లు, నిరాశావాదం, అభద్రతాభావం, నిరుద్యోగం దీనికి ముఖ్య కారణాలు. God had not intervened to keep the wolf from the door. దీనికి తోడు నిరుద్యోగం అన్నది అప్పటి మేధావులు అనే మాట. వీరికి భిన్నంగా రోరిక్ తన చిత్రాల ద్వారా శాంతికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రాధాన్యత నిచ్చాడు.

విశ్వకవి రవీంద్రుని చెల్లెలి కుమారుడయిన అసిత్ కుమార్ హాల్దార్ ప్రసిద్ధి గాంచిన బెంగాల్ చిత్రకారుడు. తెలుగువాడయిన ప్రముఖ కళా సమీక్షకుడు, చిత్రకారుడయిన సూర్యదేవర సంజీవ్‌దేవ్ ఆయనకు ఆప్త మిత్రుడు. హాల్దార్ లక్నోలో నివసిస్తున్నపుడు సంజీవ దేవ్ ఆయనకు మిత్రుడు. ఆ కాలంలోనే సంజీవదేవ్‌కు రోరిక్‌తో పరిచయమయింది. అప్పటికి జీవితంలో నాలుగు రోడ్ల కూడలిలో నున్న సంజీవదేవ్‌కు రోరిక్ సాంగత్యంతో ఒక నిర్దిష్టమైన మార్గాన్ని అన్వేషించి, ఎన్నుకునే అవకాశం లభించింది. అంత మాత్రం చేతనే ఆయన వలననే ఈయన జీవన విధానం మారిందని అనుకోలేము. మనలోని స్వభావాలు, గుణాలు అంతర్లీనంగా ఉంటూ పరిస్థితుల ప్రభావంతో ఒక క్రమగతిని పొందుతాయి. నిప్పుకణం లేనిదే మంటను సృష్టించలేము. సంజీవదేవ్‌లో నిద్రాణంగా ఉన్న కొన్ని శక్తులు రోరిక్ పరిచయ స్పర్శతో వికసించినవి. సంజీవదేవ్ రోరిక్ కుటుంబంలో కలిసి కులూలోయలో కొంతకాలం నివసించారు. వారి మధ్యనున్న గురు శిష్యుల అనుబంధం చివరి వరకూ కొనసాగింది.

రోరిక్ మరణానంతరం రోరిక్ కుటుంబ సభ్యులైన అతని భార్య హెలీనా, జార్జి స్వెతస్లోవ్ తిరిగి డార్జిలింగ్ చేరుకున్నారు. సరియైన వసతి లేక పోవటంతో కలింపాంగ్‌లో నివసించారు. 1955వ సంవత్సరంలో హెలీనా మరణించింది. రోరిక్ కుమారులు కులూలోయకు తిరిగి వెళ్ళిపోయారు. అక్కడ నిగ్గర్ అన్న చోట నివసించారు. రెండవ కుమారుడయిన స్వెతస్లోవ్ ఒకనాటి సినీనిర్మాత, నటి అయిన దేవికారాణిని వివాహం చేసుకొని బెంగుళూరులో స్థిరపడ్డారు. అక్కడే తుదిశ్వాస విడిచారు.

రోరిక్ ప్రభావం, జీవన మార్మికత ధోరణులు కొంత వరకూ మనకు ప్రఖ్యాత ఐరోపా చిత్రకారులైన పాల్‌క్లీ, హెన్రీ మాటిస్ చిత్రాలలో తొంగి చూస్తుంది. వారిద్దరూ రోరిక్ ప్రభావానికి లోనయిన వారే. సంజీవదేవ్ చిత్రకళలో కూడా రోరిక్ ప్రభావం దోబూచులాడుతుంటుంది.

హిమాలయాలలో రోరిక్ జీవించినంత కాలం, ఆయన నివాస స్థలం లామాలకు బౌద్ధ భిక్షువులకు యాత్రా స్థలమైంది. రోరిక్‌ను తరుచుగా కలిసిన వారిలో మాజీ భారత ప్రధాని నెహ్రూ ముఖ్యులు. లామాల నుంచి రోరిక్ 'సంబల' జాతి లాంటి వారి జీవన విధానాలకు చెందిన విషయాలు తెలుసుకోవటంలో ఆసక్తిని కనపరచేవారు. హిందూ మూలాల నుంచి భారతీయ తత్వపు మూలాలను ఎంతో ఆసక్తితో ఆలకించేవారు. ప్రకృతిలో పరమేశ్వరుని వెదికే సత్యాన్వేషణలో ఆయన జీవితం గడిచిపోయింది.

**ని**కోలస్ రోరిక్ మ్యూజియం న్యూయార్క్‌లో 319, West 107 St. లో ఉన్నది. అందులో ఆయన ఫోటోలు, జీవిత కథ తాలూకు పుస్తకాలు, ఆయన రచనలు, ఆయన వేసిన వేల చిత్రాలు ప్రదర్శనకు ఉన్నాయి.

సంజీవదేవ్ – రోరిక్‌ల మధ్య ఉత్తరాల పరంపర ఎంతో కాలం సాగింది. అటువంటి ఉత్తరాలు నూటపది వరకు సంజీవదేవ్ వద్ద ఉండేవి. అవన్నీ కాపీలు తీయించి – అసలు ఉత్తరాలను రోరిక్ మ్యూజియంకు అందించే అవకాశం నాకు కల్గింది ఆయన జీవించి ఉండగానే. మ్యూజియం వారు "ఉత్తరాలు చేరినట్లు ఉత్తరం కూడా రాశారు" – అని సంజీవదేవ్ అన్నారు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

***– అశ్వినీకుమార్***

## నికోలస్ రోరిక్‌తో

# నా అనుబంధం

- సంజీవదేవ్



అవి 1945 వేసంగి రోజులు. పంజాబు మైదానాలన్నీ మండుటెండలకు మాడిపోతున్నాయి. కాని అదే సమయంలో, అదే పంజాబులో హిమాలయ ప్రాంతంలోని కులూలోయ మాత్రం యీ మైదానపు ఎండలకు అందక అతీతంగా వుంది. యీ లోయలో పయనించి రోరిక్ నిలయాన్ని చేరుకున్నాను.

ఒక రోజు ఉదయం నికోలస్ రోరిక్ స్టూడియోలో నేనూ, నికోలస్ రోరిక్కూ, ఆయన భార్య మదాం హెలీనా కూర్చొని వున్నాం. మదాం రోరిక్ చెప్ప సాగింది: "మేము లండన్‌లో వుంటుండగా రవీంద్రనాథ్ ఠాకూరు మా స్టూడియోకు ఒక రోజు వచ్చాడు. నికోలస్ రచించిన చిత్రాలన్నిటినీ చాలా ఓపికతోటి, శ్రద్ధతోటి తిలకించి మిక్కిలి ఆనందించాడు. తన కవితకంటె రోరిక్ చిత్రాలే తనకు ఆనందాన్ని ఎక్కువగా ఇస్తున్నాయి అన్నాడు."

ఇంతలో రోరిక్ అందుకొన్నాడు. సంభాషణ – "రవీంద్రుడు తన కవి జీవితాన్ని నా కిచ్చివేసి నా చిత్రకారుని జీవితాన్ని తాను తీసుకుంటానన్నాడు చిరునవ్వుతో. చివరకు జరిగింది కూడా అంతే – ఆయన చిత్రాలూ చిత్రించసాగాడు. నేను కవితలూ అల్లసాగాను" అని రోరిక్ పిల్లవానివలె నవ్వసాగాడు. ఇంతలో చిత్ర ప్రదర్శనపు ఏర్పాట్లు పూర్తిచేసి మొదటి చిత్రాన్ని పీట కెక్కించాడు విష్ణు చరణ్.

ఒక చిత్రమైన తరువాత మరొకటి చొప్పున దాదాపు ఒక నూరు చిత్రాలు పెద్ద పెద్దవి చూడటంతో సరిపోయింది. ఆ పూటకు అన్నీ హిమాలయ చిత్రాలే.

రోరిక్ రంగులు లోక ప్రసిద్ధి చెందినవి. ఆయన రంగుల కాంతులు అధోచేతనలో ఎచ్చటా గోచరించక కేవలం ఊర్ధ్వ చేతనలో మాత్రమే గోచరిస్తాయనే ప్రతీతి. కాని హిమాలయ ప్రదేశాలలో సంచరించిన వారందరికీ ఇటువంటి రంగుల రమ్యకాంతులు ప్రకృతిలో ఉంటాయనే సత్యం అనుభవం లోనిదే. రోరిక్ యొక్క విధానం సగం వాస్తవ వాదంతోనూ, సగం కల్పనా వాదంతోనూ నిండి వుంటుంది.

ఒక సాయంత్రం రోరిక్ నివాసంలోని పైభాగంలో నికోలస్ రోరిక్, మదాం హెలీనా, పెద్దకొడుకు జార్జి, చిన్నకొడుకు స్వెతొస్లావ్, నేనూ కూర్చొని వున్నాం. మధ్య మధ్య చెర్రీపళ్ళను తింటూ ప్రసంగం ప్రారంభించాం.

మదాం హెలీనా "ప్రపంచంలో భౌతిక వాదం రోజు రోజుకు వృద్ధి పొందునట్లు గోచరిస్తుంది, అవునా?" అని నావైపు చూచి అడిగింది. నేనన్నాను "అవును. కానీ ఈ భౌతిక పరిణామాన్ని చూచి ఏ ఆధ్యాత్మిక సాధకుడూ భయపడాల్సిన అవసరంలేదు. ఏమంటే, భౌతిక రూపం వృద్ధి పొందటం అంటే భౌతిక సత్తా క్రమేణా శక్తిరూపంలోకి మారటమే అవుతుంది." తినే తినే చెర్రీపండ్లను అలా ఆపి నికోలస్ రోరిక్ అందుకున్నాడు. "అవును, నీవు చెప్పేది నిజమే – భౌతికవాద ప్రాబల్యంవల్ల ఏ మాత్రమూ భయపడవలసిన పనిలేదు. భౌతిక శక్తి ద్వారా ఆత్మశక్తికి ఇంకా ఎక్కువ బల మబ్బుతుంది. అసలు లోతుకుపోయి తరచి చూస్తే మనం భౌతికమనే దానికి, ఆధ్యాత్మిక అభివ్యక్తిలో తప్ప పెద్ద తేడాలేదు. ఒకే పదార్థానికి రెండు స్వరూపాలు మాత్రమే. ఆధునిక విజ్ఞానాన్ని, వైజ్ఞానికులనూ మనం అభినందించాలిసిందే కాని, నిందించరాదు. విజ్ఞానశాస్త్రం చాలా గొప్పదే. దాన్ని ఉపయోగించే పద్ధతిని మాత్రం మార్చాలి'' ఇద్దరు కొడుకులు కూడా ఈ వాదాన్నే బలపరచారు. చివరకు ఆమె కూడా సమ్మతించింది. ఆమె విశాల హృదయానికి అందరం కలిసి ఆమెను అభినందించాం.

సూర్యాస్తమయం అవుతోంది. పశ్చిమ దిగంతంలోని రక్త కాంతులు చుట్టూవున్న హిమశిఖరాలమీద పడి విచిత్ర శోభ కలుగజేస్తున్నాయి. పూలతోటలో నికోలస్ రోరిక్, నేనూ ఇద్దరం మాత్రమే అటూ యిటూ తిరుగుతూ మౌనంగా ఆ సంధ్యా సౌందర్యాన్ని ఆనందిస్తున్నాం.

నేనే ముందు మౌనాన్ని వీడి, మధ్య ఆసియాలో అన్వేషణానుభవాల నడిగాను. కొద్దిగా నవ్వుతూ "అదంతా ఒక కష్టాలగాథ. అయితే ఆ కష్టాలమధ్య సుఖం లేకపోలేదు.

నికోలస్ రోరిక్ (1874-1947) సంజీవ దేవ్ (1914-1999)

ఆ వెనకటి ప్రయాణాలన్నీ ఇప్పుడొక సుదూర స్వప్నంలాగా గోచరిస్తుంటవి. తూర్ఫాన్‌లోని ఆ చలిబాధ ఇప్పటికి గుర్తుకొస్తూనే వుంటుంది. తర్కిస్తాన్ నుంచి టిబెట్టువైపు కొస్తుండగా దారిలో ఒకచోట మా దళం నిలుపు జేయబడి నాలుగు రోజులవరకూ ఎటు కదలనివ్వలేదు. తినడానికి ఆహారం లేకనూ, మా సామానంతా ఇంకా అక్కడికి చేరనందునా చలికి కప్పుకొనే దుస్తులు లేక చాలా బాధ పడ్డాం. బాధపడడటమే కాదు. ఇక మరణమే శరణ్యమయ్యే స్థితికి వచ్చింది. చివరకు టిబెట్టు ప్రభుత్వం, పై అధికార్ల సహాయముతో ఆ విపత్తునుంచి బయటపడ్డాం!"

క్రమేణా రక్త కాంతి ముదిరి మసక చీకటిగా మారసాగింది. అది వేసంగి అయినప్పటికి చీకటి పడేవరకు చాలా సమయముంది – "టిబెట్టు ప్రాంతపు హిమాలయాల్లో వాతావరణ సంబంధమైన విచిత్రాలు చాలగోచరిస్తవటగా?" అని అన్నా. గడ్డాన్ని సవరించుకుంటూ ఆయన జవాబు చెప్పాడు: "అవును. చాలా అద్భుతాలు, నమ్మడానికి వీలులేని చిత్రాలు అచ్చటి హిమాలయ వాతావరణంలో గోచరిస్తవి. అలాంటి సంఘటన ఒకదాన్ని చెప్తాను. మేము లడాఖ్‌లో సముద్ర మట్టానికి పదకొండువేల అడుగుల ఎత్తునున్న 'నిమూ' అనే గ్రామంలో ఆ రాత్రి మకాం పెట్టి వున్నాం. రాత్రి పదిగంటల వుతుంది. నేను నా డేరాలో గాఢ నిద్రలో వున్నాను. ఆ సమయంలో హెలినా తన పక్కపైన ఉన్ని రగ్గును సరిచేయటానికి లాగే సరికి అందులో నుంచి గులాబి ఊదా రంగుల మంట పైకి లేవసాగింది. ఆమె భయపడి నన్ను నిద్రలేపింది. నేను లేచి ఆ మంటను నలిపివేయ ప్రయత్నించగా ఒక మంట చీలికలుగా చీలి అనేక చోట్ల వ్యాపించింది. చేతికి వెచ్చదనం తప్ప మరేమీ వేడి తగలలేదు. వెలుగు మాత్రం బాగా వ్యాపించింది. ఆ మంటలు ఒక అడుగు ఎత్తువరకు లేచి క్రమేణా వాటంతటవే సమసి పోయాయి. ఇలాంటి విచిత్ర వాతావరణపు ఇంద్రజాలాలు ఎన్నో జరుగుతుంటాయి ఆ ప్రాంతంలోనే."

ఒక ఉదయం, రోరిక్ యొక్క గ్రంథాలయంలో మదాం హెలీనా, నేను కూర్చొని మాట్లాడుకుంటూ వుండగా నికోలస్ రోరిక్ వచ్చి కూర్చున్నాడు. అప్పుడే అమెరికన్ పత్రిక కొక వ్యాసాన్ని వ్రాయటం పూర్తి చేసి వచ్చాడు. ఇంకా కొంచెం సేపటికి నిన్న మొదలుపెట్టిన చిత్రాన్ని పూర్తి చేయాల్సి వుంది. ఈ మధ్య కొంచెం సేపు మా వద్ద విశ్రాంతి తీసుకొనేందుకు వచ్చాడు.

నేనన్నాను – "మీ కీ వయస్సులో రోజంతా శ్రమ జేయటంలో ఏమీ బాధవుండదా? వ్రాయటం కాగానే చిత్రించటం, చిత్రించటం కాగానే దేశ విదేశాలకు జాబులు వ్రాయటం, ఇది కాగానే అది, అది కాగానే ఇది, మీకేమి విసుగుండదా?" భార్యభర్త లిద్దరు నవ్వుకొన్నారు. నికోలస్ జవాబిచ్చాడు: "నేను ఏ పనీ చేయకుండా వుండాల్సి వచ్చినప్పుడు చాల బాధ చెందుతాను. పనిలోనే నాకు ఆనందం! పనిలోనే నాకు తీరిక. కొందరు తమకు ఏమైనా వ్రాయడానికిగాని, చిత్రించడానికీగాని ప్రేరణ లభించటం లేదని నెపం చెప్పి పనినుండి తప్పించుకొంటారు. నిజానికి ప్రేరణ అనేది దానంతటది ఎవరి తావుకూ నడచిరాదు. ప్రేరణను వెదుకుతూ మనమే దాని వద్దకు పోవాల్సి వుంటుంది."

మదాం హెలీనా అన్నది – "జవహర్‌లాల్ నెహ్రూ తన కూతురి ఇందిరతో సహా మా ఇంట ఒక పక్షం రోజులు ఉండి వెళ్ళారు. ఆయన కూడ కష్టించి పని చేసేవాడు ప్రతినిత్యం సరిగ్గా సమయానికి ఎప్పుడూ ఏదో వ్రాస్తూ ఉండే వాడు. మా వద్ద వున్న అనేక కొత్త పుస్తకాలను పూర్తిచేశాడు ఆ పది పదిహేను రోజుల్లో, ఆయన కూతురు ఇందిర ఏమి వ్రాసేది కాదు గాని, ఎప్పుడు చదువుతూ మాత్రం వుండేది. చాలా సున్నితమైన భావాలు గల బాలిక ఆమె."

మా ప్రసంగం క్రమేణ భారతదేశపు కళలపైకి మళ్లింది. రోరిక్ మొదలు పెట్టాడు – "నేను మీ దక్షిణ దేశంలో చాల కాలం క్రిందట సంచారం చేశాను. దక్షిణ భారతపు శిల్ప సంపద ఉత్తరదేశపు దానికంటే ఎంతో ఉత్కృష్టమైంది. దక్షిణ దేశపు ఆ మహాద్భుత దేవాలయాలూ, అందలి శిల్ప వైచిత్ర్యమూ చూచి నేను నివ్వెరపోయాను. అయితే ఆధునిక చిత్రకారుల్లో మాత్రం ఉత్తర దేశంలోనే ఎక్కువ మంది ఉన్నట్లు తోస్తుంది.'

క్రమేణా మా ప్రసంగం సారనాథ్‌లోని బౌద్ధ విహారపు కుడ్యచిత్రాల పైకి తరలింది. రోరిక్ అన్నాడు – "సారనాథ్ కుడ్యచిత్రాలు ఏ మాత్రమూ బాగా లేవు. అనవసరంగా ఆ జపాను చిత్రకారులచే ఆ గోడలు కళాహీనం చేయించారు. ఆ జపాను చిత్రకారులు అటు జపాను సాంప్రదాయాలనూ,

ఇటు భారతీయ సంప్రదాయాలనూ చొప్పించలేదు. అన్ని విధాలా ఆ కుడ్యచిత్రాలు శ్రీ హీనంగా వున్నాయి. భారతదేశంలో అత్యుత్తమ చిత్రకారులుండగా జపాను నుంచి ఎందుకు యీ చిత్రకారులను దిగుమతి చేయాల్సి వచ్చిందో బోధపడకుండా వుంది."

దీనిపై నుండి మా ధోరణి చిత్రకళకు సంబంధించిన రంగు ద్రవ్యాల పైకి దొర్లినది. "నేను వెనక తైల వర్ణాల్లో చిత్రించాను. ప్యాస్టలు రంగులు వాడాను. నీటి రంగులతో చిత్రించాను. కాని కొంతకాలంనుంచి టెంపరా విధానాన్ని మాత్రమే చిత్రిస్తున్నాను. టెంపరా భారతీయ వాతావరణానికి అన్ని విధాలా సరిపోతుంది. ఒక భారతదేశంలోనే, కాక ప్రాచీన కాలపు చిత్రకళంతా దాదాపు కొన్ని మార్పులతో టెంపరా విధానంలోనే సృజించబడి వుంది."

కొంచెం సేపు ఆగి మరల అందుకొన్నాడు. "నేటి భారతీయ కళా విమర్శకులు తమ రచనలను ఎక్కువ పురాతన కళావిషయాలపైన సాగించటంలోనే సంతృప్తి చెందుతున్నారు. జీవించివున్న నేటి భారతీయ కళాకారుల విషయాల గురించి వారికి శ్రద్ధ తక్కువ. పురాతన కళను గురించి ఇదివరకే చాలా రచనలున్నాయి. భారతదేశంలో లోపించిందల్లా జీవించి ఉన్న నేటి చిత్రకారుల కళా కౌశలాన్ని గురించిన రచనలే. పురాతన కళలను వదలివేయాలని నా వుద్దేశం కాదు. దానికి తోడు నేటి కళలను కూడా పైకి తేవాలనే. నేడు భారతదేశంలో అనేకమంది ఔత్సాహిక చిత్రకారులూ, చిత్రకారిణులూ చాలా ప్రతిభ కలవాళ్ళున్నారు. వారి ప్రతిభమను బయటికి తెచ్చేవారు కనిపించరు."

ఆ వర్గానికే చెందుతాడు ప్రొఫెసర్ నికోలస్ రోరిక్. ఆయన జీవితం కళావంతం. ఆయన కళ జీవవంతం. ఇరవయ్యో శతాబ్దం వర్ణకారుల్లో ప్రపంచంలోకల్లా మేటిగా ప్రసిద్ధి గాంచాడు. "రోరిక్ ధూమ్రం" (ఫర్‌ఫుల్) అనే పదాలు ప్రపంచంలోని చిత్రకళలలో ప్రత్యేకత పొందినవి. ప్రథమ రోదసీ యాత్రికుడైన యూరి గగారిన్ తన అనుభవాన్ని వర్ణిస్తూ పృథ్విని చుట్టివున్న వాతావరణం అంతా తనకు రోరిక్ చిత్రాల్లోని రంగులలాగా గోచరించిందని అన్నాడు.

చిత్రకళలోని ప్రతి మాధ్యమాన్నీ, తైలవర్ణాల్నీ, నీటి రంగుల్నీ, పేస్టలు వర్ణాలీ, టెంపరానూ – అన్నీ ప్రయోగించి చూచాడు, ఆయన తన కళాసాధనలో కాని చివరకు టెంపరా విధానాన్ని మాత్రమే స్థిరపరచుకొన్నాడు. టెంపరాగా మాధ్యమికం ప్రత్యేకంగా భారతీయ వాతావరణానికి మారకుండా వుంటుందని అనేవాడు.

టెంపరా విధానంలో కేవలం హిమాలయాన్ని మాత్రమే విషయ వస్తువుగా తీసుకొని వెయ్యి చిత్రాలను రచించాడు. సూర్యోదయంలో హిమశిఖరాలూ, మధ్యాహ్నంలో హిమశిఖరాలూ, సూర్యాస్తమయంలో హిమశిఖరాలూ ఏదో అపార్థివ వర్ణ మాధురిలో జ్వలన రూపంలో కంటికి కనిపించడం మాత్రమేకాక ప్రతి రంగూ, రాగంలోకి రూపాంతరం చెంది చెవికి వినిపిస్తుంది కూడా. ప్రతి దృశ్య రూపానికి ఒక శ్రావ్య ధ్వని కూడా వుంటుంది. అదే విధంగా ప్రతి శ్రావ్య ధ్వనికి దృశ్య రూపం ఉంటుంది. అందుకే చిత్రాలను చూస్తుంటే పరోక్షంగా మనకు సంగీతం వినిపించినట్లుంటుంది. సంగీతం వింటుంటే పరోక్షంగా మనకు చిత్రాలు కనిపించినట్టుంటుంది. అందుకే రాగం 'తోడి రాగం' అనే పదానికి రంగు అని కూడా అర్థం. రాగం 'తోడి రాగం' మాత్రమే అనురాగం కూడా కదూ!

చిత్ర ప్రదర్శనం సాగిపోతూనే వుంది. అందులో 'భారతదేశాన్ని కొస్తున్న లోవ్‌చే" అనే చిత్రం వచ్చింది. దాన్ని చూడగానే రోరిక్ నా వైపు చూచి "ఈ చిత్రంతో నీకు బాగా పరిచయం వుండి వుంటుందను కొంటాను. కారణం నీకు దీని స్కెచ్ నొక దాన్ని పంపానుకదూ మూడేళ్ళ క్రితం" అని నవ్వాడు. ఆయన అద్భుతమైన జ్ఞాపక శక్తికి నేను విస్మితుణ్ణి అయాను.

ఒకనాటి ఉదయం తొమ్మిది ప్రాంతంలో రోరిక్ స్టూడియోలో నేనూ, మదాం హేలీనా రోరిక్, నికోలస్ రోరిక్ ముగ్గురం కూర్చొని వున్నాం. ఆయన చిత్రాలు మాకు ఎదురుగా ప్రదర్శించబడుతున్నవి. అసంఖ్యాక రూపాలూ, అనంతమైన రంగులూ కళ్ళ ముందు మారిపోతున్నవి. ఇంతలో "రష్యాలో ఈస్టర్ దీపాలు" అనే చిత్రం వచ్చింది. అది రాగానే స్టూడియోలోని తలుపులు చాలా వరకు మూయించారు. ఒక విధమైన పగటి చీకటి ఏర్పడింది. ఆ సగం చీకటిలో ఆ చిత్రంలోని దీపాలు ఉజ్వలమై, ప్రోజ్వలమై దివ్యకాంతితో వెలుగుతూన్నట్లు గోచరించినవి. అదీ ఆయన వర్ణ విజ్ఞానం; అదీ ఆయన వర్ణకౌశలం; అదీ ఆయన వర్ణ సృష్టి.

జీవితంలో వైజ్ఞానిక భాగం ఎంత అవసరమో కళాభాగం అంత కంటే ఎక్కువ అవసరం అని ఆయన అంటూండేవాడు. జైల్లో సంగీతం, చిత్రకళా మొదలైన సృజన శీలకళలు ప్రవేశపెడితే ఇక ముందు జైళ్ళుండవలసిన అవసరమే వుండదు.

వర్ణికాభంగంలో ఆయన ప్రతిభ అపారం. ఒక్కోసారీ వ్యతిరేక వర్ణాన్ని దాన్ని కెదురు ఒకటి వుంచడం (Juxtapostion) ద్వారా చిత్రంలో కోరినదాన్ని సృష్టించేవాడు. మరొకసారి వ్యతిరేక వర్ణాన్ని క్రమేణ ఒకదానికి ఒకటి ఐక్యపరచి గొప్ప ఫలితాన్ని సృష్టించేవాడు. ఇంకొకసారి అనుకూల వర్ణాన్ని చిత్రించడం ద్వారా సత్ఫలితాలను సాధించేవాడు. ఒకోచిత్రంలో ఎన్నో విచిత్రకళలను మేళవించి ఇంద్రధనుస్సు ఆభాసను సృష్టించే వాడు. మరి కొన్ని ఒకే వర్ణంలోని వివిధచ్ఛాయల ద్వారా చిత్ర నిర్మాణం జరిగేది. అంతవరకూ చిత్రించబడని చిత్రం అన్నిటికంటె ఉత్తమ చిత్రమట!

మదాం హెలీనా సంగీత విద్యలో కోవిదురాలు. థియసాఫికల్ సొసైటీని స్థాపించిన రష్యన్ వనిత మాదాం బ్లావట్స్కీ ఇంగ్లీషులో రచించిన బృహత్తర గ్రంథం 'Secret Doctrine' అనేదాన్ని హెలీనా రష్యన్ భాషలోకి తర్జుమా చేసింది డాక్టర్ జార్జి రోరిక్ గొప్ప వైజ్ఞానికుడు బౌద్ధపండితుడు, ప్రాచ్య శాస్త్రజ్ఞుడు. ఈ విషయాలమీద ఆయన అనేక గ్రంథాలను రచించాడు. ఇక స్వెతొస్లావ్ రోరిక్ ప్రతిభగల చిత్రకారుడు. దేవికా రాణిని వివాహం చేసుకొన్నాడు.

ఆయన చిత్రాలు తండ్రి చిత్రాల వలెనే ప్రపంచమంతటా ప్రదర్శింపబడినవి. తండ్రి నీడలో పైకి వచ్చినా తండ్రి చిత్రాల ప్రభావం నుంచి ఆయన చిత్రాలు స్వతంత్రంగానే వుంటూ వచ్చినవి చిత్రణ పద్ధతిలో.

వేసవి అంతమయ్యే సూచనలు కనుపించసాగినవి. వర్షాలవల్ల కలగబోయే ప్రయాణపు చిక్కులను గురించి వారంతా నా ప్రయాణానికి ఆమోదించారు. ఉదయం పదింటికి ప్రయాణం నిశ్చయించబడింది. వీడ్కోలుకు ఇంకా ఒక గంట ఆలస్యం వుంది.

అందరం పై అంతస్తులో కూర్చున్నాం. మరొకసారి దక్షిణ ప్రాంతానికి రావలసిందని నికోలస్ రోరిక్‌నూ, ఆయన భార్యనూ ఆహ్వానించాను. మర్యాద కొరకు ఆయన 'సరే' అన్నాడు. ఆమె మాత్రం దక్షిణ ప్రాంతపు ఎండవేడిని భరింపలేనన్నది. పెద్ద కొడుకు జార్జి తప్పక వచ్చి అమరావతీ, నాగార్జునకొండా చూడాలన్నాడు. జార్జి ప్రాచ్య శాస్త్రవేత్త; భాషా శాస్త్రజ్ఞుడు, ప్రత్యేకంగా టిబెటన్ భాషలో మంచి పరిచయం వున్నవాడు. నేను బయలుదేరే సమయం ఆసన్నమయింది. కొన్ని చిత్రాలనూ, పుస్తకాలనూ నాకు బహూకరించారు. మరల ఎప్పుడొస్తావన్నారు. మరల వచ్చే ఎండాకాలంలో అన్నాను.


మదాం హెలీనా అన్నది. "నన్ను ఇదే ఆఖరి మారు చూడటం అవుతుంది. మరల వచ్చే వరకు నేనుండను. నా ఆరోగ్యం రోజు రోజుకు క్షీణించి పోతున్నది, నా జీవితం చాల త్వరలో ముగుస్తుందనే నా నమ్మకం." నికోలస్ రోరిక్ నవ్వి అన్నాడు : ''కాదు నా జీవితవే ముందు అంతమవుతుంది. ఆమెకు ఫరవాలేదు."

మదాం హెలీనా భవిష్యద్వాణి అసత్యమై పోయింది. కాని నికోలస్ రోరిక్ వాణి మాత్రం నిజమై నిలిచింది.

కొందరు కళాకారుల కృతులు వారి జీవితాలకంటె మహోన్నతంగా వుంటాయి. మరికొందరు కళాకారుల కృతులు వారి జీవితాలతో సమానంగా మహోన్నతమై వుంటాయి. వారి జీవితం ఎంత గొప్పదో వారి కళ కూడా అంత గొప్పది. వారి కళ ఎంత గొప్పదో వారి జీవితం కూడా అంతే గొప్పది. వారి జీవితం కళకు జీవాన్నిస్తూంటే వారి కళ జీవితానికే రసాన్నిస్తుంది. రోరిక్ చిత్రాలు రంగులను కాక రంగుల కాంతులను కలిగి వుంటవి.

నికోలస్ రోరిక్ ప్రధానంగా నైసర్గిక చిత్రకారుడు. ఆయన ప్రత్యేకించి హిమాలయ చిత్రకారుడు. "మీరు మీ కళతో హిమాలయాలకు అమరత్వం ప్రసాదించారు" అన్నాను. అందుకాయన గంభీరంగా అన్నాడు. "కాదు – హిమాలయాలే నాకు అమరత్వాన్ని ప్రసాదించినవి."

రోరిక్ రంగుల్లో ఆలోచించేవాడు. రంగుల్లో కలలు కనేవాడు. రంగుల్లో సృష్టించేవాడు. అయినా ఆయన రంగులన్నిటికీ మూలమైన విశుద్ధమైన తెల్లని జగత్తులోనే జీవించేవాడు!



### మానవతా విలువల ప్రతిరూపం

# సర్ ఆర్థర్ కాటన్

- *చెరుకూరి వీరయ్య*

**నీటికోసం ఉద్యమాలు, ప్రజాస్వామిక 'యుద్ధాలు' జరుగుతున్న నేటి వాతావరణంలో, శతాబ్దాల క్రితమే నీటి అవసరాలను, భూమి ఉపయోగాన్ని దర్శించిన యోగి కాటన్ మహాశయుని ముందుచూపు గుర్తుకు తెచ్చుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.**

చరిత్రగతిలో ఎందరో పుట్టారు. వారిలో కొందరు గొప్ప పదవులు పొంది గద్దెనెక్కారు. అపార భోగ భాగ్యాలకు వారసులయ్యారు. కాని చివరికి వారంతా కాలగర్భంలో కలిసిపోయారు. ఎక్కడో చరిత్రపుటల్లో వారి పేర్లు చోటు చేసుకోవచ్చు. వారి సంతతి, వారసులు వారిని గూర్చి తలచుకోవచ్చు. కాని వారికి లోకంతో గానీ, వారితో లోకానికి గానీ ఎట్టి పనీ లేదు – తమ జీవితకాలంలో లక్షలాది ప్రజల జీవితాలను శాశ్వతంగా ప్రభావితం చేసే మహనీయులు అతి కొద్ది మంది మాత్రమే ఉంటారు. వారి పుట్టుకవల్ల, వ్యక్తిత్వం వల్ల, సాధించిన కార్యాలవల్ల, వెదజల్లిన భావాల వల్ల, చరిత్రగతే మారుతుంది. వారినెప్పుడూ చూడని వారు, వారితో మాట్లాడని వారు, చివరికి వారి జీవితకాలం తర్వాత పుట్టిన వారు కూడా అలాంటి కొద్ది మంది మహనీయుల్ని నిరంతరం స్మరించుకుంటారు. అట్టి అరుదైన మహనీయులలో సర్ ఆర్థర్ కాటన్ అగ్రగణ్యుడు. పరదేశీయుడైనా, ఏ భారతీయుడూ, ఏ తెలుగు వాడూ చేయని మహోపకారాన్ని తెలుగుజాతి కొనర్చిన మహనీయు డాయన. వరదలతో దేశాన్ని అతలాకుతలం జేస్తూ, నిరుప యోగంగా కడలిలో కలిసిపోతున్న గోదావరి, కృష్ణలనే జీవనదులను తెలుగు మాగాణం వైపుకు మళ్ళించి, దానిని సస్యశ్యామలం గావించి, ఆకలి మంటలతో అలమటిస్తున్న అభాగ్య ప్రజల కింత అన్నం పెట్టిన పుణ్యాత్ముడు కాటన్ దొర.

తుంగభద్రానదిపై కర్నూలు వద్ద 'సుంకేశుల' ఆనకట్టను నిర్మించి, దాని నుండి కర్నూలు – కడప కాలువలను త్రవ్వించి, ఆ ఉభయ జిల్లాలు సస్యశ్యామలం గావటానికి మూలకారకుడాయన.

గోదావరి, కృష్ణా డెల్టాలలోని కాలువలను అనుసంధించి, కాకినాడ నుంచి మద్రాసువరకు చివరి మజిలీలో బకింగ్‌హాం కాలువ ద్వారా సుమారు 700 కిలోమీటర్ల రవాణా జలమార్గాలను సృష్టించాడు.

1930లో గాంధీ మహాత్ముడు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించడానికి సుమారు 50 ఏళ్ళకు పూర్వమే "ఇండియాలో పేదలకు పెనుభారంగా పరిణమించిన ఉప్పు పన్ను విధించటం మహాదారుణమని బ్రిటీష్ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శించిన బ్రిటీష్ జాతీయుడు ఆర్థర్ కాటన్.

ఇండియాలో జమీందారీ వ్యవస్థవల్ల సమాజానికెంతో కీడు జరుగుతోందనీ, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా దానిని రద్దు చేయాలనీ ఆనాడే కాటన్ సూచించాడు. నూరేళ్ళ తర్వాత గాని, ఆయన సూచన కార్యరూపం దాల్చలేదు. ఆనాడు కాటన్ సూచించిన ప్రకారమే తుంగభద్రానదికి 'మల్లాపురం' వద్దనూ, కృష్ణానదికి 'నందికొండ' వద్దనూ, గోదావరికి 'పోచంపాడు' వద్దనూ డ్యాములు నిర్మించబడి, భారీ జలాశయాలేర్పబడ్డాయి.

ఇండియాలో పనిజేసిన 40 ఏళ్ళు, తర్వాత ఇంగ్లాండులో గడిపిన 40 ఏళ్ళు నిరంతరం మనదేశంలో పుష్కలంగా నున్న నదీజలాలను, మన సంక్షేమం కోసం ఎలా ఉపయోగించాలా? అనే ఆరాటపడ్డాడు. తన ఆశయ సాధనలో ఎన్ని

అవాంతరాలెదురైనా, ప్రభుత్వం నుండి తనకెటువంటి ప్రోత్సాహం లభించకపోయినా, నిరుత్సాహపడక, అకుంఠిత కార్యదీక్షతో ముందుకు సాగిన సాహసి కాటన్ దొర. ఒకటిన్నర శతాబ్దాలనుండి గోదావరి, కృష్ణాడెల్టాలు, ఆంధ్రదేశపు ధాన్యాగారాలుగా విలసిల్లి, ప్రస్తుతం ఆర్థికంగానూ, రాజకీయంగానూ, సాంస్కృతికంగానూ గణనీయమైన ప్రగతిని సాధించాయంటే అదంతా ఆ మహనీయుని చలువే. అందుచేతనే, ఆర్థర్ కాటన్ జన్మించిన రెండు శతాబ్దాలు గడచినా, మనదేశాన్ని వదలిపోయి ఒకటిన్నర శతాబ్దాలైనా, చివరికి కాల ధర్మం జెంది 110 సంవత్సరాలైనా, తెలుగుజాతి ఆ మహనీయుని నిత్యం స్మరించు కొంటూనే ఉంటోంది.

"నిత్య గోదావరీస్నాన పుణ్యోదయో మహామతిః
స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం"

అని అత్యంతభక్తి, శ్రద్ధలతో అనుదినం ఆయనకు అంజలి ఘటిస్తోంది తెలుగు జాతి. కర్మయోగిగా జీవించి, సేవాతత్పరతతో విద్యుక్త ధర్మాన్ని నిర్వహించి ఆధ్యాత్మిక దృక్పథంతో ఆత్మానుభవాన్నీ ప్రజాభిమానాన్నీ పొందిన ధన్యజీవి సర్ ఆర్థర్ కాటన్.

## బాల్యం, విద్యాభ్యాసం :

ఆర్థర్ కాటన్ క్రీ.శ. 1803 మే 15వ తేదీన ఇంగ్లాండులో మత గురువులు నివసించే 'కాంబర్ మీర్ ఆబీ' అనేచోట జన్మించాడు. తండ్రి హెన్రీ కాల్వెలీ కాటన్‌కు ఆర్థర్ పదవ కుమారుడు. ఆర్థర్ కాటన్ వలెనే అతని మరో ఆరుగురు సోదరులు కూడా మానవ సేవలో తరించి, చరితార్థులయ్యారు. ఆర్థర్ జీవితంపై తల్లి మిసెస్ హెన్రీ కాల్వెలీ కాటన్‌యొక్క ప్రభావం ఎక్కువగా కానవస్తుంది. క్రమశిక్షణ, యుక్తాయుక్త విచక్షణ, పట్టుదల, సూక్ష్మగ్రాహ్యత మొదలగు సద్గుణాలు ఆర్థర్‌కు తల్లి నుండి సంక్రమించాయి. బాల్యంలో తల్లి రొట్టె పాలు యిస్తే, వాటితో కాలువలను తయారుచేసి ఆడుకునేవాడు. రోడ్డుపై పాయలుగా చీలిపారే వాన నీటిని, కర్రతో ఒక దానితో మరొక దానిని కలిపి, ప్రక్కకు మళ్ళించి ఆనందిస్తుండేవాడు. భవిష్యత్తులో పంటకాలువలను నిర్మించి వాటిని రవాణా మార్గాలుగా అనుసంధించే ప్రక్రియ చిన్న తనంలోనే కాటన్ మదిలో రూపొందిందన్నమాట. ఆర్థర్ బాల్యం నుండి శ్రద్ధా సక్తులు గల విద్యార్థి. తన 15వ ఏట, 'ఎడిన్‌కోంబ్'లోని మిలటరీ శిక్షణాలయంలో జేరి, ఈస్టిండియా కంపెనీలో ఫిరంగి దళం మరియు మిలటరీ ఇంజనీరింగు సర్వీసులో పనిచేయడానికి శిక్షణపొంది, ప్రతిభావంతుడైన విద్యార్థిగా గుర్తింపుపొంది, 16 యేళ్ళ ప్రాయంలోనే ఏ పరీక్ష వ్రాయనవసరం లేకుండానే, 'రాయల్ ఇంజనీర్స్'కు ఎంపికయ్యాడు. ఈస్టిండియా కంపెనీలో పనిచేయడానికి 1821 సెప్టెంబరులో మద్రాసు వచ్చాడు.

## ఉద్యోగ జీవితం :

మద్రాసు చీఫ్ ఇంజనీరు కార్యాలయంలో లెఫ్టినెంట్‌గా చేరి, ప్రజా సంబంధమైన పనుల వివరాలను తెలుసుకున్నాడు. 1822 మేలో భారత ద్వీపకల్పం – సింహళ ద్వీపాల మధ్యగల 'పాంబన్' కనుమనులోతు చేసే క్లిష్టమైన పనిని పూర్తిచేసి, హిందూ మహాసముద్రం నుండి బంగాళా ఖాతానికి సింహళ ద్వీపాన్ని చుట్టి రాకుండా నౌకలు తిన్నగా పోవటానికి వీలుకల్పించారాయన. మద్రాసు రాష్ట్రంలోని కోయంబత్తూరు, మధురై, తిరునల్వేలి, తంజావూరు, మొదలగు వివిధ జిల్లాలలో ఎనిమిదేళ్ళపాటు చెరువుల నిర్వహణను పర్యవేక్షించి, నీటిపారుదల రంగంలో ప్రాథమికానుభవాన్ని గడించాడు. 1828లో కెప్టెన్‌గా పదోన్నతిని పొంది, కావేరి నీటిపారుదల పథకానికి ప్రత్యేకాధికారిగా నియుక్తులై, క్రీ.శ. 2వ శతాబ్దంలో కావేరి నదిపై కరికాలచోళుడు నిర్మించిన 'గ్రాండ్ ఆనకట్టకు అడుగు తూములను (under sluices) నిర్మించే పనిని విజయవంతంగా పూర్తిచేశారు. ఆ అనుభవంతో, కావేరి నదీపాయయైన 'కాలరూన్' నదిపై రెండు ఆనకట్టలను నిర్మించి, తంజావూరు జిల్లాను వరదల బారి నుండి రక్షించి, సస్యశ్యామలం చేశారు. దీనితో గొప్ప ఇరిగేషన్ ఇంజనీరుగా కాటన్ కీర్తి దేశమంతటా వ్యాపించింది. ఆనాడు బ్రిటీష్ ప్రభుత్వానికి ఇండియాలో వసూలయ్యే మొత్తం రెవెన్యూలో 37 శాతం కావేరీ డెల్టానుంచే లభించేదట!

## గోదావరిపై ఆనకట్ట నిర్మాణం :

1831–40 మధ్య సంభవించిన అతివృష్టి, అనావృష్టి, తుఫానులు, ఉప్పెనలు అప్పటి రాజమండ్రి జిల్లా జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. అపార జననష్టం, ధననష్టం జరిగింది. ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గిపోయింది. అంతకు ముందు 50 సంవత్సరాల నుంచి గోదావరిపై ఆనకట్ట నిర్మాణానికి ఎన్నో ప్రతిపాదనలున్నా, ఏ మాత్రం ప్రతిస్పందించని బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఈ ప్రకృతి వైపరీత్యాలు

ఓ కుదుపు కుదిపాయి. దానితో, 1844లో గోదావరి డెల్టాకు సాగునీటి సౌకర్యాన్ని కల్పించటానికి గల అవకాశాలను పరిశీలించి, నివేదికను సమర్పించవలసిందిగా ప్రభుత్వం మేజర్ కాటన్‌ను ఆదేశించింది. అనుభవజ్ఞులైన సర్వేయర్లూ, ఇప్పటిలాగా ఆధునికమైన, సునిశితమైన సర్వే పరికరాలు, సర్వే మ్యాపులు లేకపోయినా, దేహారోగ్యం సహకరించక పోయినా, ప్రతిరోజూ గుర్రంపై 10 మైళ్లు, తిరిగి, పట్టుదలతో పనిజేసి కేవలం 8 నెలల వ్యవధిలో గోదావరి నది మరియు డెల్టా సర్వేను పూర్తిచేసి, 1845 ఏప్రిల్ 17న ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ఆనకట్ట నిర్మాణానికి రూ. 4,75,572 ల వ్యయాన్ని లండన్‌లోని డైరెక్టర్ల బోర్డు 23-12-1846న ఆమోదం తెలియజేసింది.

గోదావరిపై నిర్మించవలసిన నాలుగు ఆనకట్టల మొత్తం పొడవు 11,945 అడుగులు (2, 1/4 మైళ్లు), అంత పెద్ద ఆనకట్ట అప్పటికి ఇండియాలోనే కాదు, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా లేదేమో? ఆ బృహత్తర నిర్మాణానికి కావలసింది అసాధారణమైన సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాదు. నిర్మాణంలో ఏ ఒడుదొడుకులొచ్చినా తట్టుకొని నిలబడ గలిగే గుండె నిబ్బరం కావాలి. ఆ రెండూ కాటన్‌కి పుష్కలంగా ఉన్నాయి. 1847 మార్చిలో ఆనకట్ట నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. 1848 జూన్‌లో అనుకోకుండా నదికి ముందుగా వరద రావటంవల్ల, సున్నపుకట్టు గట్టిపడనందువల్ల ఆనకట్ట పనికి కొంత నష్టం జరిగింది. అదనంగా, రూ. 1,39,000 కావాలని కాటన్ ప్రభుత్వానికి రాస్తే, విచారణ సంఘాన్ని వేసి, దాని నివేదిక ఆధారంగా అదనపు ఖర్చును మంజూరు చేసింది.

క్వారీ నుండి రైలు మార్గం ద్వారా నది ఒడ్డుకు చేర్చబడిన రాతిని త్వరగా ఆనకట్ట వద్దకు చేర్చి పనిని సకాలంలో పూర్తి చేయాలన్న ఉద్దేశంతో పడవలను వేగంగా తీసుకొని పోవటానికి ఒక స్టీమ్ లాంచి కావాలని రాస్తే ప్రభుత్వ, నిరాకరించింది. కాటన్ సొంత బాధ్యతపై కలకత్తా నుంచి లాంచీని తెప్పించి, పనిని పూర్తి చేసిన తర్వాత, ప్రభుత్వం లాంచీ వినియోగాన్ని ఆమోదించింది. గన్నవరం వద్ద వైనతేయనదిపై రూ.1,60,395ల వ్యయంతో అపూర్వమైన అక్విడక్టును నిర్మించి, వశిష్ట - వైనతేయ నదుల మధ్యనున్న 45,000 ఎకరాల విస్తీర్ణంగల 'నగరం' భూ ఖండానికి సాగు నీటి సౌకర్యం కల్పించారు. కాటన్ గన్నవరం అక్విడక్టు ఇండియాలోనే మొట్టమొదటగా వెలసిన మహాద్భుత నిర్మాణం - 140 సంవత్సరాల సుదీర్ఘ కాలం సేవలందించి, శిథిలావస్థకు చేరిన పాత గన్నవరం అక్విడిక్టు స్థానంలో ఇటీవల 'డొక్కాసీతమ్మ అక్విడక్టు' పేరిట క్రొత్త అక్విడక్టు నిర్మించబడింది.

## కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణం :

కృష్ణానదిపై బెజవాడ వద్ద ఆనకట్టను నిర్మించాలన్న ఆలోచన 18వ శతాబ్దపు చివరి నుండే వుండేది. కాని, కృష్ణానదిపై 3900 అడుగుల వెడల్పు మాత్రమేగల ఇరుకైన లోయలో, 40 అడుగుల ఉవ్వెత్తున ఎగసివచ్చే వరద ప్రవాహంలో ఇసుక పునాదిపై ఆనకట్ట నిర్మాణం అసాధ్యమని, అమిత వ్యయంతో కూడినదని, కేవలం నిష్ప్రయోజనమని గట్టి నమ్మకానికి రావటంవల్ల ప్రభుత్వం కృష్ణపై ఆనకట్ట నిర్మాణానికి సాహసించలేదు. అప్పుడు మద్రాసు ఛీఫ్ ఇంజనీరుగా వున్న కల్నల్ కాటన్ 'నదీ ప్రవాహ ప్రభావానికి ఇసుక పునాది కదలిపోకుండా ఆనకట్టకు ఎగువన, దిగువన రాతి చప్టాతో రక్షణ కల్పిస్తే, ఇసుక పునాది కంటే పటిష్టమైన, మేలైన పునాది మరొకటి ఉండదని "ప్రభుత్వానికి నచ్చజెప్పి, ఆనకట్ట నిర్మాణానికి ఆమోదముద్ర వేయించారు. కాటన్ దొర మన దేశానికి రాకపోయినట్లయితే, కృష్ణపై ఆనకట్ట అప్పట్లో నిర్మాణమై వుండేది కాదనీ, కృష్ణా డెల్టా ఎప్పటికీ కరువు - కాటకాలకు నిలయంగా మిగిలిపోయేదనీ, చాలా మంది అభిప్రాయపడ్డారు. ఆనాడు ఎటువంటి సౌకర్యాలు లేక, నిస్తేజమై, ఒక కుగ్రామంగా పడియున్న 'బెజవాడ' ఈనాడు ఆధునిక సౌకర్యాతో సర్వతోముఖాభివృద్ధి చెందిన 'విజయవాడ'గా విలసిల్లుతోందంటే, అదంతా ఆ కాటన్ దొర చలువే కదా!

మొదటగా 1798లో కృష్ణానది మీద ఆనకట్ట కట్టాలని తలపెట్టినా తర్వాత దానికి కెప్టెన్ బకిల్ అనే ఇంజనీరు రూపం ఇచ్చారు. 1839లో, 1841లో కెప్టెన్ బెస్ట్, కెప్టెన్ లేక్ అనేవారు పూర్తి స్వరూపం కల్పించారు. అప్పుడు మేజర్ కాటన్ సిఫారసు మీద ఈస్ట్ఇండియా కంపెనీ డైరక్టర్స్ బోర్డ్ జనవరి 5, 1850లో ఆమోద ముద్ర వేసింది. 1852లో మొదలయి 1855లో పూర్తయింది. దీనికి సైట్ ఇంజనీరు - డెల్టా రూపకల్పనకర్త కెప్టెన్ ఆర్. వంద సంవత్సరాల తర్వాత 1957లో ప్రకాశం బారేజ్ అదేస్థానంలో నిర్మాణం

జరిగింది. కృష్ణాడెల్టా క్రింద 12 లక్షల ఎకరాలకు రెండు పంటలకూ నీరందిస్తున్నది.

1857లో మద్రాసు ప్రభుత్వాదేశంపై ఆర్థర్ కాటన్ ఒరిస్సాలోని కటక్‌కు వెళ్లి, మహానది డెల్టా అభివృద్ధికి ఒక బృహత్తర పథకానికి రూపకల్పన చేసి, ప్రభుత్వానికి సమర్పించారు.

బీహార్‌లో సోన్ నదిపై నీటిపారుదలకు, నౌకాయానానికి అనుకూలించే విధంగా, 'బీహారు ప్రాజెక్టు'కు కాటన్ నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలు చేశారు. గంగానదిపై బ్యారేజిని ప్రతిపాదించారు. అదే, తర్వాత నిర్మించబడిన ఫరక్కా బ్యారేజి, కరాచి నుండి కాన్పూరు, కలకత్తా, భత్కార్, మద్రాస్, మంగళూరు నగరాలతో వర్తక సదుపాయాలను కల్పించటానికి 4000 మైళ్ళ పొడవుగల రవాణా జలమార్గాలను 30 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించటానికి ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం మన 'జాతీయ జలసమాఖ్య ఆలోచనలో వున్న గంగా – కావేరి నదుల అనుసంధానానికి ఆనాటి కాటన్ ప్రతిపాదనే ప్రాతిపదికగా నిలచింది.

మద్రాసు నుండి నాగపూరు వరకు నౌకలు పోవటానికి అనుగుణంగా గోదావరి నదీ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఆ ప్రాజెక్టు మధ్యలో ఆగిపోయింది. దుమ్ముగూడెం వద్ద గోదావరిపై నిర్మించబడిన ఆనకట్ట లాకులు దానిలోని భాగమే.

1858లో మద్రాసు ప్రభుత్వం ఆర్థర్ కాటన్ విశిష్ట సేవలకు గుర్తింపుగా, గవర్నర్ సర్ ఛార్లెస్ ట్రెవిల్యాన్ పేరుతో విడుదలైన గెజిట్ ప్రకటనలో, 'ఎన్నో ఉన్నత పదవుల నలంకరించి, ప్రజలలోనే ఎంతో పలుకుబడిని సంపాదించుకొన్న వ్యక్తులు కాలగర్భంలో కలిసి, నామరూపాలు లేకుండా పోవచ్చు. కాని, ఈతరానికే గాక, భావితరాలకు చెందిన కోట్లాది మంది ప్రజల హృదయాలలో కల్నల్ కాటన్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనీ ప్రశంసించింది.

ఆర్థర్ కాటన్ ఇండియాలో పదవీ విరమణ చేసి ఇంగ్లాండుకు వెళ్ళిపోయిన తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం 1860లో 'సర్' బిరుదుతోనూ 1866లో, నైట్ కమాండర్ ఆఫ్ స్టార్ ఆఫ్ ఇండియా (కె.సి.యస్.ఐ.) వంటి అత్యున్నత బిరుదుతోనూ సన్మానించింది. మన దేశానికాయన చేసిన విశిష్ట సేవల వల్ల ఎంతోమంది భారతీయులు, ముఖ్యంగా ఆంధ్రులు, తమిళులు ఎంతో ప్రయోజనాన్ని పొంది, సుఖ సంతోషాలతో జీవిస్తూ, కాటన్‌ను ఆరాధ్య దైవంగా పూజిస్తూ వుంటే, బ్రిటీష్ ప్రభుత్వాధికారుల్లో కొందరు కుత్సిత బుద్ధితో, ఓర్వలేని తనంతో కాటన్ ఆనాడు చేసిన ప్రతిపాదనలకు వక్రభాష్యాలు చెప్పి, 75 ఏళ్ళ వృద్ధాప్యంలో ఆయన్ని వేధించారు. సర్ ఆర్థర్ కాటన్‌ను సాక్షిగా పిలిపించి, 'హౌస్ ఆఫ్ కామన్స్ సెలెక్ట్ కమిటీ' ముందు నిలబెట్టి, ఎన్నో తలా తోకాలేని ప్రశ్నలడిగి చికాకు పెట్టారు. నీతి, నిజాయితీ, చిత్త శుద్ధిగల కాటన్ ఆ ప్రశ్నలన్నిటికీ ఘాటైన జవాబులిచ్చారు. "ఏ విషయాన్నీ నేను స్వార్థానికి వినియోగించుకోలేదు. ఈ వృద్ధాప్యంలో ఏ ఉపకారం చేయమనీ నేను ప్రభుత్వాన్ని కోరటం లేదు – ఇండియాలో సాగునీటి వనరులను అభివృద్ధి పరచి, ఆ దేశపు పురోభివృద్ధికి చేయూత నివ్వటమే నా ముఖ్య ధర్మంగా భావించాను. దైవకృపవల్ల నా ఆశయం కొంతవరకు సిద్ధించింది" అని ఎంతో ఆవేదనతో చెప్పారు కాటన్.

సర్ ఆర్థర్ కాటన్ ఎన్నో ఉన్నత పదవులనలంకరించి, ఎన్నో గొప్ప గొప్ప బిరుదులను పొందినా, కనీసం సొంత యింటిని కూడా సమకూర్చుకోలేదు. భాగ్యవంతులైన బావమరదులు ఇల్లుకట్టించి, యిచ్చే వరకు ఆయనకు సొంత యిల్లు లేదంటే, ఆయన ఎంతటి నీతివంతుడో, ఎంతటి నిజాయితీ పరుడో మనకర్థమవుతుంది. ఇంగ్లాండులోని తన యింట్లో గోడలపైన, మేజా బల్లలపైన ఉన్న విలాస వస్తువులనన్నిటినీ తొలగించి, అక్కడ భారతదేశపు నదుల చిత్రపటాలను వుంచి, ఆ నదుల జలాలను భారతీయుల సుఖ, సంతోషాలకై ఎలా వినియోగించాలా? అనే నిరంతరం ఆరాటపడ్డారు కాటన్. భారతదేశంలోని పేదరికం, తదితర సమస్యల పరిష్కారం కోసం ఇంగ్లాండులోని ఉన్నతాధి కారులతో తరచుగా ఉత్తర, ప్రత్యుత్తరాలు జరిపేవారు. 'మాంచెస్టర్ ఇండియన్ అసోసియేషన్', దాదాబాయి నౌరోజి కార్యదర్శిగా వున్న 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్'లోనూ ఇండియాలో నీటిపారుదల పథకాల నిర్మాణావశ్యకతను గురించి నొక్కి చెప్పేవారు. "ఇండియాలో జలవనరులకు లోటు లేదు – ఎటొచ్చీ పాలకుల్లో తెలివితేటలే లోపించాయి" అని కాటన్ కుండబద్దలు గొట్టినట్లు బ్రిటీష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తక్కువ వ్యయంతో నీటిపారుదలకు,

జలరవాణాకు ఉపయోగపడే కాలువలను త్రవ్వటానికి బదులు, అధిక వ్యయంతో కూడిన రైలు మార్గాల నిర్మాణాన్ని బ్రిటీష్ ప్రభుత్వం ఇండియాలో చేపట్టటాన్ని కాటన్ దుయ్యబట్టేవారు.

"పేదరికం, అజ్ఞానం, నిరక్షరాస్యత" భారతీయులను పట్టి పీడిస్తున్న మహమ్మారులు. వాటిని నిర్మూలించటానికి ఏ బ్రిటీష్ అధికారీ ప్రయత్నించటం లేదనీ, బ్రిటీషర్లు పన్నులు వసూలు చేసుకునే బిల్లు కలెక్టర్లేగాని, ప్రజాక్షేమం గోరే రాజనీతిజ్ఞులు కారని" కాటన్ ఆవేదన చెందేవారు.

'స్వదేశమైన ఇంగ్లాండు కంటే పరదేశమైన భారతాన్నే అధికంగా ప్రేమించాడా?' అన్న భావాన్ని అందరిలో కలుగజేశారు కాటన్. వార్ధక్యంలోనూ నిర్విరామంగా కృషిచేసి, 'ఇండియాలో నీటిపారుదల – జలమార్గాలు' అనే అంశంపై మ్యాపును రూపొందించి, ప్రభుత్వానికందజేశారు కాటన్.

## కాటన్ దొర వ్యక్తిత్వం :

ఆర్థర్ కాటన్ ఎంతటి సమర్థుడైన ఇంజనీరో, అంతటి ఉదాత్తుడైన వ్యక్తికూడా. ఆయన యుద్ధ తంత్రంలో శిక్షణ బొందిన ఇంజనీరే. కాని, శత్రు సేనలతో ఆయన యుద్ధం చేసింది కేవలం 1824లో ఒకే ఒక మొదటి బర్మా యుద్ధంలో మాత్రమే. ఆయన జీవిత పర్యంతం ప్రజాశ్రేయస్సుకై నదులతో అవిశ్రాంతంగా పోరాడాడు. చేసిన ప్రతిపోరాటంలోనూ విజయం సాధించాడు.

ఆయన జన్మించిన ఇంగ్లాండులో నీటిపారుదల రంగానికి చెప్పుకోదగిన ప్రాముఖ్యం లేదు. పెద్ద నీటిపారుదల కాలువలు, కట్టడాలు లేవు. ఇండియాకు వచ్చే వరకు నీటిపారుదల పథకాల పరిశీలన, పరికల్పన, నిర్మాణం మరియు నిర్వహణలపై ఆయనకెటువంటి అవగాహన లేదు. అయినా, గోదావరి, కృష్ణ వంటి పెద్ద నదులపై తన మేధాసంపత్తితో, అకుంఠిత కార్యదీక్షతో శ్రమించి, అపూర్వమైన, అద్భుతమైన ఆనకట్టలను కట్టాడంటే అదంత సామాన్య విషయం కాదు. అంతటి ఘనకార్యాలను సాధించినా ఏ మాత్రం గర్వపడలేదు. పైగా ప్రాచీన భారతీయ ఇంజనీర్ల నిర్మాణ కౌశలానికి ప్రతీకగా కావేరిపై నిల్చిన 'గ్రాండ్ ఆనకట్ట' మొదలగు బ్రహ్మాండమైన కట్టడాల నుంచి తాను పొందిన స్ఫూర్తి, అనుభవం వల్లనే తాను ఆనకట్టలను నిర్మించ గలిగానని ఎంతో వినమ్రతతో చెప్పుకొనేవాడు.

ఆయన నిర్మించిన ఆనకట్టలు, అక్విడక్టులు, ఆయన మస్తిష్కం నుండి వెలువడిన మౌలికాలోచనలే గాని, భారతదేశంలో అంతకు ముందెక్కడను వున్నవి కావు. తాను చేపట్టిన వినూత్న ప్రక్రియలతో ఎటువంటి క్లిష్ట సమస్యలెదురైనా, వాటిని ఎక్కడైనా చూచికానీ, ఎవరితోనైనా సంప్రదించి గానీ, పరిష్కరించుకోటానికి అవకాశమేలేదు. తానొక్కడే ఆలోచించుకొని పరిష్కరించుకోవాల్సిందే! దానికెంతో ఆత్మ విశ్వాసం, మనోనిబ్బరం, ఏకాగ్రత, పట్టుదల కావాలి?

ఆధునిక సాంకేతిక నైపుణ్యం, యంత్ర పరికరాలు, సిమెంటు మొదలగు నిర్మాణ పదార్థాలు లేని ఆరోజుల్లో $2\,^1/_4$ మైళ్ళ పొడవున్న గోదావరి ఆనకట్టను కేవలం అయిదేళ్ళ లోనూ, గన్నవరం అక్విడక్టును 8 నెలలలోనూ, కృష్ణా ఆనకట్టను మూడేళ్ళలోనూ పూర్తిచేయగలిగాడంటే, అతని సామర్థ్యం ఎంతటి అనన్య సామాన్యమైనదో, మనమూహించు కోవచ్చు.

## నిరంతర పరిశోధనాశీలి :

ఆర్థర్ కాటన్ నిరంతర పరిశోధనాశీలి. అనారోగ్యం వల్ల సెలవుపై ఆస్ట్రేలియాకు వెళ్లినపుడు, వూరకే వుండకుండా, స్వంత ఆలోచనతో రోటరీ ఇంజనను తయారుచేసి దానిపై ప్రయోగాలు చేశాడు కాటన్. ఆ సందర్భంలో ఇంజనుకమర్చిన బాయిలర్ బ్రద్దలై, కాళ్ళకు తీవ్రంగా గాయలాయ్యాయి. దానినేమాత్రం లక్ష్యపెట్టక ఇంజను చక్రం నిమిషానికి 150 చుట్లు తిరిగినందుకు సంతోషించాడు.

70 ఏళ్ళ పైబడిన వృద్ధాప్యంలో అత్యంత వేగంగా పోయే ఒక త్రిచక్ర శకటాన్ని రూపొందించి, కొండపై నుండి అమితవేగంతో క్రింది దిగివస్తూ దాని బ్రేకుల్ని పరీక్షించే సమయంలో, ఆ సైకిలుపై అదుపుతప్పి, ప్రక్కనున్న ముళ్ళ కంచెపై పడి గాయాలపాలయ్యాడు కాటన్. అయినా, చివరికి ఆ శకటాన్ని రూపొందించటంలో కృతకృత్యుడయ్యాడు.

ఆర్థర్ కాటన్‌కు జల రవాణాపట్ల ఆసక్తి మెండుగా వుండటం వల్ల పంట కాలువలలో ప్రయోగానికి అనువైన పడవకు ఆకృతిని రూపకల్పన చేశాడు.

ఇండియాలో వ్యవసాయానికి భూతల జల వనరులు లేనిచోట, భూగర్భ జలాన్ని వెలికి దీయటానికి వాయుశక్తిని

(wind power) ప్రప్రథమంగా ప్రతిపాదించిన ఇంజనీరు ఆర్థర్‌కాటన్, 84 ఏళ్ళ ముసలి తనంలో తనకు బొత్తిగా పరిచయం, అనుభవంలేని వ్యవసాయంపై పరిశోధనలు సాగించి కృతకృత్యుడయ్యాడు. భూమిని లోతుగా దున్ని ద్రవరూపంలో నున్న ఎరువును వేయటంవల్ల అధిక దిగుబడి పొందవచ్చునన్న కాటన్ సిద్ధాంతం ఇంగ్లాండులోనే గాక, ఆస్ట్రేలియా, వెస్ట్ ఇండీస్ మొదలగు దేశాలలో అమలు పరచబడి, ద్రాక్ష, కాఫీ తోటలలో అధికోత్పత్తిని సమకూర్చి పెట్టింది.

బర్మా యుద్ధ కాలంలో తనపై అధికారితో పేకాడి, ఉన్న డబ్బంతా పోగొట్టుకుని, ఇక జీవితంలో మరెప్పుడూ పేకాడలేదు. ఇంగ్లాండులో తన పొరుగింట్లో వున్న వ్యక్తి మద్యపాన వ్యసనానికి బానిసై, దుర్మరణం చెందటం గమనించి, విచలితుడై తానెప్పుడూ మద్యం ముట్టకూడదని నిశ్చయించుకొని అనారోగ్య సమయంలో వైద్యుని సలహాపై కూడా మద్యం తీసుకోటానికి అంగీకరించలేదు. ఆర్థర్ కాటన్ ఇండియా వదలి, ఇంగ్లాండుకు వెళ్ళిన తరువాత కూడా, గోదావరి డెల్టా ప్రజలు కృతజ్ఞతాభావంతో ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవారు. ప్రపంచ రంగంలో మానవ హక్కుల కోసం అవిశ్రాంతంగా, ధైర్యంగా పోరాడిన వీరసైనికుడు 1899 జులై 24న తేదీన, తన 96వ యేట తుది శ్వాస విడిచారు.

**ముగింపు :**

జాతి, మత, వర్ణ విభేదాల కతీతంగా మానవ సేవకు జీవితం అంకితం చేసిన విశ్వమానవుడు సర్ ఆర్థర్ కాటన్. ప్రతి యేటా మే 15వ తేదీకి 'భారత ఇంజనీర్ల సంస్థ కాటన్ జన్మదినోత్సవాన్ని నిర్వహించి, ఆ మహనీయుడు సాధించిన మహత్కార్యాలను సింహావలోకనం చేసుకొంటోంది. సమాజంలో మానవతా విలువలు, నైతిక విలువలు, పరోపకార చింతన కొరవడుతున్న ప్రస్తుత తరుణంలో కాటన్ వంటి మహోన్నతుల జీవితం మన కాదర్శ ప్రాయం కావాలి. పాలకవర్గం, యువత, ముఖ్యంగా ఇంజనీర్లు కాటన్ మహాశయుని చిత్తశుద్ధి, దృఢ సంకల్పం సేవానిరతి మొదలైన సద్గుణాల నుండి స్ఫూర్తిని పొంది, వాటిని కొంతవరకైనా అలవరచుకొని, నిస్వార్థంగా, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలి.

## ఛలోక్తి

అలవోకగా ఛలోక్తులు విసరడంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారికి ఎవరూ సాటిరారు. రాష్ట్రంలో సాంఘిక సేవకు అంకితమై పోయిన కొందరు ప్రముఖులకు గుర్తింపుగా బిరుదులు ఇవ్వాలని నిర్ణయించి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఆంధ్రరత్న కూడా సభ్యులుగా ఉన్నారు.


ప్రముఖ సాంఘిక సేవకురాలు దువ్వూరి సుబ్బమ్మగారికి 'దేశబాంధవి' అని ఇవ్వాలని నిర్ణయించారు. అంతా బాగానే ఉందన్నారు. మరో దేశభక్తునికి 'దేశ బాంధవ' అని ప్రదానం చెయ్యాలని నిర్ణయించారు. వెంటనే దుగ్గిరాల వారు నిలబడి "మీరు దేశబాంధవి, దేశ బాంధవ అని ఇస్తే వారిద్దరికీ ఏదో సంబంధం ఉందని చాలామంది అపోహపడే ప్రమాదం ఉంది. కనుక మార్చండి" అని సూచించారు. కమిటీ, వారి సూచనను పాటించింది.

ఒకసారి జ్వరపడి మంచంలో ఉన్న దుగ్గిరాల వారిని పరామర్శించటానికి వెళ్ళారు దువ్వూరి సుబ్బమ్మగారు. ఆయనను పలకరించి "జ్వరం ఎక్కువగా ఉందా?" అంటూ చెయ్యి పట్టుకు చూడసాగింది. "అసలే జ్వరంతో బాధపడుతుంటే పైగా పాణిగ్రహణం కూడానా" అన్నారట ఆంధ్రరత్న ఛలోక్తిగా.

## ఏకాంత సేవ

రవీంద్రుని గీతాంజలి తెలుగులో అనువాదాలైతే చాలా వచ్చాయి. వచనంగా, వచన కవితలుగా వచ్చినవే ఎక్కువ. గేయాలుగా వచ్చిన వాటిలోనైనా భావాలకు లభించినంత ప్రాధాన్యం రాగానికి, లయకు చేకూరలేదు. ఇట్టి పరిస్థితిలో గీతాంజలి లాంటి ఒక మధుర భక్తి కావ్యం తెలుగులో లేకపోయిందే నన్న వెలితిని నివారించడం కోసం ప్రభవించిన భక్తి భావనోద్వేగాల మధుర కవితా వాహిని "ఏకాంతసేవ" (రచించిన వారు వెంకట పార్వతీశ్వర కవులు. రచనాకాలం 1922).

తెల్లవారగట్ల పెళ్ళివారిని లేపే మనోహరమైన సన్నాయి పాటలా పోలుస్తారు దీన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు.



# మాటలకందని పయనం

రావూరి భరద్వాజ

మా పూర్వీకులది వరంగల్లు సమీపంలోని మట్టెవాడ ప్రాంతమట. మాకక్కడ చాలా భూములు కూడా ఉండేవట. ఏ కారణంగానో ఆ ప్రాంతాన్ని వదిలి, గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామానికి వలసవచ్చారట.

నందిగామ తాలూకా కంచికచర్లకు సమీపంలో మొగులూరు మా స్వగ్రామం. అది పరిటాల జాగీరులోనిది. ఆ గ్రామంలో సంగయ్య, ఆదెయ్య, కోటయ్య, మల్లయ్య అని నలుగురు అన్నదమ్ములు. వారిలో ఇద్దరు నాకు తెలుసు. ఆదెయ్య పెద్దకూతురు మల్లికాంబ. ఆమే మా అమ్మ. మా అమ్మకు నలుగురు సంతానం. నేను పెద్దవాడ్ని. రెండవ సంతానం మా చెల్లెలు కోటీశ్వరమ్మ. మూడవ సంతానం సుందరమ్మ. నాలుగవ సంతానం నారాయణమూర్తి.

మాకున్న 20 ఎకరాల పొలంలోనూ, 17 ఎకరాల పొలం దుబారా కింద ఖర్చు చేశాడు మా నాన్న. నాటకాలు, భజనలు, సంఘసేవ, చిన్నచిన్న ఉద్యమాలవంటి వాటిల్లో తిరగడం వల్ల, భూముల్ని అమ్ముకొని బతకవలసి వచ్చింది. ఫలితంగా దరిద్రం మమ్మల్ని చుట్టుముట్టింది.

మా నీరు కొండపొలంలోనూ, మా తూర్పుపొలంలోనూ, మా నాన్న, మా అమ్మ, నేను కూలిపనులు చేసుకొని బతికాం. నాకు అయిదవ ఏటనే అక్షరాభ్యాసం చేశారు. ఆ చేసినవారి పేరు కొల్లిపర కోటయ్యగారు. మా పెదనాన్నకూ, మా నాన్నకూ కూడా ఆయనగారే అక్షరాభ్యాసం చేశారు. ఎందుకనోగానీ మాకెవ్వరికీ “చదువు” అబ్బలేదు. 1942 నాటికే, నేను చదువు మానేశాను. అప్పటికి నాకు 15 సంవత్సరాలు. అలా మానేయడానికి ప్రత్యక్ష కారణం, మా స్కూలు హెడ్‌మాస్టరు గారయితే, పరోక్ష కారణం మా కుటుంబాన్ని ముసిరిన దరిద్రం.

స్కూల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీకి వచ్చిన రోజున కూడా నేను చిరిగిన లాగు, చిరిగిన చొక్కా తొడుక్కున్నానన్న కారణంతో, మా హెడ్మాస్టరుగారు ముందుగా నన్ను నుంచోబెట్టారు. తరువాత వంగోబెట్టారు. ఆ తరువాత గొడ్డును బాదినట్టు బాదారు. ఆ దెబ్బలను భరించలేకపోయాను. మాస్టరు చేతిలోని బెత్తాన్ని విరిచేశాను. పుస్తకాల సంచిని ఆయన మీదికి గిరాటు వేశాను. బండబూతులు తిడుతూ పారిపోయాను. వేణుగోపాల స్వామివారి రథంలోనూ, గాలిగోపురం సందులోనూ, చెరువుకట్టల మీదా, కొండమీది గుడిమెట్ల మీదా దాక్కొన్నాను. చాలాకాలం తరువాతగానీ, ఇంటికి రాలేదు.

అప్పుడప్పుడే తాడికొండలో, కొత్త రకం రాజకీయాలు వీచడం ప్రారంభించాయి. ఈ కొత్తగాలిని తీసుకొచ్చినవారు చిర్రా రామకోటి రెడ్డిగారు. యువజనసంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యవసాయ కూలి సంఘాలు, రైతు సంఘాలు, బాల సంఘాలు వారేర్పాటు చేశారు.

“రష్యా” అన్న దేశాన్ని గురించి, ఆయనగారు పదేపదే చెబుతూ ఉండేవారు. ఆ దేశంలో పేదరికం లేదట. అలాంటి సమాజం కావాలని ఆ తరం వారందరూ ఆశించారు. నేనూ ఆశించాను. అందుకోసం మీటింగులు పెట్టారు. ఊరేగింపులు జరిపారు. వీటన్నింటిలోనూ నేనూ పాల్గొన్నాను.

డా. రావూరి భరద్వాజ, ఫోన్: 040-23348631

తిండికోసం – పిడికెడు మెతుకుల కోసం – నేను వ్యవసాయ కూలీగా పనిచేశాను. పశువుల కాపరిగా పనిచేశాను. ఒక కో ఆపరేటివ్ స్టోర్స్‌లో, సరుకులందించే కుర్రాడిగా పనిచేశాను. పొగాకు బారన్‌లో బొగ్గువేసే కూలీగా పనిచేశాను. ఒక కలప అడితీలో రంపంలాగే కూలీగా పనిచేశాను. ఒక కమ్మరి దగ్గర తిత్తులూదడానికీ, సమ్మెట వేయడానికీ కుదిరాను. కొంతకాలం పేపర్ బాయ్‌గా కూడా పనిచేశాను.

రెండవ ప్రపంచయుద్ధం ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. యువకులను మిలటరీలోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వం రకరకాల ప్రకటనలు చేస్తున్నది. 1944 నాటికి నా వయస్సు 17 సంవత్సరాలే! కానీ పద్దెనిమిదేళ్ళని అబద్ధమాడి, కొలతలకు తూకాలకు సిద్ధపడ్డాను. రెండుసార్లు బరువు తక్కువగా ఉన్న కారణంగా సెలక్టు కాలేదు. మూడవసారి ఒక దయామయుడు నాకో ఉపాయం చెప్పాడు. ఎత్తు, గుండె చుట్టుకొలతలు ఒకచోట చూస్తారు. బరువును మరొకచోట చూస్తారు. అందుకని ముందుగా ఎత్తును, గుండె చుట్టు కొలతను చేయించుకొని, బరువు చూసే చోటుకు వెళ్ళబోయే ముందు పుష్కలంగా అరటిపళ్ళు తిని, నాలుగైదు గ్లాసుల నీళ్ళు తాగి, బరువు తూచే మెషిను మీద నిలబడ్డాను. బొటాబొటిగా బరువు సరిపోయింది. నేను సెలక్ట్ అయ్యాను. ఒక సంవత్సరం పాటు నాకు తిండి సమస్య, గుడ్డ సమస్య, గూడు సమస్య లేదు.

ఆ దయామయుని పేరు పురుషోత్తంగారు. వారిది తాడికొండకు సమీపంలోని లాం అన్న గ్రామం. అరటిపళ్ళకి కావలసిన ఒక్క అణాడబ్బులు వారే ఇచ్చారు. ఓ సంవత్సరం పాటు, నేను పాములపాటి వెంకటకృష్ణయ్య గారి సెంటర్‌లోనే ఉన్నాను. యుద్ధం అయిపోయింది. అందర్నీ విడుదల చేశారు.

1945–46 సంవత్సరాలు మరీ నరకప్రాయాలు. మా నాన్నగారి రాజకీయాలు వేరు, నా రాజకీయాలు వేరు. రాజకీయంగా మా ఇద్దరికి పడదు. అందుకని ఊళ్ళో ఉన్నప్పటికీ, ఎప్పుడోగానీ ఇంటికి వెళ్ళేవాణ్ణి కాదు. ఎవరింట్లోనో తినడం, ఏ గుడిలోనో, అరుగుమీదనో నిద్రపోవడం అలవాటయింది. ఎక్కడా ముద్ద దొరకనప్పుడు, చెరువులోని నీళ్ళు తాగి, మెట్లపక్కనే ఉన్న మండపంలో నిద్రపోయేవాణ్ణి. నేను మా ఊరు వెళ్ళిన ప్రతిసారీ, ఆనాడు నాకు అన్నంపెట్టిన అమ్మలనూ, నేను పడుకొన్న గుడిగోపురాలనూ, తిరిగిన చెరువు కట్టలనూ, చెరువమ్మనూ పలకరించి వస్తుంటాను.

నాకసలు చదువు రాదు. కానీ ఒకానొక అవమానం నన్ను చదువువైపు మళ్ళించింది. నాకన్నా వయసులో చిన్నవాడయిన ఓ కుర్రాడు మనుచరిత్రలో ఉండే ఓ పద్యం అప్పగించాడు, మా ఊరి లైబ్రరీ అరుగులమీద. అందరూ ఆ కుర్రాణ్ణి మెచ్చుకొన్నారు. శేషయ్యగారనే మా నాన్న స్నేహితుడు, ఆ కుర్రాడితో నన్ను పోలుస్తూ తిట్టాడు. చుట్టూ ఉన్నవారందరూ నవ్వారు. ఆ నవ్వు నన్ను గాయపరిచింది. ఆ గాయం నాలో పట్టుదలను రెచ్చగొట్టింది. పగలంతా కూలిపని నాలిపని చేసుకొనేవాణ్ణి. రాత్రిపూట మా వూరి శివాలయంలోని ప్రమిద వెలుతురులో చదువుకొనేవాణ్ణి. బాలభారతి గ్రంథాలయంలో చాలా పుస్తకాలుండేవి గానీ, వాటిని చందాదారులకు మాత్రమే ఇంటికిస్తారు. సంవత్సరం చందా మూడు రూపాయలు. ఆ చందాను చెల్లించి తనపేర పుస్తకాలు తీసుకొని చదువుకొనే అవకాశాన్ని కొల్లూరు వెంకటేశ్వర్లుగారన్న మహా దాత నాకు కలిగించాడు. ఆయన ఋణం తీర్చుకోవడం కోసం 1965వ సంవత్సరంలో "పాకుడు రాళ్ళు" నవలను వారికి అంకితమిచ్చాను.

ముందుగా పద్యాలు రాశాను. అందులో గణ, యతి ప్రాసలు తప్ప కవిత్వం ఉండేది కాదు. జీవన ప్రభాత్ అన్న ఒక కథకుని ప్రోత్సాహంతో కొవ్వలివారి నవలలు, చలంగారి పుస్తకాలు, కుటుంబరావు పుస్తకాలు, గోపీచంద్ పుస్తకాలు చదవడం ప్రారంభించాను. వారిలాగే కథలు రాయడం ప్రారంభించాను. వాక్యం తరువాత వాక్యం వచ్చేదికాదు. దృశ్యాన్ని అక్షరబద్ధం ఎలా చేయాలో బోధపడేది కాదు. అయినా రాసి పత్రికలకు పంపుతుండేవాణ్ణి. కొన్ని తిరిగొచ్చాయి. కొన్ని ఏమయి పోయాయో తెలీదు. ఈ రాతకోతలకు కావలసిన ఒక వైలెట్ పెన్సిల్‌ను, ఒక దస్తా కాగితాలను త్రిపురనేని శివరామకృష్ణయ్యగారన్న స్నేహితుడు నాకోసారి కొనిపెట్టాడు. ఆ ఋణం తీర్చుకోవడం కోసం "ఇదంజగత్" అన్న నవలను, అతనికీ, వారి ధర్మపత్ని గారికీ కలిపి అంకితమిచ్చాను ఆ తరువాత అచ్చయిన నా తొలి కథ పేరు "విమల". అది 1946 ఆగస్టు 26వ తేదీ నాటి "ప్రజామిత్ర" వారపత్రికలో అచ్చయింది. ఆ తరువాత చాలా కథలు చాలా పత్రికలలో వచ్చాయి.

1946 చివరలో నెల్లూరుకు సమీపంలో "యువజన కాంగ్రెస్ శిక్షణా శిబిరం" కార్యక్రమానికి నేను హాజరయ్యాను. చాలామంది పెద్దపెద్ద నాయకులను నేనప్పుడే చూశాను. కళా వెంకట్రావు, పొట్టిశ్రీరాములు, ఆచార్యరంగా, ఎ.సి. సుబ్బారెడ్డి, రేబాల చంద్రారెడ్డి లాంటి వారెందరినో దర్శించుకొన్నాను. మా నాన్నగారికి, రంగాగారితో ఉన్న పరిచయం కారణంగా, నా గురించి నెల్లూరు వెంకట్రామానాయుడు గారికి సిఫార్సు చేసి "జమీన్ రైతు" వారపత్రికలో నాకో చిన్న ఉద్యోగం ఇప్పించారు రంగాగారు. అంతక్రితం ఆ ఉద్యోగాన్ని ఆచార్య ఆత్రేయ చేస్తూ ఉండేవాడు. నాటకాలమీద అభిమానంతో ఆత్రేయ ఆ ఉద్యోగాన్ని మానేశాడు. నేనా ఉద్యోగంలో చేరాను. అప్పుడే నాకు మరికొందరు పెద్దవారితో పరిచయాలేర్పడ్డాయి. మరుపూరి కోదండరామిరెడ్డి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, చంద్రశేఖర కణ్వశ్రీ, నారపరెడ్డి రామిరెడ్డి, ఉండేల మాలకొండారెడ్డి వంటి వారెందరితోనో పరిచయాలయ్యాయి.

1947 ఆగస్టు 15వ తేదీనాడు "సుప్రభాతం" అన్న పుస్తకాన్ని వీధి వీధి తిరిగి, అమ్మగా వచ్చిన డబ్బులన్నీ ప్రచురణకర్తకిచ్చి, పెన్నా నదిలోని నీళ్ళు తాగి, ఆ పొద్దునే, కాలే కడుపుతో నిద్రపోయాను.

వెంకట్రామానాయుడు గారొకసారి, ఫలానావారికి వ్యతిరేకంగా రాయమన్నారు. 'నేను రాయ'నన్నాను. 'అయితే ఉద్యోగం మానెయ్య'మన్నారు. ''సరే''నని మానేశాను. పెళ్ళకూరు గోపాలకృష్ణారెడ్డిగారు, పొగతోట ప్రాంతంలో ''దీనబంధు'' వారపత్రికను ప్రారంభించేదాకా నరకం అనుభవించాను. ఆ బాధలను అనుభవిస్తున్న రోజుల్లో నాకు అంతో ఇంతో సాయంచేసిన మరో దయామయుడు ఉండేల మాలకొండారెడ్డి.

నేనో చిన్న ప్రేమ వ్యవహారంలో ఇరుక్కున్నది కూడా అప్పుడే! "దీనబంధు" కార్యాలయానికి ఎదురుగా, ఓ పెద్ద పెంకుటిల్లు ఉండేది. అదో వెలియాలిది. ఆమె పేరు నాగరత్నం. ఆ ఇంట్లోనే, చామనచాయగా ఉండే ఓ బక్కపలుచని పిల్ల ఉండేది. ఆమెపేరు రోహిణి. ఆ పిల్లకు అమ్మెవరో తెలీదు. చిన్నపిల్లగా ఉన్నప్పుడే, నాలుగైదు రూపాయలకో, ఇంకా తక్కువకో, ఆ పిల్లను కొనుక్కొన్నది నాగరత్నం. ఆ పిల్లచేత కూడా "వ్యాపారం" చేయించాలని నాగరత్నం ఆలోచన. పుస్తకాలకోసమూ, పత్రికలకోసమూ ఆ పిల్ల తరచుగా, దీనబంధు కార్యాలయానికి వస్తూ ఉండేది. ఆ పిల్లకు ఎడంవేపున గొగ్గిపన్ను ఉండేది. చిన్న పులిపిరి కూడా బుగ్గమీద ఉండేది. ఆ పులిపిరి కనబడకుండా, జుత్తును బుగ్గలమీదిదాకా జార్చుకొనేది. గొగ్గిపన్ను కనిపించకుండా బిగబట్టి నవ్వుతూ ఉండేది. వీటి మాటకేంగానీ, రోహిణి కళ్ళు చాలా అందంగా ఉండేవి. నీలంరంగులో మెరిసిపోతూ ఉండేవి. ఆమెను పెళ్ళి చేసుకొందామనుకొని, మా నాన్నకు, మునిమాణిక్యం గారికి, చలంగారికి ఉత్తరాలు రాశాను. చలంగారు మాత్రం "గో ఎహెడ్" అని జాబు రాశారు. ఈ పెళ్ళి జరగకపోవడానికి, నా పేదరికమే కారణం! నాగరత్నం "అమ్మాయికి సొమ్ము" పేరుతో మూడువేలు కావాలన్నది. "నా దగ్గర మూడు రూపాయలు కూడా లే"వన్నాను. ఆ తరువాత కొద్దిరోజులకే, గూడూరులో ఉన్న ఒక మైకా వ్యాపారికి రోహిణినిచ్చి "నిషేక మూహూర్తం" నిర్ణయించింది నాగరత్నం.

ఆ రోజునే నే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, తాడికొండకొచ్చాను. నా ఈడు వాళ్ళందరకూ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఒకరిద్దరు బిడ్డల తండ్రులు కూడా అయ్యారు. సాధ్యమయినంత తొందరగా పెళ్ళి చేయాలని, మా అమ్మనాన్నల అభిప్రాయం. నాలుగయిదు సంబంధాలు చూశారు. నాకు కులాల పట్టింపు లేదనీ, ఎక్కడబడితే అక్కడే తింటాననీ, ఆస్తిపాస్తులేమీ లేవనీ, ఏ ఉద్యోగమూ లేదనీ, ఏ పనీ చేతకాదనీ – వంటి కారణాలతో, పిల్లనివ్వడానికెవరూ ముందుకు రాలేదు. రాకపోవడమే మంచిదనిపించింది. సరిగ్గా అదే సమయంలో కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, తోటరావులపాడు గ్రామవాసి, మేడూరి మల్లయ్యగారు, తాడికొండ వచ్చారు. మమ్మల్ని చూశారు. మా విషయాలన్నీ వాకబు చేశారు. తన కూతురును చూసుకోవడానికి, ఫలానా తేదీనాటికి రమ్మన్నారు. తోటరావులపాడుకూ, మా మేనమామగారి ఊరయిన మొగులూరుకూ మధ్య నాలుగయిదు మైళ్ళ దూరముంది. నేను, మా అమ్మ, నాన్న, మా మేనమామ శేషయ్యగారు కలిసి, మల్లయ్యగారు రమ్మన్న సమయానికి తోటరావులపాడు చేరుకొన్నాం. నాకు పెళ్ళి కాదేమోనన్న భయంతో, మా మేనమామగారు నా గురించి, మా ఆస్తిపాస్తులను గురించి, చాలా ఉబికించి చెప్పాడు. నేను స్కూలు ఫైనల్‌దాకా చదివాననీ, తెలుగులో ఒక్కమార్కు తక్కువ

రావడంవల్ల పరీక్ష తప్పాననీ, నెల్లూరులో ఉద్యోగం చేస్తున్నాననీ, నెలకు 60 రూపాయల జీతమనీ, మూడెకరాల పొలమూ, రెండు ఇళ్ళు ఉన్నాయనీ చెప్పాడు.


మల్లయ్యగారూ, నేనూ ఊరికి దగ్గరగా ఉన్న మామిడితోపులో కూచున్నప్పుడు అసలు సంగతి చెప్పాను.

"నాకు పెళ్ళి కాదని, మా మేనమామగారి భయం. అందుకే చాలా అబద్ధాలు చెప్పాడు. నేను 7వ తరగతి పాసయ్యాను. నెల్లూరులో నేనిప్పుడు ఉద్యోగం చేయడంలేదు. చేసినప్పుడు కూడా నా జీతం 20 రూపాయలు మాత్రమే! మూడెకరాల పొలంలేదు. రెండిళ్ళున్నాయి. ఒకటే మాది, మరొకటి మా తాతగారిది" అన్నాను. "ఈ సంగతులన్నీ నాకు తెలుసు. అన్నీ చెప్పావుగానీ, రోహిణి సంగతి చెప్పలేదే? అన్నారు మల్లయ్యగారు. "ఆ సంగతి మీకెలా తెలుసు?" అన్నాను.

"మునిమాణిక్యంవారు చెప్పారు. ఆయన నాకు మంచి స్నేహితుడు. నా రెండవ కూతురు పేరు కాంతం. ఆయన కథలు చదివాకే, ఆ పేరు మా అమ్మాయికి పెట్టుకొన్నాను. నేనూ పేదవాణ్ణే! గింజలు దంచి, పేడతొక్కి బతికాను. దాచుకోకుండా మీరు నిజం చెప్పారు. నిజం చెప్పినవారికి పిడికెడు మెతుకులు దొరుకుతాయన్న నమ్మకం నాకున్నది. మీకో పిడికెడు అన్నం దొరికితే, సగం నా బిడ్డకు పెట్టి, మిగిలిన సగం మీరు తింటారన్న నమ్మకం నాకున్నది. అందుకనే, మా అమ్మాయిని మీకిద్దామనుకొంటున్నాను.

ఇంటికొచ్చాం. పిల్లను చూడమన్నారు. నేను చూడనన్నాను. 1948 మే 28వ తేది రాత్రి, పెళ్ళిపీటల మీద కూచుని, జీలకర్ర, బెల్లం కలిపి నెత్తిమీద పెడుతున్నప్పుడు మాత్రమే నేను పెళ్ళికూతుర్ని చూశాను. పెళ్ళయింది. అమ్మానాన్నల బరువు తీరింది గానీ, నా బరువు పెరిగింది. నాకేమో ఉద్యోగం లేదు. చేయడానికి ఏ పనీ చేతకాదు.

సరిగ్గా ఆ సమయంలోనే, తెనాలి నుండి ఆలపాటి రవీంద్రనాథ్ గారు నాకో కార్డు రాశారు. "ఈ ఉత్తరం అందగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి రండి" అని. ఈ ఉత్తరం వచ్చిన రోజున మా నాన్న ఊళ్లో లేడు. భోషాణంలో ఉన్న కందిపప్పు కుండలోంచి, అయిదు




రూపాయలు తీసుకోమని మా అమ్మ చెప్పింది. అక్షరాలా అయిదు రూపాయలు మాత్రమే తీసుకొని, గుంటూరుదాకా నడిచి, రైలెక్కి తెనాలి చేరాను. తెనాలితో అంతకుముందు నాకు కొంచెంగా పరిచయముంది.

రవీంద్రనాథ్‌గారు జ్యోతి, రేరాణి, సినిమా అన్న మూడు పత్రికలను నడుపుతున్నారు. జ్యోతి, రేరాణి పత్రికలను ధనికొండ మనుమంతరావుగారు చూస్తుంటే, సినిమా పత్రికను మాగాపురామన్ చూస్తుండేవాడు. ఈ మూడు పత్రికల సంపాదకత్వ బాధ్యతలలో నాకూ భాగముండేది. చాలామంది కొత్త కథకులను నేను ప్రోత్సహించాను. ఎంత పాతవారయినా, వారు రాసినవి నచ్చకపోతే, నిర్మొహమాటంగా తిప్పి పంపేశాను.

నెలకు జీతం పాతిక రూపాయలు. వేరే గది, అద్దెకు తీసుకోవడానికి ఈ జీతం చాలదు. అందుకని హొటల్లో భోజనం చేసి, జ్యోతి ప్రెస్‌లోనే పడుకొంటూ ఉండేవాణ్ణి. శారద, ఆలూరి భుజంగరావు, ప్రకాశరావు, అబ్బరాజు నాగభూషణం, కవిరావు, వీరమల్లు రామకృష్ణ, తాళ్లూరి నాగేశ్వరరావు, "అమరశ్రీ", శార్వరి వంటి రచయితలతో నాకప్పుడే సన్నిహిత పరిచయాలేర్పడ్డాయి.




ఒక చిన్నమాట పట్టింపు కారణంగా ఆలపాటి వారివద్ద ఉద్యోగం మానేశాను. నాలుగయిదు మాసాలు ఖాళీగానే ఉన్నాను. కథలమీద వచ్చే రాబడితోనే రోజులు వెళ్ళదీస్తూ ఉండేవాణ్ణి. అన్నింటికీ ఇబ్బందులే! చేజాచి ఎవర్నీ అడగను, అడగలేను. ఒకవేళ అడిగినా ఇచ్చేవారూ లేరు! నా అవస్థను చూడలేని శార్వరి, నా కోసం ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. మారిస్ పేటలో, నలందా ప్రెస్ ఉన్నది. దాని యజమాని పేరు కోగంటి రాధాకృష్ణమూర్తి గారు.

ఆయన రాడికల్ హ్యూమనిస్టు. ఆ భావాలను ప్రచారం చేయడంకోసం ''సమీక్ష'' అన్న మాసపత్రికను నడుపుతుండేవారు. ఆ పత్రికలో నాకు ఉద్యోగం సంపాదించి పెట్టాడు శార్వరి.

రాధాకృష్ణమూర్తిగారికి ప్రజాసాహిత్య పరిషత్తు అన్న ప్రచురణల సంస్థ కూడా ఉండేది. ఉత్తమస్థాయికి చెందిన చాలా పుస్తకాలను ఈ సంస్థ ప్రచురించింది. "సమీక్ష" పత్రికతో బాటుగా, ప్రజాసాహిత్య పరిషత్తు పని, నలందా ప్రెస్ పని కూడా నాకే అప్పగించారు రాధాకృష్ణమూర్తిగారు. అన్నం తినకపోయినా, రాత్రిపూట నిద్రపడుతుంది గనక, రాత్రి భోజనం మానేసి, పగలు మాత్రమే తినేవాణ్ణి. ప్రెస్‌లోనే పడుకునేవాణ్ణి.

ఆకలి మంటల్ని బలవంతాన అణచిపెట్టడంవల్లా, అదీ కుదరనప్పుడు, మంచినీళ్ళతో ఆ మంటల్ని చల్లార్చుడంవల్లా, నా ఆరోగ్యం పాడయిపోయింది. మందులు తినలేను. ఉద్యోగం మానుకోలేను. సెలవు పెట్టలేను. సెలవుపెట్టి ఎక్కడికెళ్ళను? వెళ్ళినా ఎవరు చూస్తారు? తెనాలిలో, ఎక్కువమంది స్నేహితులూ, తక్కువమంది బంధువులూ ఉన్నారు. పరిచయమున్నవారిని నేనడగను. ఆత్మీయులైనవారు నాకన్నా దరిద్రులు.

ప్రెస్ పని అయిపోగానే నేను లక్ష్మి దగ్గరకెళ్ళి కూచుంటూ ఉండేవాడిని. ఆవిడ 'వృత్తి' చేసుకొని బతుకుతూ ఉండేది. ఆ ఇంట్లో ఆమెగాక, జైబూన్, చిత్ర అన్నవారుండేవారు. వీరుకాక కొంతమంది అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండేవారు. ఈ వ్యభిచార గృహ యజమాని పేరు సాంబయ్య. ఈయన నా మిత్రుడైన అబ్బరాజు నాగభూషణానికి దగ్గర మిత్రుడు.

ఈ ఇంటి వారెవ్వరూ, మూడు నాలుగు మాసాలదాకా నన్ను నమ్మలేదు. "అవసరం" కోసం వస్తున్నాననుకొనేవారు. నేను 'అందుకు' రావడంలేదని వారికి నమ్మకం కుదిరాక, తమ గొడవలన్నీ నాతో చెప్పుకొన్నారు. వాటిని ఆధారం చేసుకొని నేను చాలా కథలు రాశాను. రాశాక వారికి వినిపించాను. వినిపించాకనే పత్రికలకు పంపించాను.

ఈ ముగ్గురిలోనూ లక్ష్మి, జైబూన్ నాకు తెనాలిలో పరిచయమయ్యారు గానీ, చిత్ర నెల్లూరులోనే పరిచయమయింది. ఎక్కువ డబ్బిచ్చి కొనుక్కొన్న గూడూరు మైకా వ్యాపారి, తన మోజు తీరిపోయాక రోహిణిని, ఇంకో వ్యభిచార గృహ యజమానికి అమ్మాడు. అక్కడ నుండి, చిత్ర పేరుతో ఆమె తెనాలి చేరుకొంది. ప్రతిరోజూ ఈ ముగ్గురినీ కలుసుకొంటూ ఉండే నేను, రెండు మూడు రోజులు రాకపోయేసరికి వారికి అనుమానమొచ్చింది. లక్ష్మి నా కోసం వచ్చింది. నన్ను తనతో తెచ్చుకొని, మేడమీది గదిలో నన్నుంచి, నాకు మందులిప్పించి, జబ్బును నయంచేయించింది.

ఇది జరిగిన రెండు మూడు వారాలకే కళ్ళకు మసకలు వచ్చాయి. లక్ష్మి, జైబూన్ చిత్ర కలిసి, నాలుగు రూపాయల ఎనిమిదణాలకు నాకో కళ్ళజోడు కొనిపెట్టారు. ఆ కళ్ళజోడు ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది! ఈ లోకమంతా, 'చెడిపెలు'గా దుమ్మెత్తిపోసిన ముగ్గురు కరుణాంతరంగిణులు కొనిపెట్టిన ఆ కళ్ళజోడును, ఓ గొప్ప బహుమానంగా నేనిప్పటికీ భావిస్తుంటాను!

నేను చేయని పనిని చేశానంటూ, వేడూరి మల్లయ్యగారు నా మీద ఒక అపవాదు వేశారు. దానికి క్షమాపణ చెప్పిందాకా, ఆ ఇంటి గడప తొక్కకూడదను కొన్నాను. 1952 జూలైలో ఆయన క్షమాపణ చెప్పారు. 1952 సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో గానీ కాంతం కాపురానికి రాలేదు.

కాపురానికొచ్చిన తొలిరోజుల్లో, వంటినిండా నగలతో లక్ష్మీదేవిలా ఉండేది కాంతం. కానీ ఏం లాభం? మూడు సంవత్సరాలు గడపకముందే ఆమె నిరాభరణ సుందరిలాగా మారిపోయింది. ఎక్కడెక్కడి చుట్టాలో వచ్చి మాసాలకొద్దీ ఉండేవారు. వెళ్ళమని చెప్పలేను. ఉంచుకొని పోషించనూలేను. కాంతం కాపురానికొచ్చాక నా జీతం 40 రూపాయలు చేశారు రాధాకృష్ణమూర్తిగారు. అద్దెపోను మిగిలిన 22 రూపాయలు రెండు వారాలకు కూడా సరిపోయేవి కావు.

ఈలోగా "సమీక్ష" పత్రిక ఆగిపోయింది. ప్రజాసాహిత్య పరిషత్తు ప్రచురణలు ఆగిపోయాయి. నలందా పబ్లికేషన్స్ అన్న సంస్థ వెలిసింది. ఈ సంస్థ పక్షాన 1వ తరగతి నుండి 5వ ఫారందాకా టెక్స్టుపుస్తకాలు ప్రచురించాం. కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలు తిరిగి – జిల్లా బోర్డుల్లోనూ, మున్సిపల్ స్కూళ్ళలోను ఈ పుస్తకాలు పెట్టించాను. వేలాది రూపాయల అమ్మకాలు జరిగాయి.

కానీ జీతం పెరగలేదు. పెంచమని అడిగాను. ఎంత కావాలన్నారు రాధాకృష్ణమూర్తిగారు. కాగితం మీద ఖర్చులన్నీ రాసి 60 రూపాయలు ఇవ్వమన్నాను. ఆయనగారు కుదరదన్నారు. అయితే ఉద్యోగం మానేస్తానన్నాను. ఇది 1955 డిసెంబరులో జరిగింది.

రచయితగా నన్ను ఎంతగానో ప్రోత్సహించిన ధనికొండ హనుమంతరావుగారు, అంతకుముందే మద్రాసుకు వెళ్ళిపోయారు. కొంతకాలం "చందమామ" కార్యాలయంలో పనిచేశారు. ఆ తరువాత సొంతంగా "అభిసారిక" పత్రికను ప్రారంభించారు. ఆ దరిమిలా "జ్యోతి", "చిత్రసీమ" పత్రికలను ప్రారంభించారు.

1956 జనవరి మొదటి వారంలో నేను మద్రాసులో కాలుమోపాను. ఈ ప్రపంచం చాలా విశాలమయింది. చాలా విచిత్రమయింది కూడా. మద్రాసు మహానగరం నుండి, అక్కడి మనుషుల నుండి, అక్కడి వాతావరణం నుండి, నేను చాలా పాఠాలు నేర్చుకొన్నాను. వందలమంది రచయితలో, కవులతో, పత్రికా సిబ్బందితో, సినిమా వారితో పరిచయాలయ్యాయి. ఊహకు కూడా అందని సందర్భాలను నేను చవిచూశాను. వీటిని ఆధారం చేసుకొని, నేను "పాకుడురాళ్ళు" నవలను రాశాను. ఆ నవలలోని అన్ని పాత్రలూ నాకు బాగా తెలిసినవారి ప్రతిరూపాలే! ఆ నవలలోని అన్ని సంఘటనలూ, నాకు తెలిసినవారి జీవితాలలోంచి ఏరుకొన్నవే!! ధనికొండవారికీ నాకూ, మాట పట్టింపు వచ్చిందొకసారి. "మీరింకెక్కడన్నా ఉద్యోగం చూసుకోండి వచ్చే నెలనుండి" అన్నాడు ధనికొండ.

నా గుండెల్లో రాయిపడింది! సొంతవూరును వదిలేశాను. తెలిసిన తెనాలినీ వదిలేశాను. అమ్ముకోవడానికి కూడా ఏమీ లేవు. అయినవారెవ్వరూ సాయం చేయరు. అయినా – నేను దాసోహమనడానికి సిద్ధపడలేదు. "మానదలచుకొన్నప్పుడు, నెలాఖరుదాకా దేనికి? ఈ రోజునించే మానేస్తున్నాను. ఈ నిమిషం నుండీ నీవు యజమానివీ కాదు, నేను పనివాణ్ణీ కాను" అన్నాను. ఇద్దరం కలిసి రామకృష్ణా లంచ్ హోమ్‌లో కాఫీ తాగాం. బిల్లు నేనే ఇచ్చాను.

అంతకుముందు నేను కోడంబాకంలో ఉండేవాణ్ణి. ధనికొండ వారి ప్రెస్ పనికోసమని, జార్జి టౌన్‌లోని ఆర్మీనియన్ స్ట్రీట్‌కు ఇల్లు మారాను. ఆ ఇంట్లోనే ఉంటున్న కె.వి. రత్నంగారికి, రాణీ అండ్ కంపెనీ అన్న కలాల కంపెనీ ఉంది. నా ఉద్యోగం ఊడిన సంగతి వారితో చెప్పాను. తన కంపెనీలో ఉద్యోగమిచ్చా రాయన. నెలకు వంద రూపాయల జీతం. అద్దె, కరెంటు ఖర్చులు పోను, చేతికి యాభై రూపాయలొచ్చేవి. ఈ డబ్బుతో నేను, కాంతం, మా పెద్దబ్బాయి రవి, కూతురు పద్మ బతకాలి – బతికాం. "ఎలా బతికా?"రని అడక్కండి. ఆ బాధలు, క్షోభలు, అక్షరాలకు అందవు.

మద్రాసులో జ్యోతి పత్రికలో ఉన్నప్పుడు, కథా రచనలో కొన్ని ప్రయోగాలు చేశాను. సమస్యాత్మక కథలు రాసి, ముగింపు పాఠకుల కొదిలేశాను. సామాజిక సమస్యలను, పౌరాణిక పాత్రలకూ, జానపద వాతావరణానికీ అన్వయించి చాలా కథలు రాశాను. అవన్నీ పఠితలను అలరించాయి. ఆ మద్రాసులోనే, పొట్టకూటికోసమూ, నా అవసరాల కోసమూ, అపరాధ పరిశోధక రచనలూ రాశాను.

కలాల కంపెనీ ఉద్యోగంలో కూడా రవరవలు రేగాయి. ఒక యజమాని, ఒక పనివాడు ఒకే ఇంట్లో ఉంటున్నప్పుడు, పనివాడి భార్య, యజమాని భార్య దృష్టిలో ఎలా ఉండేదీ అనుభవరీత్యా గ్రహించాను. ఈ రత్నంగారు కూడా – "కంపెనీ పరిస్థితులు బావోలేదు. ఇంకెక్కడన్నా ఉద్యోగం చూసుకో!"మన్నాడు. "మంచిది!" అన్నాను.

ఆ రాత్రే విషమ పరిస్థితినంతా తెనాలి మిత్రుడు నాగభూషణానికి రాశాను. వాడు – ఈదర లక్ష్మీ నారాయణగారికి చెప్పాడు. ఈ లక్ష్మీనారాయణగారు చక్రపాణిగారికి మంచి స్నేహితుడు.

అప్పటికే చక్రపాణిగారు, హైదరాబాదులో, యువ ప్రెస్ పెట్టారు. "యువ" మాసపత్రికను కూడా ప్రారంభించాలని వారి ఉద్దేశం. సరిగ్గా అప్పుడే ఈదరవారి సిఫార్సు చక్రపాణిగారికి చేరింది. నేనూ చక్రపాణిగారిని కలిశాను. తెనాలిలో ఉన్నప్పుడే చక్రపాణిగారు నాకు తెలిసినా, ఉద్యోగం అడిగేటంత చనువు వారితో నాకు లేదు. చక్రపాణిగారు, నన్ను హైదరాబాదు వెళ్ళమన్నారు. నేను సరేనన్నాను. 1959 ఏప్రిల్ మాసంలో



చక్రపాణి



గోపీచంద్

మద్రాసుకు వీడ్కోలు చెప్పి హైదరాబాదుకు వచ్చాను. 1950 నుండి నాకు పరిచయమున్న త్రిపురనేని సుబ్బారావు వచ్చి నన్ను కలిశాడు. మేమిద్దరం కలిసి, గోపీచంద్‌గారిని కలిశాం. గోపీచంద్‌గారితోనూ, నాకు తెనాలిలో కొంచెం పరిచయముంది. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో నాకు తెలిసినవారు చాలామంది పనిచేస్తున్నారు. గోపీచంద్, బుచ్చిబాబు, భాస్కరభట్ల, మునిమాణిక్యం, స్థానం, కృష్ణశాస్త్రి, శ్రీవాత్సవ, జనమంచి, నండూరి విఠల్ – వారందరూ విజయవాడ రేడియో కేంద్రంలోనూ, మద్రాసు రేడియో కేంద్రంలోనూ పనిచేసినవారే!



దేవులపల్లి కృష్ణశాస్త్రి,

హైదరాబాదు రేడియో కేంద్రంలో స్క్రిప్టురైటర్ ఉద్యోగం ఖాళీగా ఉన్నదని, తొలి సారిగా నాకు చెప్పినవారు విఠల్‌గారు. నేనా ఉద్యోగం కోసం ప్రయత్నించాను. త్రిపురనేని సుబ్బారావు, నర్రా కోటయ్య నా గురించి గోపీచంద్ గారికి గట్టిగా సిఫార్సు చేశారు. అప్పటి స్టేషన్ డైరక్టర్ జి.పి.యస్. నాయర్‌గారికి నా గురించి బాగా చెప్పారు అయ్యర దేవర కాళేశ్వరరావు గారు. ఈ కాళేశ్వరరావుగారు మా నాన్న గారికి బాగా తెలిసినవారు.

1959 నవంబరు 25వ తేదీన, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో, గ్రామస్థుల కార్యక్రమ విభాగంలో స్క్రిప్టురైటర్‌గా ప్రవేశించాను. జీతం 180 రూపాయలు. 27 సంవత్సరాల పాటు ఆకాశవాణిలో పనిచేశాక, 1987 జూలై 4వ తేదీన ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగవిరమణ చేశాను.

ఆకాశవాణి నుండి నేను చాలా నేర్చుకొన్నాను. మనుషుల్లో – ఎలాంటి ఉత్తములుంటారో, ఎలాంటి అధమాధములుంటారో ఆకాశవాణి నాకు సోదాహరణంగా వివరించింది. డిగ్రీలు లేని నా చదువు – నన్ను నానాయాతనలకూ గురిచేసింది. సంవత్సరాలకొద్దీ నేను చేసిన పనులు, చేయడానికి పనికిరావన్నారు. ఏ పనీ రానివారిని పీఠంమీద కూర్చోబెట్టి, వారికి నన్ను సహాయకునిగా చేశారు. అయిదేళ్ళపాటు చిన్నపిల్లల కార్యక్రమాలను దిగ్విజయంగా నడిపాను. నాకు పదోన్నతిని ప్రసాదించమని అడిగాను. “డిగ్రీ లేదు గనుక ప్రమోషన్ ఇవ్వడానికి వీలుపడ”దన్నారు. అయినా, నాలో నేను కుంగిపోయానే తప్ప, ఏమీ చేసుకోలేకపోయాను.

మా నాన్నగారి కారణంగా, నాకు చాలామంది రాజకీయ నాయకులతో సన్నిహిత పరిచయాలున్నాయి. నీలం సంజీవరెడ్డిగారు, కాసుబ్రహ్మానందరెడ్డి గారు, వెనిగళ్ళ సత్యనారాయణగారు, దామోదరం సంజీవయ్యగారు, ఇంకా చాలామంది నాకు తెలుసు. అయినా వీరి పరిచయాలను ఉపయోగించుకోవడానికి నేను ఇష్టపడలేదు. నాకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను సహించలేని మంచాల జగన్నాథరావుగారూ, వారి తమ్ముడు వాడ్రేవు పురుషోత్తంగారూ నాకు నచ్చచెప్పారు.

1974వ సంవత్సరంలో, నేనూ, పురుషోత్తంగారూ ఢిల్లీవెళ్ళాం. పెండేకంటి వెంకటసుబ్బయ్యగారికి జరిగిన సంగతంతా చెప్పాం. ఆయన అప్పటి సమాచార ప్రసారశాఖా కార్యదర్శి శ్రీ ఎ.జె. కిద్వాయ్‌గారికి చెప్పారు.

నేనూ, పురుషోత్తం – కార్యదర్శి కిద్వాయ్‌గారిని కలిశాం. ‘‘పాంటమీ క్వింటెట్’’ అన్న నా ఇంగ్లీషు పుస్తకాన్ని కిద్వాయ్‌గారికి ఇచ్చాను. ఆ పుస్తకానికి కె.ఎ. అబ్బాస్ అద్భుతమయిన పీఠిక రాశారు. ఆ పుస్తకాన్ని నేను దామోదరం సంజీవయ్యకు అంతకుముందెప్పుడో అంకితమిచ్చాను. ఆనాటి అంకితోత్సవంలో, ఐ.కె. గుజ్రాల్, నార్ల వెంకటేశ్వరరావు, కె.యల్. రావు, బి.వి. కేస్కర్, యస్.యన్. మూర్తి వంటి వారెందరో పాల్గొన్నారు. కిద్వాయ్‌గారిని మేము కలుసుకొన్నప్పుడు, గుజ్రాల్‌గారు సమాచార ప్రసారశాఖామంత్రి. ‘‘నేను చేయగలిగింది చేస్తాను. ఎందుకయినా మంచిది – మీరోమారు గుజ్రాల్‌గారిని కలవండి!” అన్నారు కిద్వాయ్‌గారు.


నేనొప్పుకోలేదు! అయినా 1975 మే నెల నాటికి నన్ను ప్రొడ్యూసర్‌గా నియమిస్తూ, డైరక్టర్ జనరల్ నుండి ఉత్తరం వచ్చింది. పన్నెండు సంవత్సరాలపాటు నేనా ఉద్యోగంలో ఉన్నాను. వందల మంది కొత్తవారిని ఆకాశవాణి కేంద్రానికి ఆహ్వానించాను. సంతృప్తికరమయిన కార్యక్రమాలెన్నింటినో

ప్రసారం చేశాను. ఈ పరంగా నాకు కుడిభుజంగా ఉన్నవారు వాడ్రేవు పురుషోత్తంగారు.

నా తొలికథ 1946లో అచ్చయిందన్నాను కదూ? నా తొలిపుస్తకం 1950లో అచ్చయింది. దానిపేరు "రాగిణి". ఆ కథా సంపుటానికి చలంగారు పరిచయం రాశారు. నా రెండవ పుస్తకం కూడా 1950లో అచ్చయింది. దానిపేరు "కొత్త చిగుళ్లు". ఈ పుస్తకాన్ని చలంగారికి అంకితమిచ్చాను. విజయవాడలోని ఆదర్శగ్రంథ మండలివారు, మచిలీ పట్నంలోని తెలుగు విద్యార్థి ప్రచురణలవారు నా పుస్తకాలలో ఎక్కువభాగం ప్రచురించారు. ఇంతవరకూ అచ్చయిన పుస్తకాలు 140. కొన్ని కథలు, దాదాపుగా అన్ని భారతీయ భాషలలోనూ వచ్చాయి. కొన్ని పుస్తకాలు ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ, కన్నడం, తమిళం, మలయాళ భాషలలోనికి అనువాదమయ్యాయి.

తొలిసారిగా "నికషం" అన్న నాటిక ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి 1950-52 మధ్యలో ప్రసారమయింది. 1956లో ఆకాశవాణి, మద్రాసు కేంద్రం నుండి ప్రసారమయిన ఒక నాటికలో తొలిగా పాత్రధారిగా పాల్గొన్నాను. 1959 ఏప్రిల్, మే మాసాలలో, "నా పుస్తకాల బీరువా" అన్న ప్రసంగాన్ని హైదరాబాదు కేంద్రం నుండి తొలిసారిగా ప్రసారం చేశారు.

తొలి అవార్డు 1956లో. "జ్యోతి" పాఠకులు ఎన్నిక చేసిన కథకు స్వర్ణపతకం లభించింది. 1968లో "విజయవిలాసం" అన్న కథా సంపుటానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారి అవార్డు లభించింది. 1983లో "జీవన సమరం" పుస్తకానికి రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీల అవార్డులు లభించాయి. ఆ తరువాత ఇంకా ఇంకా చాలా ఉన్నాయనుకోండి.


కాంతమ్మ

1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 987లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను నాకు ప్రసాదించాయి. 1984లోనూ, 1987లోనూ, సోవియట్‌రష్యాలో పర్యటించాను.


1986 ఆగస్టు 1వ తేదీన, నా జీవిత భాగస్వామిని, నా వెలుగును, నా మార్గదర్శిని, నేను పోగొట్టుకొన్నాను. కాంతమ్మగారి నిర్గమనం, నా జీవిత గమనాన్నే మార్చివేసింది. ఆమె జ్ఞాపకాలను–5 పుస్తకాలుగా ముద్రించాను. ఈ పుస్తకాల మీద అయిదు విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరిగాయి.

అయిదు విశ్వవిద్యాలయాలలో కాంతమ్మగారి పేరున సంస్మరణోపన్యాసాల కార్యక్రమాల నిర్వహణకు, పతకాల బహూకరణకు కావలసిన నిధులను ఇచ్చాను. "శ్రీమతి రావూరి కాంతమ్మ భరద్వాజ ట్రస్టు" పేరిట ఒక సంస్థను రిజిష్టరు చేయించాను. సమాజ సంక్షేమానికి ఉపకరించగల కార్యక్రమాలను, ఈ ట్రస్టు పేరిట నిర్వహించుకుందామని నేను అనుకొంటున్నాను.


ఆలపాటి రవీంద్రనాథ్

నా పెద్ద కొడుకు పేరు రవీంద్రనాథ్. నాకు తొలిసారిగా తెనాలిలో ఉద్యోగమిచ్చిన ఆలపాటి రవీంద్రనాథ్ గారికి కృతజ్ఞతగా సూచికగా ఈ పేరు పెట్టుకొన్నాను. అతని భార్యపేరు ఇందిర.

రెండవ కొడుకు పేరు గోపీచంద్. ఆకాశవాణిలో, నాకు ఉద్యోగం రావడానికి కారణభూతులయిన త్రిపురనేని గోపీచంద్‌గారి జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకున్నాను. అతని భార్యపేరు సుశీల. మూడవ కొడుకు పేరు బాలాజీ. నేను మద్రాసులో ఉన్న మూడున్నర సంవత్సరాల కాలంలోనూ, ఉచితంగా వైద్యం చేసిన డాక్టర్ గాలి బాలసుందరరావుగారి జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకొన్నాను. భార్యపేరు నాగసుభద్ర. నాలుగవ కొడుకు పేరు వెంకటకోటేశ్వరరావు. నాకింత నీడను ప్రసాదించిన ఆలపాటి వెంట్రామయ్య పేరునూ, మా నాన్న పేరురూ కలిపి, మా నాలుగో వాడికి పెట్టుకొన్నాను. భార్యపేరు లక్ష్మీకుమారి. నా కూతురు పేరు పద్మావతి – పద్మ. 1943లో అన్నంలేక స్పృహ తప్పి పడిపోయినప్పుడు, నన్ను పిలిచి ఆప్యాయంగా ఇంత అన్నం తినిపించిన మాల పద్దక్క జ్ఞాపకార్థం, కూతురుకు ఆ పేరు పెట్టుకొన్నాను. భర్తపేరు మాధవరావు. నాకు ఆకలి తెలుసు. అవిద్య తెలుసు. అవమానం తెలుసు. నిరుద్యోగం తెలుసు. అన్యాయం తెలుసు. అక్రమం తెలుసు. అధర్మం తెలుసు. వీటిని నేను పుష్కలంగా అనుభవించాను కాబట్టి ఇవిలేని సమాజం కావాలని నేను కోరుకొంటున్నాను.




# ఆధునిక అరబ్ కవిత్రయం

**- దిలావర్**

సాహిత్యపరంగా అరబ్బీ భాషకు ఒక విశిష్ట లక్షణం వుంది. ప్రపంచంలోని అనేక భాషల్లో నవలలూ, కథలూ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. కానీ pre-Islamic కాలం నుండి కూడా అరబ్బీ భాషలో కవిత్వమే రాజ్యమేలుతున్నది. అక్కడ కవిత్వం ప్రజాకళగా సంభావింపబడుతున్నది. మధ్య యుగాలలో సంప్రదాయ అరబ్ నాగరికత పెత్తనం చెలాయించినా, అరబ్ ప్రాబల్యం క్షీణించడానికి అనేక సంవత్సరాలు పట్టినా, 20వ శతాబ్దంలో యూరోపియన్ ప్రతికూల సాంస్కృతిక శతృత్వంతో పోరాడవలసి వచ్చినా – ప్రపంచ ప్రజల హృదయాలలో అరబ్ కవులకున్న గౌరవ భావం ఏ మాత్రం తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల జానపదుల నుండి కృత్రిమ నాగరికతావరణంలో ఉక్కిరి బిక్కిరవుతున్న మహానగరాలలోని సామాన్య ప్రజల వరకూ – అందరినీ అరబిక్ కవిత్వం అమితంగా ప్రభావితం చేస్తున్నది.

సమకాలీన అరబ్ కవిత్వ రంగంలో మహమూద్ దర్వీష్, సమీ అల్–ఖాసిమ్, అడోనిస్‌లు అగ్రగణ్యులుగా పరిగణింపబడుతున్నారు. ఈ కవిత్రయం కవితల అపూర్వ సంగమమే Victims of a Map అన్న కవితా సంపుటి. ఒక్కొక్క కవికి చెందిన పదిహేను కవితల చొప్పున ఎంపిక చేయబడ్డ కవితలు సంపుటీకరింపబడ్డాయి. ఈ కవితలు కేవలం అరబ్బులు – లేక పాలస్తీనీయులు భవితవ్యం గురించే కాక సమకాలీన విషాదంలో బందీ అయిన మానవత్వం గురించి కూడా వ్యధా పూరితంగా వ్యక్తపరుస్తున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత సంవత్సరాలలో ఐదు అరబ్ – ఇజ్రాయెల్ యుద్ధాలు జరిగాయి. యెమెన్ – లెబనాన్‌లలోని అతి పెద్ద అంతర్యుద్ధం, పాలస్తీనియన్‌ల అసంఖ్యాక బలిదానాలు, అరడజన్‌కు పైన వివిధ దేశాలలోని మిలటరీ సమూహాలు పన్నిన కుట్రలూ – అరబ్ ప్రపంచం ఎదుర్కొన్న అన్ని సంక్షోభాల నేపథ్యంలోంచే ఆధునిక అరబ్ కవిత్వం రూపుదిద్దుకున్నది. వివిధ వర్గాలకు చెందిన రాజకీయ నాయకులు మిగిల్చిన చేదు అనుభవాలూ, నిరాశా నిస్పృహలూ చవిచూసిన అరబ్ ప్రజలు తమ ఆశలకు, కోరికలకూ గొంతు నివ్వగల కవుల వైపు దృష్టి మళ్లించారు. అరబ్ ప్రజల సమస్యలూ, బాధలూ, కలలూ కన్నీళ్ళకు యీ ఆధునిక అరబ్ కవిత్రయం Victims of a Map లో శక్తివంతమైన కవితా రూపమిచ్చారు. వారి కవిత్వంలో స్థానిక దుఃఖం, ప్రపంచ దుఃఖంగా మారింది. ఈ సంకలనంలోని పాలస్తీనీయులు సమస్యలు సార్వజనీనంగా కనిపించడానికి ఈ కవిత్రయం కళాత్మక సృజన శిఖరాగ్రస్థాయికి ఎదిగింది.

1947లో ఇద్దరు ఇరాకీ ప్రముఖ కవులు ప్రచురించిన రెండు ప్రయోగాత్మక కవితా సంపుటాల ప్రచురణ ఆధునిక అరబ్ కవిత్వ పరిణామానికి శ్రీకారం చుట్టిందని విజ్ఞుల అభిప్రాయం. 1957లో లెబనాన్ కవులు యూసఫ్ అల్ – ఖల్, అడోనిస్‌లు ప్రారంభించిన కవిత్వ పత్రిక (magazine) 'షి – ఆర్' అరబ్ ఆధునిక కవిత్వంలో నూతన శకానికి నాంది పలికింది. ఆ పత్రికలో ప్రచురింపబడిన కవిత్వం అరబ్ క్లాసికల్ కవిత్వ సంప్రదాయాలను శక్తివంతంగా అరికట్టింది. అరబ్ కవిత్వం సంక్షోభంలోంచి తేరుకొని అరబ్ కవిత్వ పటాన్ని పునర్నిర్మించడానికి మార్గం సుగమం చేసింది. ఈ సాహిత్యపరమైన అల్లకల్లోలం లోంచి తేరుకోవడానికి అడోనిస్ పాత్ర కేంద్ర బిందువుగా మారింది.

**మహమూద్ దర్వీష్:** మహమూద్ దర్వీష్ 1942లో పాలస్తీనాలోని బర్వే అనే పల్లెటూళ్ళో జన్మించాడు. 1948 సం॥లో ఒక రాత్రి ఇజ్రాయెల్ సాయుధ మిలటరీ దళాలు బర్వేను నామరూపాలు లేకుండా ధ్వంసం చేశాయి. దర్వీష్ కుటుంబం బుల్లెట్ల వర్షాన్ని తప్పించుకుంటూ ఒక అరణ్యం

డా. దిలావర్, సెల్ : 9866923294



గుండా లెబనాన్‌కు పారిపోయింది. అక్కడ యునైటెడ్ నేషన్స్ అందించిన నామమాత్రపు సహాయంతో ఒక సంవత్సరం పాటు అష్టకష్టాలు పడుతూ గడిపింది. చివరకు దర్వీష్ తన అంకుల్ సహాయంతో గలిలీలోని డయర్ అల్ అసాద్ గ్రామ పొలిమేరలకు చేరుకున్నాడు. బర్వే ఆనవాలు తుడిచిపెట్టుకు పోవడం వల్ల దర్వీష్ కుటుంబం తిరిగి ఎన్నడూ తమ సొంతవూరుకు చేరుకోలేకపోయింది.

"జరిగిందంతా ఏంటంటే శరణార్థి, తన కొత్త చిరునామా కోసం పాత చిరునామాను మార్చిడి చేసుకున్నాడు. నేను లెబనాన్‌లో శరణార్థిగా వున్నాను. ఇప్పుడు నా స్వదేశంలోనే నేను శరణార్థిని" అని ఆవేదనతో తనలోని బాధను 'జో హెడ్ రెక్' అన్న పత్రికకు యిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు దర్వీష్.

ప్రథమ ఇజ్రాయెల్ జన గణనంలో ఏ పాలస్తీనీయుణ్ణి కూడా లెక్కలోకి తీసుకోలేదు. అంచేత కొత్తగా ఏర్పడిన ఇజ్రాయెల్ స్టేట్ పాలస్తీనీయుల్ని చొరబాటు దారులుగా భావించి వారికి ఎటువంటి గుర్తింపు కార్డులూ మంజూరు చేయలేదు. దర్వీష్ స్వదేశంలోనే చట్టబద్ధత లేకుండా నివసించవలసి వచ్చింది. అందువల్ల ఏ పోలీస్ కాని, ఏ అధికారి కాని వస్తున్నాడంటే, దర్వీష్ చదివే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అతని తల్లిదండ్రులు – దర్వీష్‌ను దాచివేసేవారు.

చిన్న వయసునుండే దర్వీష్‌కు కవిత్వమంటే ఇష్టం ఏర్పడింది. పాఠశాలలో చదువుకుంటున్నప్పటి నుంచే అరబ్ క్లాసికల్ పోయట్రీని అమితంగా అధ్యయనం చేసేవాడు. Pre-Islamic కాలపు కవిత్వాన్ని అతడు తొలినాళ్ళలో అనుకరించే వాడు. ఆ తరువాత కొద్ది రోజులకే ఆ కవిత్వం తనను ఇంకా కష్టాల్లో పడేస్తుందని తెలుసుకున్నాడు.

ఇజ్రాయెల్ స్టేట్ వార్షికోత్సవం సందర్భంగా దర్వీష్‌ను ఒక కవిత చదువ వలసిందిగా ప్రధానోపాధ్యాయుడు కోరాడు. "అక్కడ నా జీవితంలో మొదటిసారి మైక్రోఫోన్ ముందు నుంచున్నాను. ఒక యూదు బాలునికి, ఒక అరబ్ బాలుడు తెలిపే తీవ్ర నిరసనను కవితా రూపంలో వినిపించాను' అంటూ ఆనాటి సంఘటన గురించి చెప్పుకున్నాడు దర్వీష్. అది జరిగిన రెండవ నాడే మిలటరీ గవర్నర్ దర్వీష్‌కు సమన్లు జారీచేశాడు. దర్వీష్‌ను భయపెట్టడమేకాక అవమానించాడు కూడా. దర్వీష్ బిగ్గరగా ఏడ్చాడు. ఎందుకంటే ఆ మిలటరీ గవర్నర్ "నువ్విలాగే రాసుకుంటూ పోతే క్వారీలో పనిచేసే మీ నాన్నను తొలగిస్తాను" అని హెచ్చరించడం వల్ల తండ్రి చేతిలోని పని పోతుందేమో అన్న భయంతో బిగ్గరగా ఏడ్చాడు దర్వీష్. "ఒక కవిత ఒక పోలీసు ఆఫీసర్‌ని ఎందుకు డిస్టర్బ్ చేసిందో నేను అర్థం చేసుకోలేక పోయాను. నేను మొట్టమొదటి సారిగా కలుసుకొని మాట్లాడిన 'యూదు' అతడు. అతని ప్రవర్తన నన్ను కుదిపేసింది. యూదులు అలాంటి వారైనపుడు నేనొక యూదు బాలునితో ఎందుకు మంచిగా మాట్లాడాలి? ఇరు జాతుల మధ్య సంబంధాలకు హానిని చేకూర్చే ఆ ఆఫీసర్ నా హృదయంలో దుర్మార్గానికి ప్రతీకగా నిలిచాడు" అని అంటాడు దర్వీష్.

అయితే యూదులంతా దుర్మార్గులే అని దర్వీష్ ఏనాడూ భావించలేదు. ఒక యూదు స్త్రీ పరిచయం అతనిలో ఎన్నో మార్పులను తీసుకొచ్చింది. 'ఓల్డ్ టెస్ట్‌మెంట్' (పాత నిబంధన) ను ఒక కావ్య దృష్టితో ఆమె బోధించింది. 'బైబిల్' కవిత్వాన్ని, అది ఇచ్చిన రాజకీయ సందేశ దృక్పథంతో కాక – కవిత్వ దృష్టితో అభిరుచిని పెంపొందించుకోవాలని సూచించింది.

1971 వరకు హైఫాలో దర్వీష్ జర్నలిస్ట్‌గా పని చేశాడు. ఆ సంవత్సరమే ఇజ్రాయెల్ నుండి బీరూట్‌కు వెళ్ళాడు. 1982 వరకూ అక్కడే నివసించాడు. మిగతా జీవితమంతా పారిస్‌లో గడిపాడు. హృద్రోగంతో బాధపడుతున్న దర్వీష్ అమెరికాలోని (టెక్సాస్ – హ్యూస్టన్) మెమోరియల్ హెర్మన్ ఆసుపత్రిలో 9 ఆగస్ట్ 2008లో మరణించాడు. ఇక దర్వీష్ కవితలను ఆస్వాదించుదాం.

'We go to a country' అన్న కవిత దర్వీష్ స్వానుభవంలోంచి పుట్టింది. కవి గుండెలను కలచి వేసిన సామూహిక హత్యలూ, ఛిద్రం చేయబడిన స్వదేశమూ కరుణ రసాత్మకంగా ఈ కవితలో చిత్రీకరింపబడ్డాయి.

"మన రక్తమాంసాలకు చెందని ఒక దేశానికి మనం వెళ్తాం. 'చెస్ట్‌నట్ వృక్షాలు' మన ఎముకలకు సంబంధించినవి కావు. ఆ దేశపు రాళ్ళు, పర్వత సానువుల గీతాలలోని గొర్రెలు కావు. దాని గులక రాళ్ళ కళ్ళు, లిల్లీ పుష్పాలు కావు. ప్రత్యేక

సూర్యుణ్ణి మన మీద వేలాడదీయని దేశానికి వెళ్తాం. పౌరాణిక స్త్రీలు మనకోసం కరతాళ ధ్వనులు చేస్తారు. ఒక సముద్రం మనకోసం! ఇంకో సముద్రం మనకు వ్యతిరేకం! ఒకవేళ గోధుమలూ, నీరు (రేషన్) ఇవ్వడం మానేస్తే, మన ప్రేమనే భుజించు. మన కన్నీళ్ళు త్రాగు. కవుల చేతులకు నల్లని చేరుమాళ్ళు వస్తాయి. పాలరాతి విగ్రహాల వరుస మన గొంతులను వుత్తేజపరుస్తుంది. సమకాలీన ధూళి నుండి మన ఆత్మలను రక్షించేందుకు పంట భూములున్నాయి. మనకోసం గులాబీలు! మనకు వ్యతిరేకంగా కూడా! ఓహ్! కనిపించని దేశాన్ని కనడానికి ఒక దేశం వుంది. అదే మన రహస్యం. మీరు మీ యశస్సును కలిగి వున్నారు. మేం మా యశస్సును కలిగి వున్నాం. మన కాళ్ళను తొలిచి ముళ్ళు గుచ్చిన రోడ్డు, మన ఇళ్ళకు తప్ప అన్ని ఇళ్ళకూ తీసుకుపోతుంది. ఆత్మలో అంతర్గతంగా వున్న ఆత్మను మన ఆత్మ కనుగొనవలసి వుంది. లేదా మనం మరణించాల్సి వుంటుంది....” అంటూ ఈ కవిత ముగుస్తుంది. 'The earth is closing on us' అన్నది దర్వీష్ రాసిన మరో మంచి కవిత.

“ఈ నేల మాకు సన్నిహితమవుతూ వుంది. చివరి యాత్ర ద్వారా మమ్మల్ని ముందుకు తోస్తున్నది. మేం ముందుకు వెళ్ళడానికి మా కన్నీళ్ళతో తీవ్రంగా ఎదుర్కొంటాం. ఈ నేల మమ్మల్ని అన్ని వైపులా నుండి నొక్కుతున్నది. చావడానికి, తిరిగి పుట్టడానికి మేం ఈ నేలకు విత్తనం కావాలని కోరుకుంటున్నాం. ఈ నేల మాకు తల్లి కావాలని కోరుకుంటున్నాం. అందువల్ల నేల మా మీద దయగలిగి వుంటుంది. మన స్వప్నాలు గళమెత్తి అరచేందుకు వీలుగా వేం ఈ రాళ్ళమీద చెక్కిన చిత్రాలు కావాలని కోరుకుంటున్నాం. అద్దాలవలె – ఆత్మను రక్షించే చివరి రక్షణగా – మాలోని ఆఖరు వాళ్ళచేత చంపబడే వాళ్ళ ముఖాలను చూశాం. వాళ్ళ పిల్లల విందుకు వ్యతిరేకంగా మేం పెద్దగా అరిచాం. మా పిల్లలను విసిరేసే వాళ్ళ ముఖాలను చూశాం. ఈ చివరి రోదసి కిటికీలనుండి మా నక్షత్రాలు, అద్దాలను వ్రేలాడదీస్తాయి. చివరి సరిహద్దుల తరువాత మేం ఎక్కడికెళ్ళాలి? ఆఖరి ఆకాశం తరువాత పక్షులు ఎక్కడ ఎగరాలి? ఆఖరి గాలిని పీల్చుకున్నాక మొక్కలు ఎక్కడ నిద్రపోవాలి? మా పేర్లను రక్త వర్ణపు ఆవిరితో రాస్తాం. మా రక్తమాంసాలతో పూర్తికానున్న పాట యొక్క చేతిని తెగనరుకుతాం. మేమిక్కడ మరణిస్తాం – ఈ చివరి యాత్ర దగ్గర. ఇక్కడ మా రక్తం, దాని ఆలివ్ మొక్కలను నాటుతుంది.” అంటూ తన దేశ విముక్తి కోసం, స్వేచ్ఛ కోసం ఎన్ని త్యాగాలైనా, బలిదానాలనైనా చేస్తాం అని ఈ కవితలో చెబుతున్నాడు దర్వీష్.

**సమీ అల్ – ఖాసిమ్ :** గలిలీలోని ‘రమా’ అన్న గ్రామీణ డ్రుజ్ కుటుంబానికి చెందిన పాలస్తీనీయుడు సమీ అల్ – ఖాసిమ్. అతడు జోర్డాన్‌లోని జర్ఖాలో 1939లో జన్మించాడు. ఖాసిమ్ తండ్రి, రాజ అబ్దుల్లాకు చెందిన విదేశీ సైనిక పటాలంలో సేవ చేసే ఒక సైనికుడు. అబ్దుల్లా, జోర్డాన్ రాజైన హుసేన్ తాత. ఖాసీమ్ రమాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. తరువాత ‘నజరేత్’ పాఠశాల నుండి పట్టభద్రుడయ్యాడు.



About principles and Art (Beirut 1970) లో అల్–ఖాసిమ్ – ‘1948 యుద్ధం’ చేసిన గాయాలను జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. “నేను యింకా ప్రాథమిక పాఠశాలలో ఉండగానే 1948 పాలస్తీనా విషాదం సంభవించింది. నేను ఆ రోజునే, నా పుట్టిన రోజుగా భావిస్తాను. ఎందుకంటే 1948 నాటి సంఘటనలే నా తొలి వూహల్లో చోటు చేసుకున్నాయి. నా ఆలోచనలు, భావ చిత్రాలు 48 అనే సంఖ్య నుండి వికసనం చెందుతాయి” అని అంటాడు ఖాసిమ్.

“కేవలం కవిత్వం రాయడమే నా Identity ని పదిలం చేసుకోవడానికి మార్గమని నేను స్పష్టంగా చెప్పగలను” అని ఆత్మ విశ్వాసంతో అంటాడు ఖాసిమ్. నిజంగానే అతడు పుంఖానుపుంఖంగా రాసిన కవితలు అందుకు సాక్ష్యమిస్తాయి. అతడు 30 సం॥ల వయస్సు నాటికి 6 కవితా సంపుటాలు ప్రచురించాడు. 1984 వరకు ఖాసిమ్ 24 కవితా సంపుటాలను వెలయించాడు. అల్–ఇత్తెహాద్, అల్ – జాదిద్ అనే పత్రికలకు కూడా చాలా రచనలు అందించాడు. గలిలీలోని గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో శ్రోతలకు తన కవిత్వం వినిపించి తన్మయులను చేసేవాడు. అతడు కవిగానే కాకుండా చరుకైన జర్నలిస్టుగా కూడా రాణించాడు. తన రాజకీయ కార్యకలాపాల వల్ల ఖాసిమ్ చాలాసార్లు జైలుపాలయ్యాడు. పాలస్తీనా ప్రజల హక్కుల రక్షణకోసం

అతడు తీవ్రంగా పోరాటం కొనసాగించాడు. అందువల్ల అనేక సార్లు గృహ నిర్బంధంలో వుండవలసి వచ్చింది.

ఓసారి ఖాసిమ్ స్నేహితుడు, ఇరాక్ కవి బులంద్ అల్ – హైదరీ "నువ్వు ఒకవేళ బాగ్దాద్‌ను సందర్శిస్తే ఎలా వుంటుంది" అని ప్రశ్నించాడు. అందుకు ఖాసిమ్ "నేను బాగ్దాద్‌ను కాని, మరే యితర అరబ్ నగరాలను కాని సందర్శించలేదు. కాని నా జైల్లోంచే ఆయా పట్టణాల్లో ఏం జరుగుతున్నదో తెలుసుకోగలుగుతాను. ఒకవేళ నన్ను దమాస్కస్ లేక బాగ్దాద్ లేక రబట్‌లకు తీసుకువెళితే, అక్కడి వీధుల్లో నడుస్తూ నేను ఆయా పట్టణాల్లో పుట్టి, శతాబ్దాల తరబడి అక్కడ నివసిస్తున్నట్టుగానే అనుభూతి చెందుతాను. బాగ్దాద్ లేక టునిస్ లేక జెరూసలెమ్‌లలో ఆధ్యాత్మిక పరంగా పెద్ద తేడా వుండదని నేను నమ్ముతాను. ఆ దేశాలన్నీ నావేనని నేను భావిస్తాను. అవి నా స్వదేశాలే" అంటూ తాదాత్మ్యంలో చెబుతాడు ఖాసిమ్.

సమీ అల్ – ఖాసిమ్ ప్రస్తుతం హైఫాలో జర్నలిస్టుగా పని చేస్తున్నాడు. అక్కడ ఆయన అరబ్ న్యూ ప్రెస్‌ను, జానపద కళా కేంద్రాన్ని నడుపుతున్నాడు. ఇక మనం అల్ ఖాసిమ్ అందమైన కవితా ప్రాంగణంలోకి అడుగు పెడదాం....

'The story of the unknown Man' అన్న కవిత స్వదేశంలోనే పరాయివాడిగా బతకవలసి వచ్చిన ఒక అపరిచితుని అన్యాపదేశంగా చిత్రీకరించింది. సూటిగా గుండెలకు తాకే ఆ కవిత యిలా సాగుతుంది:

ద్రాక్షతోటలో దిష్టి బొమ్మలా రోడ్డు చివర అతడు నించున్నాడు. ఆకు పచ్చ ట్రాఫిక్ లైట్ ముందు వో మనిషిలా రోడ్డు చివర అతడు నుంచున్నాడు. పాత కోటును ధరించి రోడ్డు చివర అతను నుంచున్నాడు. అతని పేరు 'అపరిచిత మానవుడు.' తెల్లజాతి గృహాలు అతని ముఖం మీదే దడాలున తలుపులు మూస్తాయి. ప్రేమ, అసహ్యపు నీడలతో వున్న అతని ముఖాన్ని మల్లె మొక్కలు మాత్రమే ప్రేమించాయి. మిడుతల దండు, దుఃఖం బరువు కింద దేశం మగ్గుతుంది. ఓ రోజు అతని గళం తెల్లజాతి గృహాల కూడలిలో మోగింది. పురుషులు, స్త్రీలు, పిల్లలూ ఆ కూడలిలో గుమిగూడారు. అతడు తన పాత కోటును కాల్చుకోవడం చూశారు... ఈ రోజు ఉరుములూ, మెరుపులతో ఆకాశం ఉగ్రరూపం దాల్చింది. కుంభవృష్టి కురిసింది. అతని పేరు అపరిచిత మానవుడు. మల్లె మొక్కలు మాత్రమే ప్రేమా, అసహ్యంతో కూడిన అతని ముఖాన్ని ప్రేమించాయి. క్రమంగా తెల్ల గుంపులు కూడా అతణ్ణి ప్రేమించడం మొదలెట్టాయి.... అంటూ మానవత్వానికి సంబంధించిన సున్నితాంశాలను సుతారంగా మీటుతాడు అల్ ఖాసిమ్.

'The will of Man Dying in Exile' అన్న కవితను ఖాసిమ్ గొప్ప భావోద్వేగానికి లోనై రాసినట్టు అనిపిస్తుంది. ప్రవాసిగా అతనిలోని కసినీ, భావోద్రేకాన్ని ప్రవాస దృశ్యంగా ప్రదర్శించాడు యీ కవితలో. మంటలు రాజెయ్యి, ఆ మంటల అద్దంలో నేను గ్రామీణ ప్రాంతాన్ని, వంతెననూ, బంగారు మైదానాలనూ చూడగలుగుతాను. మంటలు రగిలించు. సామూహిక హత్యాకాండ జరిగిన నాటి రాత్రి నా కన్నీళ్ళను చూడగలుగుతాను. మీ సోదరి శవాన్ని చూడగలుగుతాను. పక్వానికి వచ్చిన పండును చిలుక కొట్టినట్టుగా, విదేశీ నాలుకల చేత, విదేశీ గాలుల చేత చీల్చబడిన ఆమె హృదయాన్ని చూస్తాను. ఆమె శవం మీద కప్పబడిన కఫన్ లాంటి మల్లెల్ని చూస్తాను. సామూహిక హత్యాకాండ జరిగిన నాటి రాత్రి చంద్రుడు అగరొత్తిలా కాలడం చూస్తాను. మంటలు రగిలించు. నాలో నేను మరణించడం చూస్తాను. నా బాధలే నీ వారసత్వం. మల్లెపూవు ముందు నేను దుఃఖించడం ఒక సాక్ష్యంగా మారుతుంది. మంటలు అంటించు. నేను మంటలు రగిలిపోవడం చూస్తాను.... ఆవేశానికి కవితా రూపమిస్తే ఎలా వుంటుందో ఈ కవిత సాక్ష్యమిస్తున్నది.

**అడోనిస్ :** 1930వ సం॥లో సిరియాలోని ఖసాబిన్‌లో అడోనిస్ జన్మించాడు. సిరియాకు స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలో అడోనిస్ దేశ పర్యటనకు బయలుదేరాడు. అప్పుడు కొత్తగా ఎన్నికైన ప్రెసిడెంటును దర్శించుకున్నాడు. ఆ సందర్భంగా 'వృద్ధాప్యంలో అతడు, ఒక రాత్రి ముగిసే సమయానికొచ్చాడు. అతడెప్పుడూ పురాన శయ్య మీద పవళించలేదు. అతడు బాల్యాన్ని జీవించలేదు' అని తన కవితను చదివి వినిపించాడు. అడోనిస్. దేశ భవితవ్యాన్ని నిర్మించడానికి సహకరించవలసిందిగా సిరియా ప్రజలను, ప్రెసిడెంటునూ ఆ కవితలో అర్థించాడు. ఆ కవిత ప్రెసిడెంటుకు ఎంత బాగా నచ్చిందంటే, అడోనిస్ విద్యాభ్యాసం కొనసాగించడానికి వెంటనే 'గ్రాంట్' మంజూరు చేశాడు.



అడోనిస్ 'లటాక్రై' స్కూలులో చేరాడు. ఆ సమయంలో 'యాంటన్ సాదా' సాహిత్య, సామాజిక, రాజకీయ రచనలతో అడోనిస్ బాగా ప్రభావితుడయ్యాడు.

'సాదా' రచనలు కేవలం అడోనిస్ సాహిత్యం మీదనే కాక, ఆధునిక అరబ్ కవిత్వం మీద కూడా చెరగని ముద్ర వేశాయి.

1950లో అడోనిస్ డమాస్కస్ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ ఆయన సాహిత్యాన్నీ, తత్వశాస్త్రాన్నీ అధ్యయనం చేశాడు. బిర్రబిగిసిన సిరియా సామాజిక, రాజకీయ నిర్మాణాన్నీ, శక్తి క్షీణించిన సంప్రదాయ సాహిత్య విలువలనూ ప్రశ్నిస్తూ అడోనిస్ ధారావాహికంగా తన కవితలను ప్రచురించడం మొదలెట్టాడు. అది అనివార్యంగా అతని కారాగారవాసానికి దారి తీసింది. అంతేకాకుండా చివరకు 1956లో బీరూట్‌కు ప్రవాసం వెళ్ళవలసి వచ్చింది. కొద్ది కాలంలోనే అతడు లెబనాన్ పౌరసత్వ స్వీకరించాడు. 1973లో బీరూట్ యూనివర్సిటీ నుంచి 'డాక్టరేట్' అవార్డును అందుకున్నాడు.

అతడు తన కవిత్వంలోనైతేనేం, విమర్శనాత్మక రచనలలోనైతేనేం, ఇతర గద్య రచనలలో నైతేనేం – "అరబ్బుల జీవితాల ప్రతీ దృక్పథంలో తీవ్ర మార్పులు వస్తే తప్ప అరబ్బులను 21వ శతాబ్దంలోకి తీసుకుపోవడం సాధ్యం కాదు. అప్పుడే మానవత్వం పురోగతికీ, ప్రపంచ నాగరికతకూ అరబ్బులు తమ వంతు సహకారం అందించడం సాధ్యమవుతుంది'' అని నిర్మోహమాటంగా తన అభిప్రాయాలను వెల్లడించే వాడు.

అడోనిస్ కవిత్వం, విమర్శ అరబ్ కవిత్వ పురోగతిని గొప్పగా ప్రభావితం చేసింది. అరబ్బుల కోసం అతడు ఒక కొత్త కవిత్వ భాషనూ, అంతర్లీన లయనూ సృష్టించాడు. వాటి మూలాలు అరబ్ క్లాసికల్ పోయట్రీలో వున్నా – అరబ్ సమాజ క్లిష్ట పరిస్థితుల్లో వాళ్ళ బాధ్యతల్నీ తెలియజేయడానికే తన కవిత్వాన్ని ఉపయోగించాడు. బ్రిటీష్, అమెరికా, కవితా రంగంలో పౌండ్, ఇలియట్‌ల స్థానమెలాంటిదో అరబ్ కవితా రంగంలో అడోనిస్ స్థానం అలాంటిదని విమర్శకుల అభిప్రాయం.

అడోనిస్, అక్షరం అక్షరంలో అయస్కాంతాన్ని కూడిన మినీ కవితల్ని మన మీదికి విసిరేస్తాడు. ఆ ఆకర్షణావరణంలో మునిగిపోయిన మనం ఉక్కిరి బిక్కిరి కాక తప్పదు. అలాంటి ఆకర్షణీయమైన మూడు నాలుగు కవితలను చూద్దాం.

'The Desert' అన్న సుదీర్ఘ కవితలో అన్నీ ముక్తకాల ముక్తాయింపులే వున్నాయి. అడోనిస్ భావుకతలో వోలలాడని వారుండరు అంటే అతిశయోక్తి కాదు.

**– మనం ఎప్పుడూ కలుసుకోం**
**తిరస్కారం, ప్రవాసం మనల్ని విడదీసింది**
**వాగ్దానాలు మృతిచెందాయి. రోదసి నిర్జీవమయింది.**
**మృత్యువాకటే మనల్ని కలిపే బిందువుగా మారింది.**

**– నువ్వు పుట్టావు కాబట్టి**
**నీకో శరీరం వుంది కాబట్టి**
**నువ్వు గిట్టవు**
**నువ్వు భవిష్యత్తుకు ముఖానివి కాబట్టి**
**మరణిస్తావు.**

**– ఒక పుస్తకం పుటలో**
**బాంబులు తమను తాము చూసుకున్నాయి**
**తత్వవేత్తల ప్రవచనాలు**
**పురాతన స్వేచ్ఛా, తమను తాము చూసుకున్నాయి**
**'నీషే'లు తమను తాము చూసుకుంటారు**
**నగరం ముఖం మీద విస్మృత పదాల దారం**
**జ్ఞాపకాల సూది గుండా దూరుతుంది**

**– ఈ దారిలో –**
**ఈ రాత్రి, పగటి వెలుతురు నుండి పుట్టిన నలుపు**
**నలుపు హృదయంలో సూర్యుని వెలుతురూ**
**కొవ్వొత్తి వెలుతురూ ఒక్కటే**

'Victims of a Map' లోని యీ కవిత్రయం ఉద్యమమే ఊపిరిగా బతికినవారు ఉద్యమానికి తమ కవిత్వంతో ఊపిరులూదినవారు. స్వదేశం కోసం తమ బతుకుల్ని త్యాగాల బాటలో నడిపిన త్యాగమూర్తులు. వీరి జీవన శైలీ, రచనలూ ప్రపంచంలోని ఏ దేశం వారికైనా ఆదర్శ ప్రాయమే.



# నేనూ అమ్మనే...

- యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

ఉద్యోగానికి వేళ్ళాడే 'ఖాళీ ఉట్టి,' లాంటి నన్ను ఎవరైనా గుర్తుపడతారా?!
'అమ్మ' అన్న మాట వింటే చాలు
ఎండిన నా మనసు తుట్టె నెవ్వరో రాయితో కొట్టినట్టుంటుంది.
నా బంగారు కొండ 'కళ్ళల్లో ఎదురుచూపుల్ని విత్తి కొండల్ని పెంచాలా?!
ఒకవైపు వజ్రాల్ని పారేసుకుంటూ నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలా?!

ప్రతి  అలికిడికీ తీగెలు తీగెలుగా సాగే చిట్టి చేతులు,
అడుగు గుమ్మంలో పడగానే కుచ్చిళ్ళ వద్ద దోగాడే పసి మనసూ
నా రాకతో ఆనందంగా విచ్చుకొనే భూచక్రాల్లాంటి కళ్ళూ
నాలో కర్పూరమవుతున్న అమ్మ నామాన్ని నిలదీస్తాయి.

సమయాభావానికి మొక్కు తీర్చుకున్న జుట్టు 'బాబ్డ్' లోనికి పరావర్తనం చెందినా...
నా పని ఒత్తిడిలోంచి జారిపోయిన 'శ్రీరామరక్షల్ని' తానే లాలగా పోసుకొంటూ
తన కాళ్ళపై తాను నిలబడే లేలేత వ్యక్తిత్వమైనా నా అసహాయతకు 'నలుగు పెట్టదేం...'?!

మనసులు పంచుకొని, ముద్దు మాటల్ని మూటగట్టడానికి
'నిద్ర టైంటేబుల్' ఇద్దరికీ సయోధ్య కుదరనివ్వదు.
నా చేతికి వేళ్ళుంటాయి కానీ... అవి గోరుముద్దల్ని ముట్టుకోవు
తుమ్ములొచ్చినా 'చిరంజీవ' అనే దీవెనలు


పొలబారినా తలపై ఆత్మీయంగా స్పృశించే చేతులూ ఉండవు కాక ఉండవు...!
అయినా మాట్లాడే బొమ్మల్లోనో, గీసిన చిత్రలేఖనాల్లోనో
ఈ మనుషులూ, ఆ మమతలూ తీరని కోర్కెల్ని పండించడం వింతకాదు.
విచ్చుకొనే లేత మొక్కలకి నీళ్ళివ్వకుండా
వేరులలోకి సూదులు దింపి 'సిలైన్ పెట్టడం' తప్పడం లేదు.

ఎటూ తేల్చుకోలేక బండరాయిగా మిగిలిన నా గుండెలపైకి
అమాంతంగా దూకి తానలా తలాడిస్తుంటే
ఎక్కడో... లోపల రాళ్ళు కరుగుతున్న జాడలు
అవును...?! నేనూ అమ్మనే...!!

---

డా. యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమీ, హైదరాబాద్

# తెలుగు రుబాయీలు



- ఎండ్లూరి సుధాకర్

నీళ్ల లేనప్పుడు కన్నీళ్లను కలుపుకో
సొమ్మసిల్లి పోతున్నా ప్రాణాలను నిలుపుకో
అమ్మగుర్తు కొచ్చిందా శిఖామణీ!
నీ బాధనంతా కవితలోన తెలుపుకో.

నాస్తికులమంటూనే నందుల్ని మొక్కుతారు
పరిశుద్ధుల మంటూనే పందుల్ని మెక్కుతారు
ఏమి వింతలోకమిది ఇన్నయ్యా!
హేతువాదులంటూనే ఏడుకొండ లెక్కుతారు.

మాయదారి మాటలతో ఒట్టేశాడు
ఓట్లు దండి మంత్రిపదవి కొట్టేశాడు
మావూరికి ఏమైనా చెయ్యమంటే జంగయ్యా!
మొండి చెయ్యి చూపించి మూలన నెట్టేశాడు.

నాలో చెప్పులు కుట్టేవాడున్నాడు
నాలో ఊహల ఊయల కట్టేవాడున్నాడు
నన్ను అంటుకుని చూడండి మిత్రులారా!
మీ గుండె కొమ్ములకు తేనె పట్టేవాడున్నాడు.

మొగిలి పువ్వులు కావాలంటే ముళ్ల మధ్యన నడవాలి
తలలు పులకించాలంటే వర్షంలోనే తడవాలి
మనసులోని అరమరికలు పోవాలంటే పొనుగోటీ!
లోలోపలి పొరల్ని ఒక్కొక్కటిగా విడవాలి!

నిలబడి ప్రయాణం చేసేవాళ్లకే సీటు విలువ తెలుస్తుంది
నిజాయితీకి కట్టుబడ్డవాళ్ళకే ఓటు విలువ తెలుస్తుంది
తలదాచుకునే నీడలేని వాళ్ళకే నిర్మలా!
నేలమీద పడుకునే చోటు విలువ తెలుస్తుంది!

మనిషిని ప్రేమించే తీరికలేదు
వృద్ధుల్ని ఆదరించే కోరిక లేదు
ఏమి దుర్మార్గ లోకమిది వెలమాటీ!
కన్నవారి కోసం ఒక కన్నీటి చారిక లేదు!

పాల సారమంతా మీగడలో ఉంటుంది
నేల తీయదనమంతా చెరకుగడలో దాగుంటుంది
ఆచి తూచి చెబుతున్నా ఆలకించి గోరటీ!
మనిషి నిండు దనమంతా మాట నిలకడలో ఉంటుంది.

ఆకలిలోనే సహనం విలువ తెలుస్తుంది
ఆఖరిలోనే దహనం విలువ తెలుస్తుంది
మబ్బులు అడ్డు రాకుండా ఉన్నప్పుడే ఉపేందర్!
గగన తలంలో గ్రహణం విలువ తెలుస్తుంది!

మగ్గాల నడుములు విరిచేశారు
సారె మీద మట్టిముద్ద చెరిచేశారు
ప్రపంచ మాయలు చూశావా రాధేయా!
గల్లీ గల్లీకి సెల్లు దుకాణాలు తెరిచేశారు

రుబాయి పారశీక (పెర్షియన్) దేశపు ప్రక్రియ. ఉమర్ ఖయ్యామ్ రుబాయతులు జగత్ప్రసిద్ధం. తెలుగులో వీటిని దాశరథి ప్రవేశపెట్టాడు. రుబాయికి నాలుగు పాదాలుంటాయి. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు అంత్యప్రాసలుంటాయి. మూడవ పాదంలో 'తఖల్లుస్' (నామముద్ర) ఉంటుంది. నేను ఇతర కవి మిత్రుల పేర్లను సంబోధనాత్మకంగా ప్రయోగించాను.

ఆచార్య ఎండ్లూరి సుధాకర్, సెల్ : 9246650771

# తుమ్మెద... ఓ తుమ్మెదా...



శ్రీకృష్ణదేవరాయలు కళింగ దండయాత్ర తరువాత ప్రతాపరుద్ర గజపతి కూతుర్ని వివాహం చేసుకొన్నట్లు అనేక ఆధారాలున్నాయి. ఆమెపేరు తుక్క దేవి, జగన్మోహిని, రుచీదేవి, లక్ష్మీదేవి, వరదరాజమ్మ, లుఖ, సుభద్రగా వివిధ గ్రంథాల్లో వివిధ రకాలుగా చెప్పబడింది. కుమార దూర్జటి 'కృష్ణదేవరాయ విజయం'లో 'తుక్క' గానే పేర్కొన్నాడు. శ్రీ కృష్ణదేవరాయలు కొండవీటిని జయించి తన ప్రతినిధిగా నిలిపిన నాదెండ్ల గోప మంత్రి (మహామంత్రి తిమ్మరసు మేనల్లుడు) ప్రభోద చంద్రోదయమనే సంస్కృత నాటకానికి రాసిన 'చంద్రిక' వ్యాఖ్యలో

**"ప్రతాప రుద్రస్య గజేశ్వరస్య**
**పుత్రీం పవిత్రీకృత భూతధాత్రీమ్**
**ప్రత్యగ్రహీద్యః ప్రకటప్రతాపో**
**భద్రాం సుభద్రామివ పాండవేయః"**

అని పేర్కొన్నందువల్ల ఆమెపేరు 'భద్ర'గా తెలుస్తుంది. 'నరపతిరాజుల చరిత్ర'లో ఆమెపేరు 'లుఖ' అని పేర్కొన్నారు. 'విజయ నగర అతవణ కడితం'లోనూ రాయల 'అముక్త మాల్యద'లోను ఆమెపేరు 'లక్ష్మీదేవి'గా పేర్కొనబడింది. వాడుకలో 'లక్ష్మి' 'లచ్చి'గాను 'రుక్మిణి' 'రుక్కమ్మ'గాను మారటాన్ని మనం గమనించాలి. అలాగే ఒరియా భాషలోని 'లక్ష్మి' 'లుక్క'గా, 'తుక్క'గా వ్యవహారంలో ఉండి ఉండవచ్చు. కంబం చెరువు త్రవ్వించిన ఘనత ఈ వరద రాజమ్మదే!

"శ్రీ కృష్ణదేవరాయలు శాసనాల్లోనూ, సాహిత్యంలోనూ తిరుమలదేవి, చిన్నాదేవిల ప్రస్తావనే ఎక్కువగా చేశాడు కానీ తుక్కదేవిని ప్రస్తావించకపోవడానికి కారణం ఆమెతో వివాహం రాజకీయ తంత్రంలో భాగంగానే అయి ఉండవచ్చు. ప్రధాన శత్రువు కుమార్తె కావటం వలన ప్రతీకారంలో భాగంగా ఎడబాటు కలిగించి వుండవచ్చు. ఆ ఎడబాటును అన్యాపదేశంగా వివరిస్తూ ఆమె రచించిన 'తుక్కా పంచకం' ప్రసిద్ధి పొందింది.

శ్లో. 1. **"చరన్వనాంతే నవమంజరీషు,**
**నషట్పదో గంధఫలీమజిఘ్రత్,**
**సాకిం నరమ్యా నచకిం నరంతా,**
**బలీయసీ కేవలమీశ్వరాజ్ఞా."**

పూలవనంలో పూలగుత్తులపై వాలే తుమ్మెద, సంపెంగ పుష్పాన్ని ఆస్వాదించుట లేదు. సంపెగపువ్వు సౌందర్యమైనదే! తుమ్మెద పుష్పమరిమళాన్ని ఆస్వాదించేదే! అయినా ఆ పుష్పంపై తుమ్మెదకు అనురక్తి లేకపోవటానికి విధియే కారణం. భగవంతుని ఆజ్ఞ మిక్కిలి బలీయమైనది.

శ్లో. 2. **"మా, కింశుక ప్రకట యాత్మ నిమేషమాత్రం**
**మన్మస్తకే విహరతీతి మధువ్రతోయం**
**కిం, మాలతీ విరహవేదనయా త్వదీయం**
**దృష్ట్వా ప్రసూన మచిరా దనలభ్రమేణ."**

ఓ మోదుగు పుష్పమా! తుమ్మెద నా తలపై తిరుగాడుతుందని, ఒక్క క్షణకాలమైనా ముడుచుకొనక ఉండుము. (ముకుళింపకుము) మాలతివలన విరహవేదన పొందిన భ్రమరము నీ పుష్పమును చూచి, అనలమనే భ్రాంతిని పొందును.

శ్లో. 3. **"భ్రమర భ్రమతా, దిగంతారాళే,**
**క్వచిదాస్వాదిత మీక్షితం శ్రుతంవా,**
**వద సత్య, మపాస్య పక్షపాతం,**
**యది జాతీకుసుమానుకారి, పుష్పం."**

ఓ తుమ్మెదా! నీవు అన్నివైపులా సంచరిస్తున్నావుగదా! ఎక్కడైనా జాజిపువ్వుతో సమానమైన పుష్పపు రుచి చూసావా? లేక విన్నావా? నిష్పక్షపాతంగా నిజం చెప్పు.

శ్లో. 4. **"కుసుమాని లిఖన్తునామ చిత్రే,**
**కతిచి త్కారువిశేష రూఢశిక్షాః,**
**సురభిత్వమమూని కిం లభంతే,**
**కిము చై తేషు, రసంపిబంతి భృంగాః."**

చిత్ర కళలో నిష్ణాతులైన కొందరు వారి చిత్రాలలో పుష్పాలను చిత్రించెదరుగాక! కాని ఆ పుష్పాలకు పరిమళం వస్తుందా? తుమ్మెదలు ఆ చిత్రాలలోని పుష్పాలనుంచి మకరందం తాగగలవా?

శ్లో. 5. **"కిం మాలతీం మ్లాయపి, మాం విహాయ**
**చుచుంబ తుంబీ కుసుమం షడంఘ్రిః,**
**లోకే చతుర్భిశ్చరణైః, పశుస్స్యా**
**త్స షడ్భి రత్యర్థ పశుర్నకిం స్యాత్."**

షడ్పదమైన తుమ్మెద మాలతీపుష్పాన్ని, నన్నువిడిచి, తమ్మిపువ్వును ముద్దాడుతున్నది. ఆ తుమ్మెదకు కొంచమైనా జ్ఞానం లేదు. నాలుగు కాళ్ళు కలవి పశువులని ప్రసిద్ధం. ఆరు కాళ్ళు కలవి ఆ జ్ఞానహీనమగు పశువుకంటేను అధమమైనదేకదా!
ఇదీ తుక్కదేవి ఆవేదన.

సేకరణ : ఈమని శివనాగిరెడ్డి ; వివరణ : కుర్రా జితేంద్రబాబు



## నా కళా జీవితం – నెల్లూరు

# నవ్వుల రమణయ్య


*- నటరాజ రామకృష్ణ*

ఐదు దశాబ్దాల క్రిందట నృత్య కళ ప్రచార నిమిత్తం నాగపూరు నుండి నెల్లూరు వచ్చాను. ప్రఖ్యాత దేశ భక్తురాలు శ్రీమతి పొణకా కనకమ్మగారు, సినిమా హాస్యనటుడు తిక్కవరపు రమణారెడ్డి గారు నా రాకకు ముఖ్యంగా కారకులు. అప్పుడు నాది కూడా చిన్న వయస్సే. ఆనాటి విషయాలు కొన్ని ముచ్చటగా ఇక్కడ ముచ్చటించాను.

నవ్వులు, పువ్వులు – మాటల మతాబులు – మల్లె మొగ్గల్లాంటి నవ్వులు, మల్లెపువ్వుల్లాంటి నవ్వులు, మందారాల్లాంటి నవ్వులు, గురివింద పూ గుత్తుల్లాంటి నవ్వులు, గచ్చ పొదల్లో గలగల్లాడే నవ్వులు, వేప పూ గుత్తుల్లా చేదైదు నవ్వులు, గులాబీల్లా సువాసనలు వెదజల్లే నవ్వులు.

సుమారు 5 దశాబ్దాల క్రితం ఒకరోజు సాయంత్రం "ఏమండోయ్! స్టేషన్ వచ్చే సిందండోయ్!" అని నన్ను తీసికెళ్తున్న జి.టి. ఎక్స్‌ప్రెస్‌కు తగిలించిన ఇంజన్ ఒక హెచ్చరికలా కూతపెడుతూ నెల్లూరు ప్లాట్‌ఫారం చేరుకొంది. ఈ చివరి నుండి ఆ చివరి వరకు రైలు పెట్టెలు ప్లాట్ ఫారాన్ని ఆక్రమించుకొన్నాయి.

రైలు దిగిన వాళ్ళంతా వారి వారి సామాన్లు జాగ్రత్తగా చూసుకొంటూ కూలీలతోబాటు బైటకు వెళ్తున్నారు. నేను నా సామానుతోబాటు ప్లాట్ ఫారంమీదే ఉండిపోయాను.



అతడు ఎలా ఉంటాడో వర్ణించి రాయమంటే, ''అక్కర్లేదు, అతడే మిమ్మల్ని గుర్తుపడ్తా'' డంటూ మిత్రుడు తిక్కవరపు కోదండరామరెడ్డి సమాధానం వ్రాశాడు. నిజంగా అలాగే జరిగింది. అతడే నన్ను గుర్తు పట్టాడు. అంతమంది మనుష్యుల్లో నన్ను గుర్తుపట్టేసి, తిన్నగా నా దగ్గరకే వచ్చాడు. నన్ను చూసి నవ్వాడు. అతన్ని చూడగానే ఎందుకో నాకూ హృదయం విప్పి నవ్వాలని పించింది. నేనూ నవ్వేశా.

"ప్రయాణం హాయిగా జరిగిందా? బండి కాస్త లేటయినట్టుంది. వెళ్దాం రండి" అంటూ కూలీకి నా సామాను అప్పజెప్పి బయటకు అతడు దారి తీశాడు. బండెక్కి మా యిల్లు, అదే లెండి మా బస చేరాం. వస్తూ వస్తూ దార్లోనే టిఫిన్ తినేసి, కాఫీ తాగాము.

రావడమే హడావిడిగా వచ్చాం. వచ్చిం దగ్గర నుంచి మరీ హడావిడి, "ఇవాళ సాయంత్రం టౌన్‌హాల్లో 'పరివర్తన' నాటకం ఉంది. మీరు స్నానం చేసి కాస్త విశ్రాంతి తీసుకొండి. పెద్దబ్బాయి తర్వాత వచ్చి మిమ్మల్ని హాలుకు తీసుకు వస్తాడు," అంటూ హడావిడిగా అతడు వెళ్లిపోయాడు.

సంధ్యాసమయంలో మసక చీకటి. తెల్లని పైజమా, షర్టూ వేసుకొన్న నల్లని ఉంగరాల జుత్తు అబ్బాయి నవ్వుతూ వచ్చి, నన్ను ఆహ్వానించాడు. అతడు నవ్వినప్పుడు ఆతని పళ్ళన్నీ నాకు మిలమిల మెరిసిపోతూ కన్పించాయి. "ఇతడే అతని పెద్దబ్బాయి" అని అనుకొని అతని వెంట హాలుకి వెళ్లాను. మొదటి వరుసలో శ్రీ రేబాల పట్టాభిరామ రెడ్డిగారి ప్రక్కనే కుర్చీలో కూర్చున్నాను. అతడు నన్నాయనకు పరిచయం చేశాడు. నా గురించి అంతకు ముందే ఆయన విని ఉండడంవల్ల నమస్కారం, ప్రతి నమస్కారం చేసుకొన్నాం. ఆయన ఒక జమీందారు, అందువల్ల ఆయన చాలా హుందాగా నవ్వాడు. నేను కళాకారునిలా మల్లెపువ్వులా నవ్వాను.

అప్పుడు చూసిన ఆ 'పరివర్తన' నాటకమంతా ఈనాడు జ్ఞాపకం లేదుగాని మరుపురాని ఒక దృశ్యం, నేటికి మర్చిపోలేని దృశ్యం అందులో ఒకటి ఉంది. సమ్మె చేస్తున్న కార్మికుల్ని "తాగుబోతు వెధవలు..." అని తిడుతూనే మిల్లు యజమాని ఎర్రని విదేశీ సారాను గడగడా తాగేశాడు. ప్రేక్షకులు కడుపుబ్బేటట్లు నవ్వారు. ఆ మిల్లు యజమాని వేషం అతడు వేశాడు. అతడెవరో కాదు – రమణారెడ్డి! అతడికీ, నాకూ ఐదు దశాబ్దాల క్రితం ఆ విధంగా తొలి పరిచయం అయింది.

నేనే అతని కన్నా పెద్ద వాణ్ణయియుంటే, "రమణా రెడ్డి చాలా పెద్ద వాడవుతాడు. అందర్నీ నవ్విస్తాడు" అని అనాడే నా డైరీలో రాసి ఆశీర్వదించేవాణ్ణి.

మా పరిచయం స్నేహంగా పరిణమించి, ఆత్మీయతగా వర్ధిల్లింది. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ మాకు తెలియకుండానే మా యిద్దరి మధ్యా ఆత్మీయతతో పాటు పరస్పర గౌరవం పెంపొందింది.

అందుకే ఎప్పుడైనా ఏ సభలోనైనా మే మిద్దరం కలుసుకొన్నప్పుడు మా రమణయ్యకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్తూ ఉండేవాణ్ణి. "అతడే లేకపోతే నేను ఆంధ్రదేశం వచ్చేవాణ్ణి కాను. తెలుగు నృత్యకళా సరస్వతిని ఆరాధించే అవకాశం నాకు కలిగి ఉండేది కాదు" అని నేనే అనేవాణ్ణి.




"మా రామకృష్ణయ్య అలాగే అంటూ ఉంటాడు లెండి, నా మీదున్న అభిమానంతో. నేను నిమిత్త మాత్రుణ్ణి. అంతా ఆ భగవంతుని దయ" అని అత డనేవాడు. అది ఒక విధంగా నిజం. తనను సేవించడానికే నృత్యకళా సరస్వతి నన్ను రమణారెడ్డి ద్వారా పిలిపించింది.

నా నెల్లూరు జీవితంలో ఆ రాత్రి నేను నిద్రపోయి వేకువనే లేచి తయారయ్యేలోగా రమణయ్య కూడా నిద్రలేచాడు. ఆ తర్వాత ఇద్దరం కలిసి ఊళ్ళోని పెద్దల్ని కలుసుకొనడానికి బయలుదేరాం. మొట్టమొదట డాక్టర్ శ్రీమతి మాథ్యూస్ ఇంటికి వెళ్ళాం. ఆ నల్లని లావుపాటి విగ్రహాన్ని చూడ్డానికి భయం వేసింది. అయితే, ఆమె నవ్వుతూ మమ్మల్ని ఆహ్వానించింది. ఆమె హృదయం చాలా మంచిదని రమణయ్య నాకు ముందే చెప్పాడు.

అక్కడ నుండి కస్తూరీ దేవి విద్యాలయానికి వెళ్ళాం, అక్కడ పొణకా కనకమ్మగార్ని కలుసుకొన్నాం. భారతదేశ రాజకీయాల్లో ఆనాడు శ్రీమతి సరోజినీదేవి నాయుడు ఎంత గొప్ప రాజకీయవేత్తో నెల్లూరుజిల్లా రాజకీయాల్లో కనకమ్మగారు అంత గొప్ప రాజకీయవేత్త. రైతులకొరకు వేంకటగిరి జమిందారులతో తగవులాడి రైతుల హక్కులను కాపాడిన దిట్ట ఆమె. ఆమెకు రాజకీయాల్లో ఎంత మక్కువ ఉందో అంత ఇష్టం లలితకళల్లో కూడా ఉండేది. ఆమె దేశ భక్తురాలు, అసలుసిసలై క్రాంగెసు సేవకురాలు. వస్తూ, వస్తూ డాక్టర్ లక్ష్మిగార్ని కలిశాం. ఆమె భక్త మీరాలా ఉంది. ఆమె జీవితం గూడ మీరా జీవితం లాగే అయిపోయింది.

ఆనాటి మధ్యాహ్నం శ్రీ రేబాల పట్టాభిరామరెడ్డి గార్ని, వారి సోదరుడు లక్ష్మీ నరసారెడ్డి గార్ని కలిశాం. ఆ యిద్దరు సోదరులు ఇరుగు పొరుగు బంగ్లాలలో ఉన్నారు. ఒకరింట్లో ప్రాచీన జమీందారీ సంప్రదాయం గోచరిస్తే, ఇంకొక రింట్లో పాశ్చాత్య నవ్య నాగరకత గోచరించింది. వారు సహోదరులే అయినా సంస్కారాలు వేరు. ఎవరి అభిరుచులు వారివి, ఎవరి ఆదరణ వారిది, ఎవరి కళాపోషణ వారిది.



తెలుగు దేశంలో వివిధ తరగతులవారిని, రకరకాల ప్రజల్ని, అనేక అంతస్థుల వారిని కలుసుకొనడం నాకదే ప్రథమం. మహారాష్ట్ర, హిందూస్థానీ దేశాల్లోని నా అనుభవాలు వేరు, ఈ అనుభవాలు వేరు. ఈ అనుభూతులు ఒక అవ్యక్తానందాన్ని నాకు కలిగించాయి.

నేను నెల్లూరు వెళ్ళిన కొన్నాళ్ళ తర్వాత నృత్యనికేతనం ప్రారంభించాను. అందువల్ల ఉదయం, సాయంత్రం నృత్యాభ్యాసం చేయడం, ఇతర సమయాల్లో తీరిగ్గా మా ఇద్దరి పిచ్చాపాటీ, ఒకనాడు మా కబుర్లలో ఒక ముచ్చటైన విషయాన్ని అతడు తమాషాగా చెప్పాడు.

ఒకసారి అతడు హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోసం మునిసిపాలిటీకి దరఖాస్తు పెట్టాడట. ఇంటర్వ్యూకి బెజవాడ వెళ్ళాడట. అవి బ్రిటీష్ వారు ఇంకా మనదేశాన్ని పరిపాలిస్తున్న రోజులు. అందువల్ల అప్పుడది బెజవాడేగాని ఇంకా విజయవాడ కాలేదు. హెల్త్ ఆఫీసర్ని ఆయన కలిశాడు. ఆయన ఈయన్ని ఎగాదిగా చూసి తనలో తాను నవ్వుకొని,


తన ప్రక్క కుర్చీలో కూర్చోమన్నాడట. నిలబడే ఓపిక ఈయనకు ఉందో లేదో అన్న సందేహం కలిగి, ఆయన జాలిపడి ఉంటాడు.

ఆ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రెండే రెండు ప్రశ్నలు వేశాడుట: "మురికి కాలువల్ని ఎవరు శుభ్రం చేస్తారు?" "సూర్యుడు." రమణయ్య సమాధానం. "రోడ్ల ప్రక్కన మనుష్యులు విసర్జించిన మలాన్ని ఎవరు శుభ్రం చేస్తారు?" "పందులు."

ఈ రెండు సమాధానాలకు ఆ ఆఫీసర్ నిశ్చేష్టుడై పోయాడుట. అంతలోనే ఆయన తేరుకుని పకాలున నవ్వేడట.

"అయ్యా, నేను బెజవాడ వచ్చినప్పటినుండి చూస్తున్నా. మీరడగిన రెండు పనులూ నే చెప్పినవారే చేస్తున్నారు, అన్నాడట రమణయ్య. ఆ సమాధానానికి ఆ ఆఫీసర్ తృప్తి చెందాడట. తనను మళ్ళీ అతడు తేరిపార చూసి రమణయ్య హెల్తుకు మెచ్చి కాబోలు వెంటనే "ఇన్‌స్పెక్టరు ఉద్యోగం ఇచ్చాను, వెళ్ళు" అన్నాడట! అతడు అందర్నీ నవ్విస్తే అతని ఆరోగ్యం అతన్ని తరచు ఏడిపిస్తూ ఉండేది.

నేను నెల్లూరులో నృత్యనికేతనం స్థాపించి ఒక సంవత్సరమైంది. నెల్లూరులో పెద్దింటి ఆడపిల్లలంతా నాట్యం నేర్చుకొనాలని మోజుపడ్డం మొదలు పెట్టారు. చాలా మంది నాట్యం నేర్చుకొనడం ప్రారంభించారు. అంతవరకు ఇత్తడి దుఖాణాల్లో చిలుంపట్టి నిదురపోయిన గజ్జెలకు గిరాకీ పెరిగింది. బట్టల వర్తకులు కూడా సంతోషించారు. శాస్త్రీయ వాద్య సంగీత కళాకారులు సంబరపడ్డారు. రమణారెడ్డిని మెచ్చుకోనివారు లేరు. ఒక ప్రక్క శుక్లపక్ష చంద్రునిలా మేం అన్ని విధాలా వెలిగిపోతున్నా మరో ప్రక్క మేం కృష్ణపక్షాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది.



నేను నాగపూర్‌లో ఉండగా మత కల్లోలాలను చూశాను గాని, కుల కల్లోలాలను, శాఖ – అంతర్ శాఖల్లో దెబ్బలాటలను నేనెప్పుడూ ఊహించలేదు. మొట్టమొదటి సారి ఈ విషయం నాకు నెల్లూరులోనే తెలిసింది. ఆ విషయం నేను మా రమణయ్యతో అంటే, "అసలు మీకు మీ నాట్యం తప్ప వేరేం తెలుసండి ఈ లోకం పోకళ్లు? నాకు తెలీక అడుగుతున్నా..." అని నవ్వుతూ ఆయన తేల్చేశాడు.

నా గురించి ఏదేదో అనుకొన్నవారు నేను 'అది' కానని తెలిసికొన్నారట! నిరాశ చెందారట! దాంతో వారూరు కొన్నారూ? మా దారిని మమ్మల్ని నాట్యకళా ప్రచారాన్ని చేయనివ్వకూడదూ? అలా అయితే వారు ఆంధ్రు లెందుకవుతారు? ఎవరి కర్మకు వారిని వదిలి వేసేవారు ఆంధ్రులు కారుగా?


మా ఉపన్యాసాలు, అభినయపూర్వక ఉపన్యాసాలు, ప్రదర్శనలు జమీన్ రైతు, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక మొదలైన పత్రికల్లో ప్రచురించడంతో మా నృత్యకళ ప్రచారంలోకి వచ్చింది. నృత్యాన్ని ఒకానొక తెగవారే నేర్చుకొనాలన్న పురాతన దృష్టిలో కొంత మార్పు వచ్చింది. మంచిదే అనుకొన్నాం. కాని, నన్ను 'ఏదో' అనుకొన్న వారు, దానివల్ల నిరాశ చెందినవారు ఒక నూతన పథకం వేసి ఇంకెవర్నో తీసికొని వచ్చారు. ఆయన చాలా గొప్ప వాడని ప్రచారం చేశారు. నిజమేననుకొని నేను చాలా సంతోషించాను. కాని, అది నాకొక పోటీగా తయారు చేశారు వారు. పదమూడు రోజుల్లో భరతనాట్యం నేర్పేస్తా నన్నాడు ఆ కొత్త వ్యక్తి. అలాగే చెప్పి అతడు కొందరిచేత ప్రదర్శన లిప్పించాడు.


"ఆహా! నా స్వరూపం ఇదేనా?" అంటూ నాట్య సరస్వతి విస్తుపోయి, కంగారుపడి కంటనీరు పెట్టిందనుకోండి. దానిని గురించి వాళ్ళంతా పట్టించుకోలేదు. కాని రమణయ్యతో బాటు నాకూ బాధనిపించింది.

కేవలం నాట్యకళా ప్రచారం కోసమే నన్ను ఉత్తరాది నుంచి పిలిపించిన అతనికి ఇదంతా చాలా బాధ అనిపించింది. నేనెప్పుడూ ఇలాంటి వాతావరణాన్ని చూడలేదు. నేను రాజుల ఆస్థానాలలో పెరిగా. విద్వాంసులు, పండితులు, కవులు మొదలైన వారిముందు ప్రదర్శన లిచ్చా. 'నువ్వా, నేనా' అన్నట్టు పోటీపడి పెద్ద కళాకారులను పోటీలలో ఢీ కొన్నా, అందువల్ల నాకు విసుగుతోబాటు విచారం పట్టుకొంది.

"రమణారెడ్డిగారూ! ఆంధ్రదేశంలో జరిగిన నాట్యకళా ప్రచారం చాలు, ఇంక నేను నా దేశం వెళ్ళిపోతా" నన్నాను ఒక రోజున. నేను హాస్యానికి కాకుండా నిజంగానే ఆ మాటలు అంటున్నానని మా రమణయ్య గ్రహించి, నా ముఖంలోకి తీక్షణంగా చూసి, నా మాటల్ని తోసిపుచ్చాడు.

"రామకృష్ణా! స్వర్గానికి పోయినా సవతి పోరు నీకు తప్పదు. మన పుణ్య భారతదేశంలో కుల, మత, వర్గ పోరాటాలు, ఈర్ష్య అసూయలు ఇవన్నీ ఆనాది నుండి వస్తున్నవే. అందువల్లనే మనది బానిస దేశమైంది. వివేకానందుడు ఏమన్నాడు? "Jealousy is the birth right of a slave nation" అని అన్నాడు. జీవితంలో మీరేం చూశారు? ఏమీ చూడలేదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను, పోటీలను ఎదుర్కొనాలిగాని, భయపడి పరుగెత్తడం మీ వంటి బుద్ధిమంతుల లక్షణం కాదు. మీరు ధైర్యంగా నిలబడండి. ఇవాళ కాకపోతే రేపైనా లోకం మిమ్మల్నే మెచ్చుకొంటుంది" అని ఆయన నాలో ధైర్యాన్ని, ఆత్మ స్థైర్యాన్ని నూరిపోశాడు.





ఆ మాటలతో ధైర్యం తెచ్చుకొన్నాను. మరి కొద్ది నెలల్లోనే ఆయనన్నట్టుగానే జరిగింది. అందుకే కాబోలు "ప్రతి ఇంటిలో అనుభవంతో తలనెరిసిన పెద్ద తల ఒకటుండాలి" అని మన పెద్దలన్నారు.

కుమారి శ్యామా కౌండిన్య మా నృత్యనికేతనంలో నాట్యం నేర్చుకొంది. నేర్చుకొనడమే కాదు. ప్రదర్శన లిచ్చింది. ఆమెది అందమైన విగ్రహం నా పాటకు ఆమె ఆట రక్తి కట్టింది. లోకం మెచ్చింది, పొగిడింది, కొనియాడింది. దెబ్బతో మేము మద్రాసు నుండి శ్రీకాకుళం వరకూ సుడిగాలిలా చుట్టబెట్టి వచ్చాం.

"చూశారా, ఓర్పు ఎంత మంచిదో! సఫర్ కే ఫల్ మీటా హోతాహై" అని నెల్లూరు ఉర్దూ భాషలో రమణయ్య అన్నాడు. ఆయన భాష నన్ను నవ్వించింది.


నన్ను ఆంధ్రదేశానికి ఆయన రప్పించింది, నేను నృత్య కళను ప్రచారం చేయాలని, సుడిగాలివంటి మా పర్యటన వల్ల నా పేరు ఆంధ్రదేశంలో చాలా వరకూ పాకింది. సహృదయులు సంతోషించారు, పెద్దలు ఆశీర్వదించారు. నన్ను 'ఏదో' అనుకొన్నవారు నా విజయానికి లోలోన కుళ్ళి పోయారు. మా ధాటికి వారు తట్టుకోలేక క్రుంగిపోయారు. ఏడ్వలేక నవ్వినట్టు, ఎందుకైనా మంచిదన్నట్టు లోపల మండి పోతున్నా పైకి నవ్వుతూ మమ్మల్ని వారు అభినందించారు.

ఈ మధ్య కాలంలో మా రమణయ్య మద్రాసు తరచుగా వెళ్ళి వస్తూండేవాడు. ఆయనకు సినిమాలో వేషం వేయాలన్న సంకల్పం కలిగింది. పూర్తిగా మద్రాసులోనే ఉండి పోవాలనే అయనకి బుద్ధిపుట్టి, ఆ నిశ్చయానికి వచ్చే ముందు నన్నొక మహా నాట్యకళా శాస్త్రవేత్తకు పరిచయం చేశాడు. ఆయనే ఒంగోలు వేంకట రంగయ్యగారు.

వేంకట రంగయ్య గారంటే ఆచార్య మామిడిపూడి వేంకట రంగయ్యగారని మొదట అనుకొని భ్రమ పడ్డాను. మామిడిపూడి వారు గొప్ప చారిత్రక పరిశోధకులని నాకు తెలుసు. నా విద్యార్థి దశలో వారి చారిత్రక వ్యాసాలు ఎన్నో చదివాను. ఈయన ఆయన కారని తర్వాత తెలుసు కొన్నాను. ఒంగోలు వారు గొప్ప నాట్యశాస్త్ర పరిశోధకులు.

ఒకనాడు ఒంగోలు వారి కుటీరానికి వెళ్ళాం. ఆయన నాట్యశాస్త్ర గ్రంథాల మధ్య కూర్చుని ఉన్నారు. వాల్మీకి మహర్షికి గెడ్డం తీసేసినా, వీరికి గెడ్డం తగిలించినా ఒకే లాగుంటారని నాకెందుకో అనిపించింది. వీరిలోని తేజస్సు, జ్ఞానం, ఆదరణ, ఆత్మీయత నన్ను ఆకట్టుకొనడం వల్ల నా కలా అనిపించి ఉండవచ్చు.

నవ్వుల రమణారెడ్డి కథలో నా సొంతబాకా ఎందుకని మీరు అనుకోకండి. ముమ్ముందు ఎవరైనా మన ఆంధ్రదేశ నాట్యకళా చరిత్రను వ్రాస్తున్నప్పుడు రమణయ్యకూ నాట్యకళా చరిత్రకూ సంబంధం లేదని ఆయన్ని విస్మరించ వచ్చును. ఆంధ్రదేశంలో నృత్యకళా ప్రపంచంలో ఆయన గావించిన కృషిని (నాసంగతి వదిలేయండి, నాకు తప్పదుగా!) చారిత్రక పరిశోధకులు గుర్తించాలని, ఇదంతా వ్రాస్తున్నా.



అయితే, ఒక్క మాటలో చెప్పాలంటే – ఆంధ్రలో మరుగుపడిపోయిన శాస్త్రీయ నృత్యకళకు చంద్రోదయం కలిగి మళ్లా పునాది పడింది నెల్లూరు పట్నంలో; దానికి శంకుస్థాపన చేసినవారు "నవ్వుల నటుడు" తిక్కవరపు రమణా రెడ్డి, నేను ముద్దుగా రమణయ్య అంటాను.

## నటరాజ రామకృష్ణ గారికి వారి అభిమాని కుమారుడు వ్రాసిన ఉత్తరము :

మున్నూరు పోలూరు
3-11-1997

*పెద్దలు రామకృష్ణ గారికి*

నమస్తే

మనుషులు గతించాక వాళ్ల విలువ మరింతగా తెలుస్తుందంటారు. అయిదవ తరగతి చదువు దాటని నాన్న ముప్పయి యేళ్ళపాటు వొక పత్రిక నిర్వహించడం, కథలు రాయడం వంటి విశేషాలు మాకు గర్వాన్ని కలిగించేవేగానీ – ఆయన భౌతిక కాయం వుంచిన స్థలమంతా పూలు గుట్టలై పేరుకోవడం, కార్లతో స్కూటర్లతో మనుషులతో మా పల్లె మొత్తం కిక్కిరిసి పోవడం, ఆయన బిడ్డలమయిన మాకు తెలీని ఎందరో బారులు తీరి ఆయన భౌతిక కాయానికి చేతులు జోడించడం మా దుఃఖాన్ని వొకింత ఓదార్చాయి.

మా నాన్న రాజకీయ నాయకుడు కారు. ఆయన వల్ల వోట్లు రావు. కనీసం మా అమ్మని కూడా వోటు వేయమని అడగరు. అయినా ఆయన అంతిమయాత్ర కోసం హైదరాబాద్ నుంచి వొక మంత్రి వచ్చారు. మాజీమంత్రి వొకరు మా యింటిదగ్గరే గంటలపాటు వుండిపోయారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులూ వచ్చారు. 29న ఆయన సంతాప సభ మా పల్లెలో జరిగింది. వీళ్ళందరూ మళ్ళీ వచ్చారు. మాకు డబ్బు లేదు. కులం లేదు. కూర్చోడానికి రెండు కుర్చీలయినా లేని చిన్న రేకుల యిల్లు – మా పల్లెలోని యీ యింటికి అందరినీ రప్పించినది ఆయన మంచితనం మాత్రమే అని మరింత అర్థమయ్యాక ఆయన లేనితనం మరింతగా దుఃఖపెడుతూ ఉంది.

నా వరకూ నాకు వొక చిన్న సంతృప్తి. పాతికేళ్ళకు పైగా ఆయనలో వున్న కోరిక నెరవేర్చగలగడం. మిమ్మల్ని కలుసుకోవాలనీ మీతో మాట్లాడాలనీ ఆయన ఎంతగా ఆతృత పడ్డారంటే – మేం కొంచెం విసుక్కున్నాం కూడా ఆయన్ని. మీరు ప్రముఖులు. తన మాటలతో ఆయన మిమ్మల్నేమైనా విసిగిస్తారేమో అని మా భయం. ఎన్నో ముందు జాగ్రత్తలు చెప్పి తీసుకువచ్చాం మీ దగ్గరికి. మీకు నమస్కారం చెప్పుకుని వెళ్ళిపోదామని. మీరు విసుక్కోలేదు. పైగా ఎంతో పరిచయం వున్నట్టుగా ఆత్మీయంగా మాట్లాడారు. ఇవన్నీ కాదు. హఠాత్తుగా మీరు ఆయనకు శాలువా కప్పడం ఆ క్షణం ఆయన కళ్ళలో తొణికిసలాడిన చెమ్మ ఎంత సంతోషాన్ని ప్రతిఫలించిందో నాకు తెలుసు. సంతోషంతో ఎగతన్నుకు వచ్చిన దుఃఖాన్ని దిగమింగుకుని ఆయన కొన్ని క్షణాలు నిశ్చలంగా వుండిపోయారు. ఆయన 74 యేళ్ళ తన జీవితంలో పొందిన గొప్ప గౌరవంగా ఆ క్షణాలను దాచుకున్నారు. యింటికొచ్చి పసిపిల్లాడిలా సంబరపడ్డారు. వూరికొచ్చి మీ శాలువానీ, మీరు యిచ్చిన పుస్తకాలనీ అందరికీ చూపారు. ఆ క్షణాలని ఫోటో తీసి వుండాల్సిందని ఆయన కోరిక. కెమెరా తేలేదు నేను. రెండవసారి మిమ్మల్ని కలిసినప్పుడు అందుకే కెమెరా తెచ్చాను. మీతోవున్న ఫోటోలను ఆయన దాచుకున్నారు.




ఆయన చనిపోయాక ఆయన డైరీలో వొక ఫోటో దొరికింది. మీరు కప్పిన శాలువాను భుజాల చుట్టూ కప్పుకుని మీరిచ్చిన పుస్తకాలు చేతబట్టుకొని స్టూడియోలో తీసుకున్న ఫోటో అది. మాకు తెలిస్తే చిన్నపిల్లాడిలా ఏమిటది అంటామనే బెరుకుతో ఎవ్వరికీ చూపకుండా రహస్యంగా దాచుకున్నారు ఆ ఫోటో.

మీకు కావలసిన సమాచారం సేకరించడానికి 18న కొన్ని వూర్లకు వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నారట. 17న కన్నుమూశారు. ఆయన ఫోటో ముందు ఆయన బట్టలు కళ్ళద్దాలు కలంతో పాటు మీరిచ్చిన మీ పుస్తకాలు వుంచారు. అంతగా ఆయన వాటిని ప్రేమించాడు.

తన చివరి రోజుల్లో మీ పరిచయం ఆయనకు ఎంతో సంతృప్తినిచ్చింది. అందుకు మీకు మేం ఎంతో కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

హైదరాబాద్ వచ్చాక మిమ్మల్ని కలుస్తాను. వుంటాను.

**గౌరవంతో ప్రేమతో**
**ఉమామహేశ్వరరావు**



రవీంద్రుని నోబెల్ పురస్కార ప్రసంగం

# విశ్వభారతికి ఆహ్వానం...

**- రవీంద్రనాథ్ టాగూరు**

రవీంద్రనాథ్ టాగూరు నోబల్ పురస్కారం అందుకోడానికి 1913లో స్టాక్ హూమ్ వెళ్ళలేక పోయారు. 1921లో వెళ్ళి ఆ పురస్కార సమితిని సంబోధించారు. ఆ ప్రసంగం మీకోసం...

ఎట్టకేలకు మీ దేశానికి రాగలిగినందుకు, నా రచనకు గుర్తింపు నిచ్చి, నోబెల్ పురస్కారం ప్రదానం చేసి నన్ను సత్కరించిన మీ పట్ల నా కృతజ్ఞత తెలిపేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకో గలుగుతున్నందుకు నాకు సంతోషంగా ఉంది.

ఇంగ్లండులోని నా ప్రచురణ కర్త ఈ పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన సమాచారం అందిస్తూ పంపిన కేబుల్ గ్రామ్ నాకందిన అపరాహ్ణం నాకు గుర్తుంది. అప్పుడు నేను శాంతినికేతన్ పాఠశాలలో ఉన్నాను. ఈ పాఠశాల గురించీ మీకు కొంత తెలిసే ఉంటుంది. అప్పుడు మేము ఒక జట్టును తీసుకొని పాఠశాల సమీపంలో ఉన్న ఒక అడవిలోకి వెళ్తున్నాం. దారిలో తంతి తపాలాఫీసు మీదుగా మేము వెళ్తూ ఉండగా ఒక మనిషి పరుగెత్తుకుంటూ మా వద్దకు వచ్చి ఒక టెలిగ్రాం అందించాడు. బండిలో నాతో పాటు ఒక ఆంగ్లేయ అతిథి కూడా ఉన్నాడు. టెలిగ్రాంలోని సమాచారం అంత ముఖ్యమైంది అయి ఉండదనే ఆలోచనతో మేము వెళ్తున్న చోటికి చేరిన తర్వాత, చదువుకోవచ్చు లెమ్మని నేను దాన్ని తీసుకొని జేబులో పెట్టేసుకున్నాను. అయితే నాతో ఉన్న అతిథికి అందులోని సమాచారం ముందే తెలిసిందేమో అన్నట్లు అందులో ఒక అతి ముఖ్యమైన సమాచారం ఉండవచ్చుని చెప్పి వెంటనే చదవమని నన్ను తొందరపెట్టాడు. అప్పుడు నేను అది తెరిచి చదివాను. అయితే అందులోని సమాచారం నిజమై ఉంటుందనే నమ్మకం నాకు కలగలేదు. మొదట టెలిగ్రాం భాషలో ఏదో తప్పు ఉందని, అందులోని విషయం సరిగా బోధపడటం లేదనిపించింది. అయితే కొంత సేపటికి అందులోని వార్త నిజమే అయి ఉంటుందనే భావన నాకు కలిగింది. ఇక మా పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆ వార్త ఎంత ఆనందం కలిగించి ఉంటుందో, మీరు అర్థం చేసుకోండి. అన్నింటిని మించి నన్ను లోతుగా స్పర్శించిన విషయం ఏమిటంటే ఎవరైతే నన్ను గొప్పగా అభిమానిస్తారో, గాఢంగా ప్రేమిస్తారో ఆ పిల్లలు తాము ఆదరించే, ఆరాధించే వ్యక్తికి ఈ గౌరవం దక్కినందుకు ఎంతగానో గర్వపడ్డారు. నాకు లభించిన ఈ గౌరవంలో నా దేశవాసులు సైతం పాలుపంచుకుంటారని కూడా నాకు తెలిసింది.

ఈ ఆలోచనలతో మిగతా అపరాహ్ణం గడిచిపోయింది. రాత్రి అయిన తర్వాత డాబా పైన ఒంటరిగా కూర్చొని నన్ను నేను ఇలా ప్రశ్నించుకున్నాను – నేను వారి జాతికి చెందిన వాణ్ణి కాకపోయినా, ఎన్నో పర్వతాలు, సముద్రాలు నన్ను తమనుంచి వేరు చేస్తున్నా పాశ్చాత్య ప్రజలు నా కవితలకు ఇలాంటి గుర్తింపు, గౌరవం ఇవ్వడానికి కారణం ఏమై ఉంటుంది? అని. గొప్పగా పొంగి పోయి నన్ను నేను ఈ ప్రశ్న అడగలేదని, ఆ తరుణంలో వినయభావమొక్కటే నన్నావహించిందని ఇప్పుడు మీకు నమ్మకంగా చెప్పదలచుకున్నాను.

అతి చిన్నతనం నుంచి నా జీవిత గమనం ఎలా పరిణామం చెందుతూ వచ్చింది అనేది నాకు గుర్తుంది. 25 సంవత్సరాల వయసులో బెంగాల్‌కు చెందిన ఒక మారుమూల

ఆంగ్లం నుంచి తెలుగు సేత : డా. జె. లక్ష్మిరెడ్డి, సెల్ : 09811589430

గ్రామంలో గంగానది ఒడ్డున ఒక నౌకాగృహంలో నేను ఏకాకిగా ఉంటూ ఉండేవాణ్ణి. ఆకురాలు కాలంలో హిమాలయ ప్రాంత సరస్సుల నుంచి వచ్చే సారస పక్షులే అక్కడ నా సజీవ సహచరులు. ఆ ఏకాంతంలో నేను రాగ రంజిత మదిరలాగా ఆ ఉన్ముక్త ప్రదేశ పరిసరాలను అంతర్లీనం చేసుకొని ఉండవచ్చు. నది తన గలగల నాదంతో సంభాషిస్తూ ప్రకృతి రహస్యాలు నాకు చెపుతూ ఉండేది. ఆ ఏకాంతంలో కలలు కంటూ కవితల్లో, ఇతర రచనల్లో ఆ కలలకు రూపాన్నిస్తూ వివిధ పత్రికల ద్వారా కలకత్తా ప్రజలకు నా ఆలోచనలు చేరవేస్తూ నేను కాలం గడిపేవాణ్ణి. అప్పటి నా జీవితం పాశ్చాత్య ప్రపంచ జీవన శైలికి భిన్నంగా ఉంటుందని మీరు అర్థం చేసుకొనే ఉంటారు. మీ పాశ్చాత్య కవులు గానీ, రచయితలు గానీ ఎవరైనా తమ బాల్యంలోని అతి పెద్ద భాగం ఇలాంటి ఒంటరితనంలో గడిపారేమో నాకు తెలియదు. అలాంటిది జరిగే అవకాశం లేదని, పాశ్చాత్య ప్రపంచంలో ఇలాంటి ఏకాంతానికి చోటు లేదనీ నేను భావిస్తాను.



నా జీవితం అలా సాగిపోయింది. ఆ రోజుల్లో నా దేశ ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులకు నేనొక అనామకుడైన వ్యక్తిని. అంటే నా ప్రాంతం వెలుపల నా పేరు ఎవరికీ తెలిసేది కాదు. అయితే, ప్రజా సమూహాల కుతూహల దృష్టుల నుంచి నన్ను కాపాడుతూ వచ్చిన ఆ అనామకత్వంతో నేను సంతృప్తిగానే ఉండేవాణ్ణి.

కొంత కాలం తర్వాత ఆ ఏకాంతవాసం నుంచి బయటికి వచ్చి నా తోటి మానవుల కోసం ఏదో ఒకటి చేయాలనే బలమైన కోరిక నాకు కలిగింది. ఆ కోరికలో కేవలం నేను కన్న కలలకు రూపులు దిద్దడం, జీవిత సమస్యల గురించి లోతుగా ఆలోచించడం మాత్రమే గాక, ఏదో ఒక గట్టి పని ద్వారా నా ఆలోచలనకు అభివ్యక్తినిచ్చి నా తోటి మానవులకు ఒక నిర్దిష్టమైన రంగంలో సేవ చేయాలనే తీవ్రమైన ఆలోచన ఉండేది.

ఈ సందర్భంగా నా మనసుకు తోచిన ఆలోచన పిల్లలకు చదువు చెప్పడం, దీనికి కారణం విద్యాబోధన చేయడానికి నాకు ప్రత్యేకమైన యోగ్యతలు ఏవో ఉండడం కాదు. ఎందుచేతనంటే నేను స్వయంగా క్రమబద్ధమైన చదువు వల్ల కలిగే ప్రయోజనాలను పొందినవాణ్ణి గాను. ఈ బాధ్యత తీసుకోడానికి కొంత కాలం సందేహించాను. అయితే ప్రకృతి పట్ల నాకు గాఢమైన ప్రేమ ఉంది. కాబట్టి సహజంగా పిల్లల పట్ల కూడా నాకు ప్రేమ ఉంది అని కూడా నాకు అప్పుడు అనిపించింది. ఈ విశ్వవిద్యాలయం స్థాపించడంలో నా ముఖ్యోద్దేశ్యం పిల్లలకు జీవితోల్లాసం, ప్రకృతితో తాదాత్మ్యం సంపూర్ణంగా కలిగి ఉండే అవకాశం కలిగించడం. నా చిన్నతనంలో స్కూలుకు వెళ్ళే రోజుల్లో సాధారణంగా పిల్లలందరి పైన విధించే అర్థంలేని విధి – నిషేధాల బాధను నేను కూడా అనుభవించాను. పిల్లల్లో దేనిపట్ల తీరని దాహం ఉంటుందో, ఆ స్వేచ్ఛను, జీవితోల్లాసాన్నీ అణిచిపెట్టి యాంత్రికమైన బోధనా విధానానికి నేను తలవంచవలసి వచ్చింది. అందువల్ల చిన్న పిల్లలకు స్వేచ్ఛ, ఆనందోల్లాసాలు కలిగించడమే నా ఉద్దేశ్యమైంది.

ఈ విధంగా నా చుట్టూ కొందరు పిల్లలను చేర్చుకున్నాను. వారికి విద్య నేర్పాను. వారికి సుఖసంతోషాలు కలిగించే ప్రయత్నం చేశాను. ఆటల్లో నేను వాళ్ళ జతగాణ్ణయ్యాను. వాళ్ళ సహచరునిగా మారిపోయాను. వాళ్ళ జీవితాల్లో పాలు పంచుకున్నాను. జట్టులో అందరికంటే పెద్ద పిల్లవాడుగా అనుభూతి పొందాను, స్వేచ్ఛ నిండిన ఆ వాతావరణంలో మేమందరమూ కలిసి పెరిగాం. ఆ పిల్లల పద్ధతి, ఉత్సాహం, ఉద్వేగం, వాళ్ళ మాటలు, పాటలు వాతావరణాన్ని ఉల్లాస తరంగాల్లో ముంచెత్తేవి. అక్కడ ఉన్నన్ని రోజులూ ఆ అనుభూతిని నాలో అంతర్లీనం చేసుకున్నాను. సాయంకాలాల్లో, సూర్యాస్తమయ వేళల్లో అక్కడి బాటలను దట్టమైన నీడలతో కప్పే వృక్ష పంక్తులను చూస్తూ ఒంటరిగా కూర్చునేవాణ్ణి. అపరాహ్ణాల నిశ్శబ్దంలో గాలిలో తేలి వచ్చే పిల్లల అరుపులు, కేకలు, కేరింతలు నా చెవులకు సోకేవి. ఆ కేకలు, కేరింతలు భూహృదయం నుంచి జీవిత స్రోతస్సులాగా ఎగిసి వచ్చి అనంత ఆకాశం దిశగా సాగే వృక్షాల్లాంటివే కదా అని నాకు అనిపించేది. ఆ కోలాహలమంతా మానవ హృదయంలోంచి ఉబికి ఆకాశానికి ఎగిసే సమస్త మానవ జీవిత ఆవేదనలను, ఉల్లాసాభి వ్యక్తులను, ఆశా – ఆకాంక్షలను ప్రతీకాత్మకంగా

నా ఎదుట నిలిపేది. ఎదిగిన పిల్లలమైన మనం మన కోరికలను, ఆక్రందనలను, ఆ అనంత శక్తి దిశగా పంపుతూనే ఉంటాం కదా! అనే భావన అప్పుడు నాకు కలుగుతూ ఉండేది.

అలాంటి పరిసరాల్లో, అలాంటి వాతావరణంలో నేను 'గీతాంజలి'లోని గేయాలు రాశాను. ఉజ్జ్వల నక్షత్రాల కాంతితో నిండిన భారతదేశపు ఆకాశం క్రింద అర్ధరాత్రిపూట నాలో నేను అవి పాడుకునేవాణ్ణి. ప్రాతఃకాలాల్లో, అస్తమించే సూర్యుని కాంతి ప్రసరించిన సాయంకాలాల్లో ఆ గేయాలు రాస్తూ ఉన్నప్పుడు, ఒక రోజు నాకు మళ్ళీ బయటికి వచ్చి విశాల ప్రపంచ హృదయంలో కలిసిపోవాలనే బలమైన కోరిక కలిగింది.

నాకు నేను విధించుకున్న ఏకాంతవాసం నుంచి బయట పడి ఆనందోత్సాహ జీవులైన పిల్లల మధ్యకు రావడం, నాతోటి వారికి తోచిన సేవ చేయడం విశాల బాహ్య ప్రపంచం దిశగా నా ప్రస్థానికి నాందిలాంటి దవుతుందని నాకు తోచింది. అప్పుడే పాశ్చాత్య మానవాళితో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవాలనే బలమైన కోరిక కూడా కలిగింది. ఎందుచేతనంటే అతిశయించిన శక్తి సామర్థ్యాలు పొంది ఉన్న పాశ్చాత్య మానవునికే నేటి యుగం చెందుతుందనే విషయం నాకవగతమయింది గనుక.

ప్రస్తుతం ప్రపంచంలోని శక్తి అంతా పాశ్చాత్య మానవునిలోనే ఉంది. అతని జీవితం అన్ని హద్దులను దాటి ముందుకు సాగిపోతూంది. మానవుని గొప్ప భవిష్యత్తు నిర్మాణానికి తన సందేశం అందిస్తూంది. నా జీవన యాత్ర ముగిసే లోగా పాశ్చాత్య ప్రపంచంలోకి రావాలనీ, దైవాంశ దీప్తితో వెలుగుతున్న అక్కడి మానవునితో తప్పక కలవాలనే అభిలాష నాకు కలిగింది. సమస్త జీవశక్తులు, ఆకాంక్షలు కలిగిన దివ్యశక్తి సంపన్నుడైన మానవుడు పశ్చిమ దేశాల్లోనే ఉన్నాడని కూడా నాకు తోచింది.

ఈ విధంగా నేను వెలుపలికి వచ్చేశాను. 'గీతాంజలి' లోని గేయాలు బెంగాలీలో రాసిన తర్వాత ఇంగ్లీషులో నా భావాభివ్యక్తి సామర్థ్యంపైన నాకు నమ్మకం లేనందువల్ల ప్రచురించే ఉద్దేశ్యం ఎంత మాత్రం లేకపోయినా, వాటిని ఇంగ్లీషులోకి అనువదించాను. నేను పడమర దేశాలకు వచ్చినప్పుడు ఆ అనువాదం రాతప్రతి నా వద్ద ఉంది. ఆ రూపంలోనే ఆ గేయాలు బ్రిటిష్ పాఠకుల దృష్టికి వచ్చినప్పుడు అవి వాళ్ళకు నచ్చాయనే విషయం మీకు తెలుసు. ఒక కవిగా వాళ్ళు నన్ను అంగీకరించారు. అచిరకాలంలోనే పాశ్చాత్య ప్రపంచ హృదయ కవాటాలు నా కోసం తెరుచుకున్నాయి.

క్రియాశీలత నుంచి, పాశ్చాత్య ప్రపంచం నుంచి యాభై ఏండ్లుగా దూరంగా ఉంటూ వచ్చిన నన్ను ఇంత త్వరగా తమ కవుల్లో ఒకరుగా పాశ్చాత్య ప్రపంచం స్వీకరించడం ఒక అద్భుతమైన సంఘటనగా జరిగింది. అది నాకు ఆశ్చర్యం కలిగించింది. అయితే తర్వాత బహుశా దీనికి ఒకలోతైన అంతరార్థం ఏదో ఉండి ఉంటుందని నాకు తోచింది. జీవితానికి, పాశ్చాత్య చైతన్యానికి దూరంగా ఏకాంతంలో నేను గడిపిన రోజులు తమతోపాటు ప్రగాఢమైన ప్రశాంతతను, విశ్రాంతిని, చిరంతనా భావాన్ని తీసుకొచ్చాయని, అతి క్రియాశీలమైన జీవితం గుడుపుతూ కూడా తమ హృదయాంతరాల్లో అనంతమైన శాంతి, పిపాస కలిగివున్న పాశ్చాత్య ప్రజలకు కావలసిన భావానుభూతులు ఇవేనని నాకు తోచింది. ఈ భావానుభూతులను అందజేసే విషయంలో నా పాత్ర వెనక ఉన్నది చిన్నతనం నుంచీ గంగ ఒడ్డున ఏకాంతంలో నా కవితా సరస్వతి పొందిన శిక్షణ మాత్రమే అని కూడా నాకు తోచింది. ఆ సంవత్సరాల ప్రశాంతత సమయం వచ్చినప్పుడు నేను దాన్ని వెలికి తెచ్చి పాశ్చాత్య మానవుని ఎదుట నిలిపేందుకు వీలుగా నా ప్రకృతిలో నిక్షిప్తమై ఉండిపోయింది. ఈ విధంగా పాశ్చాత్య మానవునికి నేను అర్పించింది కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరించడం జరిగింది.

ఈ ప్రశంసలను నా వ్యక్తిగతమైన లబ్ధిగా నేను స్వీకరించకూడదని నాకు తెలుసు. నిజానికి నాలోని ప్రాచ్యత పాశ్చాత్యానికి ఇచ్చిన కానుకే ఇది. ఎందుకంటే ప్రాచ్యమే ఆధ్యాత్మిక మానవతకు జన్మనిచ్చింది కాబట్టి. ఆకలి బాధించినప్పుడు, ఆటల్లో గాయపడినప్పుడు శాంత స్వరూపిణి ఆ తల్లి వైపు – ప్రాచ్యం వైపు – పాశ్చాత్య సంతానాలు చూడవా? ఆకలిగొన్నప్పుడు ఆ తల్లి అన్నం పెట్టి ఆకలి తీరుస్తుందని, అలిసిపోయినప్పుడు రాత్రుల్లో నిద్రపుచ్చి సేద తీరుస్తుందని వాళ్ళు ఆశించరా?

నా అదృష్టం కొద్దీ పాశ్చాత్య ప్రపంచం మరోసారి ప్రాచ్యాభిముఖంగా ఉన్నప్పుడు, అటునుంచి అది కొంత పోషణను కోరుకుంటున్నప్పుడు నేను ఇక్కడికి రావడం

జరిగింది. ప్రాచ్యానికి నేను ప్రతినిధిని కాబట్టి నా పాశ్చాత్య మిత్రుల నుంచి నాకు ప్రతిఫలం కూడా లభించింది.

ఇక మీరు నాకిచ్చిన పురస్కారం నా కోసమే ఖర్చయి వృథా కాలేదని కూడా మీకు నమ్మకంగా చెప్పగలను. ఒక వ్యక్తిగా ఈ పురస్కారాన్ని స్వీకరించే హక్కు నాకు లేదు గనక దాన్ని ఇతరుల కోసమే వినియోగించాను. అయితే అది ఒక విత్తనం లాంటిది. భూమిలో నాటినప్పుడు దాన్ని నాటిన వారి హితం కోసం మళ్ళీ పైకి వచ్చి సత్ఫలాలనందించే విత్తనం లాంటిది. మీ నుంచి అందిన డబ్బును నే నీ మధ్య ఆరంభించిన విశ్వవిద్యాలయాన్ని స్థాపించడానికి, దాన్ని నడపడానికి ఉపయోగించాను. ఈ విశ్వవిద్యాలయం పాశ్చాత్య విద్యార్థులు కూడా వచ్చి తమ ప్రాచ్య సోదరులతో కలుసుకునే కేంద్రంగా ఉంటుందని, నృత్యాన్ని అన్వేషించడానికి, అనేక శతాబ్దాలుగా ప్రాచ్యంలో దాగి ఉన్న అమూల్య జ్ఞాననిధులను కనుగొనేందుకు వాళ్ళంతా కలిసి కృషి చేసినప్పుడు సమస్త మానవాళికి అవసరమైన ప్రాచ్య ఆధ్యాత్మిక సాధన సంపత్తిని వారు అవగాహన చేసుకుంటారని నేను ఆశించాను.

వైభవోపేతమైన నాగరకత పరిఢవిల్లిన దశలో భారత దేశంలో విలసిల్లిన గొప్ప విశ్వవిద్యాలయాలను మీరు గుర్తు చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఒకదీపం వెలిగించినప్పుడు దాని వెలుతురును చిన్న పరిధికే పరిమితం చేసి ఉంచలేము. అది ఎల్లెడలా వెలుగును ప్రసరింపజేస్తుంది. భారతదేశ నాగరకతలో వివేకం, విజ్ఞానం, సమస్త వైభవాలు ఉండేవి. వాటిని అది తన వారికి మాత్రమే వినియోగించగలిగేది కాదు. అది అన్ని జాతులవారికోసం తన తలుపులు తెరిచి ఉంచింది. చైనా, జపాన్, పర్షియా, ఇలా ఎన్నో జాతుల వాళ్ళు వచ్చారు. భారతదేశంలోని సర్వోత్తమ జ్ఞానసంపదను స్వీకరించే అవకాశం పొందారు. భారతదేశం విశ్వమానవతకు ఇవ్వగలిగిన సర్వశ్రేష్ఠమైన కానుక ఇదే. దాన్ని నా దేశం అతి ఉదారంగా ఇచ్చింది కూడా. ఇచ్చిన విద్యకు ప్రతిఫలంగా విద్యార్థుల నుంచి ద్రవ్యరూపంలో రుసుము తీసుకోవడం మా దేశ సంప్రదాయంలో ఎన్నడూ లేదనే విషయం మీకు తెలుసు. ఎందుచేతనంటే, ఎవరి వద్ద అయితే విద్య ఉందో, వారికి ఆ విద్యను ఇతరులకు అందించే బాధ్యత కూడా ఉందని మేము భావిస్తాం. విద్యార్థులే వచ్చి విద్య నేర్పమని గురువును అడగాలనే నియమం కూడా మాకు లేదు. గురువు సైతం తానివ్వగలిగిన ఉత్తమోత్తమమైన కానుకను అవసరం ఉన్న వారందరికి అందజేయడం ద్వారా తన జీవితోద్దేశ్యాన్ని నెరవేర్చుకోవలసి ఉంటుందని కూడా మేము నమ్ముతాము. ఆత్మాభివ్యక్తి యొక్క ఈ అవసరమే, సంగ్రహించి ప్రోగు చేసిన దాన్ని ఇతరులకు పంచి పెట్టాలనే ధర్మ భావనే భారతదేశంలో పలుచోట్ల ఈ విశ్వవిద్యాలయాలు స్థాపించడానికి కారణమైంది, ఆ పనిని సుసాధ్యం చేసింది.

వర్తమానంలో మేము ఎదుర్కొంటున్న ఆపద ఒకటే. ఇప్పుడు మేము అజ్ఞాతంలోకి, ఒంటరితనంలోకి వెళ్ళిపోయి ఉండడం, ఏకాకి జీవితం గడుపుతూ ఉండడం, మానవ జాతికి ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కోల్పోయి ఉండడం, మా వద్ద ఏవేవైతే సర్వశ్రేష్ఠమైనవి ఉన్నాయో, వాటిలో పాలు పంచుకొమ్మని ప్రపంచాన్ని ఆహ్వానించలేని స్థితిలో ఉండడం. ఇది మా దురదృష్టం. ప్రాచ్య ప్రజలపై, ప్రాచ్య సంస్కృతి పైన భౌతికమైన ఆధిక్యత కలిగిన పాశ్చాత్య జాతులతో సంపర్కం కలిగినప్పుడు ఒక శతాబ్దం పాటు మా నాగరకత పైన మాకు నమ్మకం లేకుండా పోయింది. ఇక విద్యా సంస్థల్లో మా సభ్యతా, సంస్కృతులకు ఏ మాత్రం చోటు కల్పించడం జరగలేదు. ఇలా ఒక శతాబ్దందాకా మా విద్యార్థులు గతకాలపు తమ సభ్యత విలువ గురించీ ఏమీ తెలుసుకోకుండానే ఉండిపోయారు. ఈ విధంగా మేము మా వారసత్వంలో ఉన్న నిధులను మరిచి పోవడమే కాక మానవ నాగరకతా వికాసం కోసం మా వంతు పాత్ర నిర్వహించే అవకాశాన్ని కూడా పోగొట్టుకున్నాం. మాకున్న దాన్ని ఇచ్చే అవకాశం పోగొట్టుకోవడమే గాక వేరే వాళ్ళ వద్ద నుంచి ముష్టెత్తుకునే పరిస్థితి వచ్చింది. సభ్యతను అరువు తెచ్చుకోవడమే గాక ఎల్లప్పుడూ విద్య నభ్యసిస్తూనే ఉండే స్కూలు విద్యార్థుల్లా అయిపోయాం.

అయితే అలాంటి మా అవకాశాలను వృథా చేసుకోకుండా ఉండే సమయం ఇప్పుడు వచ్చింది. మాలో ఏదైతే ఉందో దాన్ని వెలికి తీయడానికి, ఒక శతాబ్దం నుంచి మరో శతాబ్దానికి, ఒక దేశం నుంచి మరో దేశానికి పయనించి ఇతరుల ముందు మా దారిద్ర్యాన్ని ప్రదర్శించకుండా ఉండడానికి, ఇక శక్తి వంచన లేకుండా ప్రయత్నించాలి. మేము దేన్ని గురించి గర్వపడాలో, మా పూర్వీకుల నుంచి వారసత్వంగా మేమేది పొందామో మాకు తెలుసు. ఇతరులకు ఏదైనా ఇచ్చే అవకాశాన్ని పోగొట్టుకోకూడదు – మా

దేశవాసుల శ్రేయస్సు దృష్ట్యానే కాదు, సమస్త మానవాళి శ్రేయస్సు దృష్ట్యా కూడా. ఈ కారణం చేతనే, ఈ ప్రేరణతోనే ప్రాచ్య పాశ్చాత్య విద్యార్థులు కలిసి, ఆధ్యాత్మిక వంటకాల విందు ఆరగించి ఆనందించే కూడలిగా ఒక అంతర్జాతీయ విద్యా సంస్థను నెలకొల్పే సంకల్పం నాకు కలిగింది.

మీరు నాకు ఈ పురస్కారం ఇవ్వడం నా మనసులో ఉండిన ఈ గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి కొంతవరకు సహాయపడిందని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఇది నేను మరోసారి బయట పడి పశ్చిమ దేశాలకు వచ్చేట్లు చేసింది. అందుకే మిమ్మల్నందరిని సుదూర ప్రాచ్యంలో మీ కోసం ఎదురుచూస్తున్న విందును ఆరగించడానికి రమ్మని ఆహ్వానించడానికి ఇక్కడికి వచ్చాను. నా ఆహ్వానాన్ని మీరు మన్నిస్తారనే నా నమ్మకం. నేను యూరప్‌లోని అనేక దేశాలను సందర్శించాను. అక్కడివారి ఉత్సాహభరితమైన ఆహ్వానం అందుకున్నాను. ఈ ఆహ్వానానికి ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది. ఆ అర్థం ఏమిటంటే, పాశ్చాత్యానికి ప్రాచ్యం యొక్క అవసరం ఉంది. ప్రాచ్యానికి పాశ్చాత్యం యొక్క అవసరం ఉంది అని. అందువల్ల ఈ రెండు కలుసుకోవలసిన అవసరం ఇప్పుడు వచ్చింది.

ఈ గొప్ప కాలానికి, ఈ గొప్ప యుగానికి చెందినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. తూర్పు, పడమర పరస్పరం దగ్గరవుతున్న ఈ గొప్ప యుగానికి అభివ్యక్తినివ్వడానికి కొంత కృషి చేసినందుకు కూడా నాకు సంతోషంగా ఉంది. ఈ రెండూ ఒకదాని వైపు మరొకటి అడుగులు వేస్తున్నాయి. ఒకదాన్ని ఒకటి కలుసుకోవడానికి ముందుకు సాగుతున్నాయి. పరస్పరం కలుసుకొని ఒక సరికొత్త సభ్యతను, గొప్ప సంస్కృతిని భవిష్యత్తులో నిర్మించేందుకు ఒకదాన్నుంచి మరొకటి ఆహ్వానం పొందాయి.

నా రచనల ద్వారా అలాంటి ఒక ఆలోచన మీకు తప్పక చేరి ఉంటుందని నేను నమ్ముతున్నాను. అనువాదం కావడం మూలాన కొంత అస్పష్టత ఉండినా, ప్రాచ్య – పాశ్చాత్యాలు రెండింటికి సంబంధించిన ఒక ఆలోచన తూర్పు నుండి బయలుదేరి పడమరకు చేరి అక్కడ స్వాగతించబడి, విశ్రాంతి పొంది ఒక స్థావరాన్ని సంపాదించుకోగలిగింది. అక్కడి స్వీకృతిని పొందగలిగింది. నా రచన ద్వారా ఇలాంటి యుగావసరాల గొంతును సరిగా వినిపించ గలిగిన అదృష్టమే నాకు కలిగి ఉంటే, నాకీ గొప్ప అవకాశం ఇచ్చినందుకు నేను ఎంతో కృతజ్ఞుణ్ణి. స్వీడన్ నుంచి వచ్చిన గుర్తింపు నన్ను, నా రచనలను పాశ్చాత్య ప్రజల ముందుకు తీసుకొని వచ్చింది. అయితే యీ గుర్తింపు నన్ను, కొంత ఇబ్బంది పెట్టిందనే విషయం కూడా సత్యమే. అది నాకు అలవాటైన ఏకాంతాన్ని భంగపరిచింది. నన్ను బయటికి తెచ్చి నాకు ఏనాడూ పరిచయం లేని అసంఖ్యాక జన సమూహం ముందు నన్ను నిలబెట్టింది. ఈ పరిస్థితితో నేను సర్దుబాటు చేసుకోవడం ఇంతవరకు జరగలేదు. పాశ్చాత్య దేశాల్లో విశాల జనసమూహం ముందు నిలుచున్నప్పుడు నా గుండె దిగజారిపోతున్నట్లనిపిస్తుంది. అభినందనల, ప్రశంసల రూపంలో మీరు నాకందించిన కానుకకు నేనింకా అలవాటు పడలేదు. మీ ముందు నిలబడడానికి నాకు జంకు, బిడియం కలుగుతాయి. ఇప్పుడు కూడా కలుగుతున్నాయి. అయితే నేను చెప్పేది ఒకటే – ఇలాంటి గొప్ప అవకాశం కల్పించినందుకు, ప్రాచ్య – పాశ్చాత్య హృదయాలను పరస్పరం దగ్గరకు తీసుకురావడానికి, వాటిని ఐక్యం చేయడానికి నేనొక మాధ్యమంగా ఉండగలిగినందుకు భగవంతునికి నేను కృతజ్ఞుణ్ణి. జీవితాంతం నేనీ సేవా వ్రతాన్ని కొనసాగించాలి. నేను చేయగలిగినంతా చేయాలి. ప్రాచ్య – పాశ్చాత్య దేశాల మధ్య ఉన్న నిరసనభావం ఉపశమించాలి. ఇందుకు నేను ఏదో ఒకటి చేయాలి అనే ఏకైక లక్ష్యంతో నేనీ విద్యాసంస్థను స్థాపించాను.

దేన్నీ తిరస్కరించడం, ఏ జాతిని, ఏ సంస్కృతిని తోసిపుచ్చడం భారతీయ తత్త్వంలో లేదని నేను భావిస్తాను. భారతీయతత్త్వం ఎల్లప్పుడు సమైక్యతా దర్శనాన్నే ప్రదర్శించింది. ఈ సమైక్యతాదర్శం దేన్నీ తిరస్కరించదు. ఏ జాతిని, సంస్కృతిని నిరాకరించదు. అది అన్నింటిని అవగాహన చేసుకుంటుంది. అన్ని పదార్థాల్లో ఒకే ఆత్మను చూడడం, అన్ని పదార్థాలను యథాతథంగా అర్థం చేసుకోవడం మా ఆధ్యాత్మిక సాధనకు చివరి లక్ష్యంగా ఉంటూ వచ్చింది. ఇదే భారతీయ తత్త్వం. ఇప్పుడు రాజకీయ అలజడుల కారణంగా ఈ గొప్ప భారత దేశానికి చెందిన ప్రజలు పాశ్చాత్యాన్ని తిరస్కరించాలని నినాదాలు చేస్తుంటే చూసి నాకు బాధ కలుగుతుంది. అది వాళ్ళు పాశ్చాత్య భూభాగం నుంచి నేర్చుకున్న పాఠమేనేమోనని నాకు తోస్తుంది. నిజానికి ఇది మా లక్ష్యం కాదు. భారతదేశం ఉన్నది అన్ని జాతులను ఐక్యం చేయడం కోసమే.

పై కారణాల వల్లనే భారతదేశంలో జాతుల సమైక్యత ఇప్పుడు కొరవడింది. సమస్త మానవతకున్న జాతి భేదాల సమస్య మాకూ ఉంది. భారతదేశంలో ద్రావిడులున్నారు, మహమ్మదీయులున్నారు, హిందువులున్నారు. అనేక తెగలకు, శాఖలకు, సముదాయాలకు చెందిన ప్రజలున్నారు. అందువల్ల రాజకీయ సమైక్యతకు సంబంధించిన ఏ పై పై బంధం మమ్ములను సంతృప్తి పరచదు. మాకు వాస్తవమైందిగానూ కనిపించదు. మేము మరింత లోతుల్లోకి వెళ్ళాలి. విభిన్న జాతుల్లో ఉండే అతిప్రధానమైన ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని వెలికి తీయాలి. మేము మానవ చైతన్యంలో మరింత లోతుల్లోకి ప్రవేశించి సమస్త మానవజాతుల్లో ఉండే గొప్ప సమైక్యతా బంధాన్ని ఆవిష్కరించాలి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చడానికి తగిన వనరులు మాకున్నాయి. సమైక్యతా ధర్మాన్ని, సహానుభూతి ధర్మాన్ని ఉద్ఘోషించిన గొప్ప ప్రాచీన మనీషుల రచనలు వారసత్వంలో మేము పొందాం. అవి యిలా ఉద్ఘోషించాయి. "అన్ని ప్రాణులను తన లాగే భావించేవాడే అన్ని ప్రాణులు తానే అని గ్రహించగలిగిన వాడే సత్యాన్ని చూడగలుగుతాడు." ఈ సత్యాన్ని ప్రాచ్య సంతతులే కాదు. పాశ్చాత్య సంతతులు కూడా మరో సారి విస్పష్టంగా గ్రహించవలసిన అవసరం ఉంది. ఈ శాశ్వత సత్యాలను వాళ్ళకు కూడా గుర్తు చేయాలి. మనిషి ఇతర మనుషులతో, ఇతర జాతులతో పోట్లాడకూడదు. అతని సాధనంతా సామరస్యాన్ని, శాంతిని నెలకొల్పే దిశగా, ప్రేమను, సుహృద్భావాన్ని బలపరచే దిశగా సాగాలి. మనం పోట్లాడే జంతువుల్లాంటి వాళ్ళం కాదు. అహంభావం మన జీవితాల పైన ఆధిపత్యం వహించి ఉంది. ఈ అహంభావమే కష్టాలు తెచ్చి పెడుతూంది. ఒంటరితనాన్ని సృష్టిస్తూంది. ఈర్ష్యా – ద్వేషాలకు, వాణిజ్య సంబంధమైన పోటీ తత్వానికి దారి తీస్తూంది. మనం ఆ ఆరాధనా మందిరంలోకి వెళ్ళగలిగితే, సమస్త జాతుల ఐక్యతను, ప్రేమను సాధించ గలిగితే ఈ భ్రాంతులన్నీ తొలగిపోతాయి.

భారతదేశానికున్న ఈ గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చేందుకు నేనీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాను. అవకాశం వచ్చింది కాబట్టి ఇప్పుడు నేను మిమ్ములను అక్కడికి రమ్మని, వచ్చి మాతో కలిసి పని చేయమని ఆహ్వానిస్తున్నాను. ఈ సంస్థను కేవలం మాకే వదలివేసి ఉండిపోకండి. మీ విద్యార్థులను, మీ పండితులను మా వద్దకు పంపి ఈ విశ్వవిద్యాలయాన్ని తూర్పు, పడమరల ఉమ్మడి సంస్థగా రూపొందించడంలో మాకు సహాయపడమని అర్థిస్తున్నాను. అక్కడికి చేరినవారు తమ జీవితంలో ఏదైతే ఇవ్వగలరో అది యిత్తురుగాక! మనమందరం సమిష్టిగా కృషిచేసి దీన్ని అఖండ విశ్వ మానవతకు ప్రతీక అయిన ఒక సజీవ సంస్థగా రూపొందించ గలుగుదుము గాక! ఈ ప్రయోజనం కోసమే నేను మీ వద్దకు వచ్చాను. మిమ్ములను కోరుతున్నాను. సమస్త మానవకోటి సమైక్యత కోసం, వారి పరస్పర ప్రేమ కోసం, పరమేశ్వరుని కోసం మీనుంచి ఇలాంటి సహకారం పొందే హక్కు నాకుందని కూడా భావిస్తూ అక్కడికి రమ్మని మిమ్ములను కోరుతున్నాను, ఆహ్వానిస్తున్నాను. మి

## వాడుక భాష


**"1912**వ సంవత్సరం, డిసెంబరు నెల, రెండవ తేదీని కలకత్తాలో రవీంద్రుణ్ణి చూచాను. గేయ కవిత్వంలో బెంగాల్ ముందంజ వేసింది. రవీంద్రుడు వాడే భాష వ్యవహారికమే. అంటే అందరూ మాట్లాడుకునే భాష. ప్రామాణిక గ్రంథ ప్రయోగాలకు విరుద్ధమైన భాష, వ్యాకరణ సూత్రాలు కాదంటూ, ఈ రకమైన బెంగాలీ భాషను ప్రయోగిస్తాడని ఆయనను పండితులు నిందిస్తారు.

'తెడకారి తెచ్చె' అనే పద ప్రయోగం మీద రవీంద్రునికీ, నాకూ సంభాషణ జరిగింది. ఆయన కొద్దిసేపాలోచించి, పూర్వ కవుల ప్రయోగాలలో వుందని చెప్పారు. 'తె' అనేది జానపదుల భాషలో కనిపిస్తుందని నేను సూచించాను.


ఆంగ్లసారస్వత బోధనా పద్ధతులు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని వారి అభిప్రాయం. ఆంగ్ల సాహిత్యంపై హెన్రీ – మోర్లే ఇచ్చిన ఉపన్యాసాలను, రవీంద్రుడు ఎంతో ఆహ్లాదంగా విన్నారు. విద్యార్థులకు పరీక్షలు చాలా ఆవశ్యకాలని వారి అభిప్రాయం.

సిస్టర్ నివేదిత ఆయన కథలను కొన్నింటిని అనువదించింది. కాని ఆమె చనిపోయిన తరువాత ఆ వ్రాత ప్రతులు కనిపించలేదు. 'మైకేల్'ను రవీంద్రుడు అనుసరించారు. ఆయన గీతంలోని పాదం ఏ పాదానికాపాదం అంతంకావు. ప్రయోగాలనూ, వ్యాకరణ నియమాలనూ, కాలదన్ని సరికొత్తవి శబ్ద రూపాలను కల్పించినా, ఆయన సృష్టించిన 'శబ్దాలు' చలామణిలోకి రాలేదు. అందుచేత మన వెనకాల ఒక టిప్పణి వుంటే కాని, కావ్యం అర్థం కాదు. ఈ విషయాన్ని నేను రవీంద్రునికి సూచించాను.

**– గురజాడ అప్పారావు**



## ఐన్‌స్టీన్ - రవీంద్రుల సంభాషణ
# సత్యం శివం సుందరం



*- హిందీసేత: గోవింద గుంజన్*

జర్మన్ యూదు కుటుంబంలో జన్మించిన ఐన్‌స్టీన్ విజ్ఞానం, సాహిత్యం, సంగీతం, ఆధ్యాత్మికత మరియు కళల మర్మజ్ఞుడు. అందుకే జర్మనీలో 14 జూలై 1930న రవీంద్రనాథ్ టాగూర్ ఐన్‌స్టీన్ కలిసి చర్చించాడు. ఆ రోజు 'సత్యము యొక్క స్వభావము' గూర్చి ఒక అద్భుత సంభాషణ ఇదిగో ఇలా నడిచింది :

**ఐన్‌స్టీన్ :** ఈశ్వరత్వం (దేవుడి) యొక్క ప్రపంచం నుంచి వేరుగా ఏదైనా శక్తి వునికి మీరు అంగీకరిస్తారా?

**టాగూర్ :** వేరుగా లేదు. మానవ అనంత వ్యక్తిత్వాల్లో విశ్వం కలసి ఉంది. మానవ వ్యక్తిత్వపు నియమాలకు బయట ఎలాంటి వస్తువు ఉండదు. విశ్వం యొక్క సత్యమే మానవ సత్యం. దీనిని నేను అర్థం చేసుకోవడానికి ఒక వైజ్ఞానిక యథార్థాన్ని స్వీకరించాను. పదార్థము ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లతో నిర్మింపబడింది. వీటి మధ్య ఒక 'గ్యాప్' ఉంటుంది. అయితే పదార్థములో ఒక్కొక్క ఎలక్ట్రాన్, ప్రోటాన్లను కలిపే ఈ చిన్న దూరానికి బదులు గట్టిగా, ధృఢంగా ఖాళీ కన్పిస్తుంది. ఇలా మానవీయత చిన్న-చిన్న వ్యక్తి యూనిట్లుగా ఉంటాయి. కాని వాటి సమీప మానవీయ సంబంధాల మధ్య ఒక అంతర సంబంధం కూడ ఉంటుంది. అది మానవీయ సంస్కారాన్ని ఒక ప్రాణంతో కూడిన ఏకత్వాన్ని ప్రసాదిస్తుంది. ఒక్కొక్క ఎలక్ట్రాన్, ప్రోటాన్ వేరుగా శక్తి వునికి ఉన్నప్పటికీ సమీపంలో కలిసి ఉన్నట్టుగా మనం అందరం సమీపంలో కలిసి ఉన్నా, ఈ సత్యాన్ని నేను కళ ద్వారా, సత్యాన్వేషణ ద్వారా మరియు ధార్మిక చైతన్యం ద్వారా అన్వేషిస్తూ ఉంటాను.

**ఐన్‌స్టీన్ :** విశ్వమూ, ప్రకృతి గూర్చి రెండు వేరు-వేరు అభిప్రాయాలున్నాయి. ఒకటి-విశ్వపు ఏకత్వం మానవీయతపై ఆధారపడి ఉండడం. రెండోది విశ్వం మానవత్వపు 'factor' కి అతీతంగా ఉంటుంది. దానిపై అది ఆధారపడి ఉండదు.

**టాగూర్:** విశ్వం మనిషితో లయబద్ధం అవుతున్నప్పుడు ఈశ్వరత్వాన్ని (దైవత్వాన్ని) సత్యంలా తెలుసుకొంటాం. అది మనకు సౌందర్యం రూపంలో అనుభూతమవుతుంది.

**ఐన్‌స్టీన్:** ఇది కేవలం విశ్వాన్ని గురించి మనిషి చేసే భావన.

**టాగూర్:** రెండో భావన కావడానికి కూడ వీలులేదు. ఈ ప్రపంచం మానవీయ ప్రపంచం. దీని వైజ్ఞానిక భావన మనిషి యొక్క భావన. ఎందుకంటే మన నుంచి వేరుగా ప్రపంచం యొక్క ఏ అస్తిత్వం లేదు. ఇదొక సాపేక్ష ప్రపంచం. తన సత్యం కోసం మన చైతన్యంపై ఆధారపడి ఉంటుంది. తర్కానికి, ఆనందానికి ఒక కొలబద్ధ ఉంటుంది. అది ప్రపంచానికి దాని సత్యాన్ని ప్రదానం చేస్తుంది. ఈ కొలబద్ధ ఆ విశ్వపురుషుడి అనుభవం. అది అనుభవాల్లోను కన్పిస్తుంది.

**ఐన్‌స్టీన్ :** ఇది మానవీయ అస్తిత్వమా? లేక దాని వాస్తవిక అస్తిత్వం యొక్క ప్రత్యక్షీకరణమా?

**టాగూర్:** అవును, ఇది ఒక దివ్యమైన యథార్థం. దీనిని మనం మన భావనలు మరియు చేష్టల ద్వార విశ్వ పురుషుడి ప్రత్యక్షీకరణాన్ని పొందుతాం, దానికి వ్యక్తిగత హద్దులుండవు. ఇది వైయక్తికం కాని లోతైన అవసరం. మన వ్యక్తిగత సత్య చైతన్యము సార్వభౌమిక గొప్పతనాన్ని పొందుతుంది. ధర్మం మన సత్యాన్ని విలువైనదిగా చేస్తుంది. లేకుంటే వాటికి విలువ లేదు. మనము సత్యాన్ని అనుషంగికత్వం వలన బాగా తెలుసుకోగలము.

**ఐన్‌స్టీన్:** సత్యం మరియు దాని సౌందర్యం మనిషికి అతీతంగా ఏదైనా స్వాధీనము లేక అనాశ్రిత అస్తిత్వము లేదా?

**టాగూర్:** లేదు.

**ఐన్‌స్టీన్:** మనిషి యొక్క అస్తిత్వం లేనట్లయితే ఈ దేదీప్యమాన సూర్యుడు సుందరంగా ఉండడా?

**టాగూర్:** ఉండదు.

తెలుగుసేత: పి. మస్తాన్, శ్రీ విద్యానికేతన్, చిత్తూరుజిల్లా.

**ఐన్‌స్టీన్:** నేను దీనిని సౌందర్య దృష్టితో నిజమని అంగీకరిస్తాను, కాని సత్యం యొక్క విషయంలో మాత్రం కాదు.

**టాగూర్:** ఎందుకు? సత్యము యొక్క ప్రత్యక్షీకరణము మనిషి ద్వారానే జరుగుతుంది.

**ఐన్‌స్టీన్:** నేను నిజమని అనుకొంటున్న దానిని నిరూపించలేను. ఇది నా అభిప్రాయం.

**టాగూర్:** సౌందర్యం కేవలం ఒక పూర్ణమైన సమ లయబద్ధతలో లభిస్తుంది. కేవలం సార్వభౌమిక మనసు యొక్క పూర్ణమైన జ్ఞానబుద్ధి. మనం, ప్రజలు రకరకాలుగా తమ తప్పులు–మహా తప్పులు ద్వారా సత్యం వరకు చేరుకోగలం, అది కూడాను మనం పొందిన అనుభవాల ద్వారా, మన జ్యోతిర్మయ చైతన్యం ద్వారా లేకుంటే అది మనకు ఎలా తెలుస్తుంది.

**ఐన్‌స్టీన్:** నేను దీనిని నిరూపించలేను – ఎందుకంటే వైజ్ఞానిక సత్యము ఇలాంటి ఒక సత్యరూపంలో వ్యక్తీకరింపబడాలి, పూర్తిగా మనిషికి అతీతంగా మరియు తనలోతాను అనాశ్రితం లేక స్వతంత్రం కావాలి, ఇందులోనే నేను ధృఢంగా విశ్వసిస్తున్నాను. ఉదాహరణగా నేను ఇలా స్వీకరిస్తాను – పైథాగరస్ యొక్క జ్యామితి సిద్ధాంతం ఏదైతే వివరిస్తుందో ఆ సత్యము రమారమి మనిషి అస్తిత్వంపై ఆధారపడి లేదు. ఇలాగే ఈ వాస్తవికత యొక్క తన సత్యం ఉంది. ఇందులో ఒకదాని తిరస్కారం ఇంకొక దాని అస్తిత్వాన్ని వ్యతిరేకిస్తుంది.

**టాగూర్:** సత్యం సార్వభౌమిక చైతన్యముచే ఏకాకారమై ఉంది. అది అనివార్య రూపంచే మానవీయం కాకతప్పదు. లేకుంటే మనకు వ్యక్తిగతంగా ఏదైతే తెలుస్తున్నదో లేక అనుభవిస్తున్నామో అది సత్యంగా పిలువబడదు. కనీసం ఒక వైజ్ఞానిక సత్యాన్ని తర్కం ద్వారా మాత్రమే అన్వేషించగలం, కాని అదికూడాను మనిషి ద్వారానే ప్రాప్తిస్తుంది. హిందూతత్వం ప్రకారం బ్రహ్మ పరమ సత్యం, దానిని ఎవరైనా, ఎప్పటికి వేరై పొందలేరు, దానిని మాటల్లో వ్యక్తం చేయలేరు. దానిని తన వ్యక్తిత్వంలో దాని అనంతత్త్వంలో కలిపేయగలిగినపుడు మాత్రమే పొందగలరు. అయితే ఇలాంటి సత్యానికి విజ్ఞానంతో ఎలాంటి సంబంధం లేకపోవచ్చు. మనం ఏ 'సత్యం యొక్క స్వభావము' గూర్చి చర్చిస్తున్నామో అది దాని ప్రకటీకరణ యొక్క చర్చ, అంటే ఏదైతే ప్రత్యక్షం కాగలదో అదే మానవ మనసుకు సత్యం. కాబట్టి మనిషిని మాయా రూపం అని అంటారు.

**ఐన్‌స్టీన్:** అయితే, మీ అభిప్రాయం ప్రకారం హిందూ భావనలోని మిథ్యాత్వపు అనుభవం వ్యక్తి విశేషము కాదు, సంపూర్ణ మానవతా అనుభవమా?

**టాగూర్:** మనం విజ్ఞానంలో సత్యానికి సమీపంగా చేరడానికి ఒక క్రమశిక్షణతో ప్రయాణిస్తాం, అందులో మనకు మన వ్యక్తిగత మస్తిష్క హద్దుల్ని తొలగిస్తేనే ప్రవేశం లభిస్తుంది. ఇలా మనం సత్యం యొక్క సారాన్ని పొందుతాం. అది సార్వభౌమిక మనిషి యొక్క సత్యము అవుతుంది.

**ఐన్‌స్టీన్:** ఇది మన ప్రాథమిక సమస్య, సత్యము మన చైతన్యముపై ఆధారపడి ఉందా?

**టాగూర్:** దేనినైతే మనం సత్యం అంటున్నామో అది వస్తుగతం మరియు ఆత్మగతాల మధ్య ఒక బౌద్ధిక సామరస్యము. ఈ రెండు పక్షాలే ఆ 'సూపర్ పర్సనల్' మనిషితో సంబంధపడినవి.

**ఐన్‌స్టీన్:** మానవీయతకి అతీతంగా ఉన్న సత్యపు అస్తిత్వాన్ని అర్థం చేయించలేము, నిరూపించనూ లేము. అయితే ఇది ఒక విశ్వాసం. దీని నుంచి ఏది రహితం కాదు. చివరికి అతి చిన్న జీవి కూడాను. మనం సత్యాన్ని ఒక 'సూపర్ హ్యూమన్'ని వస్తుగతంగా ప్రదానం చేస్తున్నాం. మనకు ఇది అనివార్యం. ఈ సత్యాలు, మన అస్తిత్వం మన అనుభవాలు మన బుద్ధిపై ఆధారపడి లేవు. దీని అర్థం ఏంటో మనం చెప్పలేకపోయినను.

**టాగూర్:** విజ్ఞానం ఇలా నిరూపించింది: టేబిల్ ఒక ఘనమైన వస్తువులా కన్పిస్తుంది. అది ఒక దృష్టికి గోచరమయ్యేది. దానిని మానవీయ మనసు ఒక టేబిల్‌లా అనుభూత మౌతుంది, దానిని అనుభూతమయ్యే మనసే లేకపోతే, దానికి ఏ అస్తిత్వం ఉండదు. దీనితోపాటు మనం ఇలా కూడా స్వీకరించాలి: టేబిల్ యొక్క పరమ భౌతిక సత్యం. వేరు–వేరుగా తిరిగే విద్యుతీయ బల కేంద్రాల సముహం. దీనికి మానవీయ చైతన్యంతో కూడా సంబంధం ఉంది. సత్యపు సాక్షాత్కారంలో విశ్వపురుషుడి మనసు, వ్యక్తి స్థాయిలో ఓ అలౌకిక సంఘర్షణ ఉంటుంది. మళ్ళీ కలిసే ఒక సనాతన ప్రక్రియ విజ్ఞానం, తత్వశాస్త్రం, ఇంకా మన నీతి శాస్త్రాల్లో నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఏ విషయంలోనైనా ఏదైనా సత్యము మానవీయతతో సంబంధపడి లేనట్లయితే అది మనకోసం ఎలాంటి అస్తిత్వం లేనట్లే.

**ఐన్‌స్టీన్:** అయితే నేను మీకంటే గొప్ప ధార్మికుణ్ణి.

**టాగూర్:** నా మతం ఆ బ్రహ్మాండ పురుషుడి చైతన్యముతో పాటు, నాది–తనది అయి నిరంతరం కలిసే ప్రక్రియలో ఉంది. నా హీబర్ట్ వ్యాఖ్యాన విషయం కూడానూ ఇదే. దానిని నేను 'ధార్మిక మనిషి' అన్నాను. మి



# ద్రావిడ నాగరకతా విస్తరణ

*- బి.యస్.ఎల్. హనుమంతరావు*

(గతసంచిక తరువాయి)

## మత సంప్రదాయములు

ఒక జాతి నాగరకతా సంస్కృతులకు దర్పణము వంటిది మతము. ముఖ్యముగా ఆదిమ జాతుల జీవిత విధానములను వారి మధ్యగల పరస్పర సంబంధం గ్రహించడానికి, నిరూపించడానికి భాష తరువాత తోడ్పడ గలిగినవని మత సంప్రదాయములే.

***మాతృదేవతారాధన:*** ద్రావిడ జాతులలో మాతృదేవతారాధన ప్రాథమికమైన ఆచారము. ప్రాచీన ఈజిప్టులో ఈ ఆచారముంది. సింధు ప్రజల ప్రధాన దైవము 'అమ్మతల్లి' సర్వసృష్టికి కారణభూతురాలని సమస్త సృష్టి ఆమెలో నుండే ఉద్భవించిందని భావించి ఆమెను ఆరాధించేవారు. అమ్మతల్లియే నేడు దక్షిణ భారతంలో గ్రామదేవతగా ప్రత్యక్షమౌతున్నది. ఈమె ఆలయంలో శూద్రులే పూజారులుగా ఉండడం ఒక విశేషము. ద్రావిడమై అమ్మతల్లి భావమే పౌరాణిక మతమున త్రిమూర్తులకు సయితము మూలమైన పరాశక్తిలేక 'దేవిగా' ప్రవేశించిన దనడానికి సశయింపనక్కర లేదు.

***లింగారాధన :*** లింగారాధన అనేక ప్రాచీన ద్రావిడ జాతులలో ఉన్నది. క్రీటులో శృంగాలంకృతమైన పూజాపీఠంలో (పానవట్టము) ప్రతిష్ఠాపితమైన శిలాస్తంభము ఆరాధించెడివారు, అతనిపేరు 'కందు' ఈ స్తంభ పూజా సంప్రదాయాలను అనుబంధముగనే అశోకుడు బౌద్ధ క్షేత్రాలలో శిలా స్తంభాలను ప్రతిష్ఠించినాడు. కొన్ని స్తంభాలు అతడు నిల్పినవికావు. జనాదరణ పొందిన మత క్షేత్రాలలో నాటికే ఉన్న స్తంభాలు అతడు నిల్పినవికావు. జనాదరణ పొందిన మత క్షేత్రాలలో నాటికే ఉన్న స్తంభాలమీద తన శాసనాలు వ్రాయించాడు. నేటికి మత సాంఘిక పుణ్యకార్యాల సందర్భంలో స్తంభ ప్రతిష్ఠ చేసే ఆచారాన్ని పాటిస్తున్నాము, దక్షిణ దేశంలో అనేక తటాకాలలో స్తంభాలు కనిపిస్తాయి. ఈ స్తంభ పూజ లింగారాధనకు మరొక రూపమే! ఆదిమ జాతులలోని మదనోత్సవాలకు (Fertlity cults) లింగారాధనకు సంబంధమున్నదని చెప్పవచ్చును. లింగారాధకులనే వైదికార్యులు 'శశ్నదేవు'లని నిందించినారు.

***యోగవిద్య:*** లింగారాధన భారతదేశంలో శివునితో ముడిపడిపోయినది. సింధు శిథిలాలలో పశుపతియైన దేవుని ప్రతిమలున్న బిళ్ళలు దొరికినాయి. ఈతడు మహాయోగిగా సైతము చిత్రింపబడినాడు. తరువాతి కాలంలో నితడే శివుడుగా మారినట్లు సర్వత్రా అంగీకరిస్తున్నారు. ఈ మహాయోగి ఊర్ధ్వరేతస్కుడుగా చిత్రింపబడుట గొప్ప విశేషము. ఇదియే శైవ సంబంధముగ శైవారాధన ప్రారంభానికి స్పష్టమైన నిదర్శనము. పురాణములు శివుని 'దిగంబరుడు'గా వర్ణించడం సైతం పైభావాన్ని బలపరుస్తుంది. ఈ విషయాలన్నీ లింగారాధనకూ, యోగాభ్యాసానికి ఉన్న సంబంధాన్ని సైతం నిరూపిస్తున్నాయి. వాస్తవానికి యోగవిద్య అనార్యమేననీ, ఆర్యులా సంప్రదాయాలను స్వీయమొనర్చుకున్నారనీ జాకోబి, ఆల్టేకర్ వంటి చరిత్రకారుల అభిప్రాయం.

***స్నానము:*** స్నానము సైతం అనార్య సంప్రదాయమేమోననే అనుమానానికి బలవత్తరమైన కారణాలే ఉన్నాయి. శివుడు అభిషేక ప్రియుడు, సర్వదా గంగమ్మను నెత్తిన దాల్చినవాడు! మహెంజొదారో ప్రజలు నగరమధ్యంలో స్నానవాటికలు నిర్మించుకొన్నారు. స్నానానికి వారు మత సంబంధమైన ప్రాముఖ్యం ఇచ్చినట్లు కనిపిస్తుంది. ఇందుకు భిన్నంగా ఆర్యులు అగ్నిహోత్ర ప్రియులు ఆర్యుల గృహాలలో త్రేతాగ్నులు ప్రజర్విల్లుతూ ఉండేవి. ఈ సంప్రదాయాలు వారి వారి ఆదిమ

---

*బి.యస్.ఎల్. హనుమంతరావు (1924 -1993), ప్రఖ్యాత చరిత్ర కారులు, విశ్లేషకులు.*

నివాస స్థలాల శీతోష్ణ పరిస్థితుల కనుగుణంగా నేర్పడి, క్రమంగా పని త్రీకరింపబడెనని భావించడం యుక్తము.

***నాగారాధన:*** నేటికిని దాక్షిణాత్యులలో నాగపూజ ఎక్కువ. తరచుగా కన్పించే సుబ్బయ్య, నాగయ్య, శేషయ్య మొదలైన పేర్లు; నాగుల చవితి; సుబ్బరాయ షష్ఠి పండుగలు ఆంధ్రులలోని నాగారాధనకు నిదర్శనములు. దక్షిణదేశంలో వలెనే ఈ ఆచారము ప్రాచీనకాలమున క్రీటు, ఆసియా మైనరు, పెర్సిపోలిస్ (పర్షియా) ప్రాంతాల ప్రజలలో బహూళాదరణను పొందింది.

నాగారాధన సైతం శైశవసంబంధమనడానికి చాల ఆధారాలున్నాయి. నేటి పశుపతి నాగభూషణుడుగదా! సింధూనాగరికతా కాలానికి అతడు నాగభరుడౌనో కాదో చెప్పలేము. కాని సింధు ప్రజలలో నాగారాధన వుంది. అందుచే నాగజాతికి, నా పూజకు నాగాభరణ భావమునకు సంబంధమున్నట్లు కన్పిస్తుంది.

తరువాతి కాలంలో జైన, బౌద్ధ వాఙ్మయాలలో నాగగాథ లనేక కనిపిస్తాయి. ముచిళిందుడనే నాగరాజు, ఇంద్రకల్పితమైన తుఫానునుండి గౌతమ బుద్ధునకు రక్షణ కల్పించిన కథ చాల ప్రసిద్ధము. అమరావతీ శిల్పాలలోని రాజులూ, రాణులు నాగకిరీటధారులే! అదేవిధంగా జైన తీర్థంకరుడైన పార్శ్వనాథునకు ధారణేంద్రుడనే నాగరాజు, అతని సతీమణి రక్షణ కల్పించినారట! పార్శ్వనాథుని విగ్రహాలలో రెండు భుజాలనుండి రెండు నాగులు పుడుతూ ఉన్నట్లు కన్పిస్తాయి. ఈ సంప్రదాయానికి ధారణేంద్రుని కథయే ఆధారం. మెసొపొటేమియాలో రెండు నాగులు చుట్టిన దేవతా



విగ్రహం దొరికింది. ఈ విగ్రహానికి ముచిళింద శిల్పానికి పోలిక ఉంది. ఈ దేవతావిగ్రహం క్రీ.పూ. 2000 సం॥ల నాటిదని విమర్శకుల తీర్మానము. ప్రస్తుత మీ విగ్రహము న్యూయార్క్‌లో పేర్‌పంట్ మోర్గన్ గ్రంథాలయంలో ఉంది. ఈజిప్టులో కూడా ముఖ్యంగ 'అయ్యన్' దేవతను ఇదేవిధంగా చిత్రించేవారు. క్రీ.పూ. 2600 ప్రాంతమున సుమేరియా నేలిన 'గుడెయ్యా' చక్రవర్తి పానపాత్రపై రెండు నాగులు బంధించిన శరభమువంటి మృగము కన్పిస్తుంది. ఈ మృగానికి రెక్కలున్నాయి. సింహము తల – గృధ్రపాదములు, నాగ, సువర్ణగాథలకీ శిల్పమే అంకురార్పణ అని చరిత్రకారుల నిర్ణయము.



**వృషారాధన :** వృషారాధన సైతం శైవ సంబంధమే. సింధు ప్రజలు బసవన్నను ఆరాధించినారు. కాని నాటికి బసవన్న శివుని వాహనమైనాడో లేదో మాత్రము తెలియదు. నందీశ్వరుని ఊరేగించు దృశ్యాలు ఉన్న బిళ్ళలు (Seals) సిందులోయలో దొరికినాయి. ఈజిప్టు దేశంలో గూడ పర్వదినాల్లో ఎడ్లను ఊరేగించేవారు. నేటికినీ పొంగల్ పండుగనాడు తమిళదేశంలో ఎడ్లను పూజించి ఊరేగిస్తారు. క్రీటులో దొరికిన కంచుపాత్రలమీద ఎడ్లమీదుగా దుమికే దృశ్యాలున్నాయి. శిలప్పది కారంలో 'అయ్యార్' అనే ఆచార ప్రసక్తి ఉంది. మదించిన ఎద్దుమీదుగా దూకి, దానిని అదుపులోనికి తేవడం, పెండ్లికొడుకులకు పరీక్షగా ఉండేది. అదియే 'అయ్యార్' ఆచారము.

**పార్వతి :** 'పార్వతి' అనగా పర్వతరాజు కూతురు. ఈమె చంద్రశేఖరుడైన శివుని గురించి తపస్సు చేసి ఆ మహాదేవునే భర్తగా పొందింది. ఇది పురాణాలలోని గాథ. మెసొపొటేమియా లోని ఊరు నగర ప్రజల ప్రధాన దేవత "పర్వతవాణి" (Lady of the Mount) ఈమె భర్త చంద్రుడు. వీరికి ప్రతి సంవత్సరము కల్యాణమహోత్సవము జరిపేవారు. పర్వతరాణియే పార్వతియైనదని, చంద్రుడే చంద్రశేఖర అవతారమెత్తి భారతదేశమున ప్రత్యక్షమైనాడనుటలో సందేహం లేదు. మనదేశంలోగూడ పార్వతీ చంద్రశేఖరులకు ప్రతి సంవత్సరము "తిరుక్కలియాణము" లేక 'తిరునాళ' జరుగుచునే యున్నది గదా! ఆదిమ సంప్రదాయాలను నిలబెట్టే గౌరవం భారతీయులదే!

ఊర్ ప్రజల పర్వతరాణివంటి దేవతనే క్రీటుద్వీపవాసులు సైతం ఆరాధించినారు. ఆమె పేరు 'మా'; ఆమె వ్యాఘ్రవాహిని. ఆమె భర్త నందివాహనుడు! నీరికినీ, హిందువుల 'ఉమా' శంకరులకు భేదం లేదనే చెప్పవచ్చు.

**చంద్రారాధన:** మెసొపొటేమియా ప్రజలు చంద్రుని ఆరాధించినట్లు పేర్కొన్నాం. మధ్యాసియా లోని ఇతర జాతుల్లో

సైతం ఈ ఆచారం కనిపిస్తుంది. ఇది అవైదికము; శిలప్పధికారం మొదలగు తమిళ గ్రంథాల ద్వారా తమిళు లలో ఇది అవైదికము; శిలప్పధికారం మొదలగు తమిళ గ్రంథాల ద్వారా తమిళులలో చంద్రారాధన ఉన్నట్లు స్పష్టమవుతున్నది. ఈజిప్టియనులు, ఛాల్డియన్లు చాంద్రమానమున ననుసరించినారు. ఆంధ్రదేశంలో నేడమలులో నున్నది చాంద్రమానమే! నేటికినీ మహమ్మదీయు లనుసరించుచున్నది చాంద్రమానమే గదా! అల్లసాని పెద్దన చెప్పినట్లు 'గోవధము సేయు తురకలదైవము" చంద్రుడు!

***తలనీలాల సమర్పణ:*** ఆంధ్రదేశంలోని తిరుపతి వేంకటేశ్వరాలయంలో తలనీలాలను ముడుపు చెల్లించే ఆచారం ప్రసిద్ధము. తిరుపతిలోనే గాక దక్షిణదేశమున పెక్కు క్షేత్రాలలో నీలాల సమర్పణ జరుగుతున్నది. ఇదే విధమైన ఆచారము ఫినీషియన్ వలసయైన బిబ్లస్‌లో కన్పిస్తున్నది. ఇచట దేవాలయాలలోని దేవత సగము చేప, సగము



మనిషి. ఈ దేవాలయం సుమారు ఆరువేల సంవత్సరాలనాటిది, హిందువుల నరసింహునకు, విఘ్నేశ్వరునకు బిబ్లస్‌లోని నరమత్స్య దేవతకు పోలిక స్పష్టం. ఇటువంటి నరమృగ దేవతలను (Zeomorpbic Gods) అటవిక దశలో ప్రజలారాధించినారు. వీరు ఆర్యేతర దేవతలే.

తలనీలాలు నర్పించడం తలనర్పించడంతో సమానం. పరమ శైవుడైన రావణుడు తలలనర్పించి శివుని ఆరాధించినట్లు రామాయణంలో ఉంది. తలల నర్పించడం తీవ్రవాద శైవాచారంగా మధ్యయుగం వఱకు ఆంధ్రదేశంలో ఉంది. కొండవీటి రెడ్డిరాజుల, శ్రీశైలాది శైవక్షేత్రాలలో, వీరశిరోమండపాలను నిర్మించారు. కాని తలలనర్పించు సాహసములేని భక్తులు తన నీలాలనర్పించి తృప్తి వహించేవారని భావించవచ్చు. "పుష్పార్థం అక్షతాన్ సమర్పయామి" అని కథా సంప్రదాయం. రావణుడు సైతం తన తలలను బోలిన తలలను చేయించి హోమములో వ్రేల్చి వుంటాడు. తల నీలాల సమర్పణ మనగా ఆత్మార్పణం చేయడమే! భక్తిభావమునకిది పరాకాష్ఠ. మొట్టమొదట తిరుపతి శైవక్షేత్రమనీ, శ్రీరామానుజాచార్యుల కాలమున వైష్ణవులు ఆక్రమించి వైష్ణవ క్షేత్రముగ మార్చినారనీ స్థలపురాణం ద్వారా తెలియుచున్న విశేషము. నేటికిని దేవుని నిజస్వరూపము పూజారులకు ఐనా ఇతర భక్తులకు కన్పింపదట! ఏమైనను 'నరమత్స్య' దేవతలో వలెనే 'వేంకటేశ్వర నామంతో సగము, వైష్ణవము, 'సగము శైవము! 'మధ్య వైష్ణవులకు నామములు పెద్ద' అనగా శ్రీ వేంకటేశ్వరుని ముఖమంతా నామాలే! వైష్ణవ క్షేత్రంగా మారిన తరువాత సైతము ప్రాచీన శైవాచారమైన శిరోజార్పణ నిలబడి వుండడమే తిరుపతిలో గమనింపదగిన విశేషము.

**దేవదాసి :** దక్షిణదేశ దేవాలయములలో దేవదాసి సంప్రదాయము చాల ప్రసిద్ధము. ఇదే సంప్రదాయం సిరియ, ఆర్మీనియా, లిడియా దేశాలలోని దేవాలయాల్లో సైతం అనుసరింపబడింది. సుమేరియాలో ఒక్కొక్క దేవాలయమున దేవదాసీల సంఖ్య వందలకొలది ఉండేది. ఆంధ్రదేశంలో దేవాలయ శాసనాలలో 'మున్నూ రుసానులు' అనేమాట తరచుగా కన్పిస్తుంది. బహుశా సానులు కూడ శ్రేణులుగా ఏర్పడేవారేమో!


***పూజా విధానము :*** మన దేవాలయాలలో రాజోపచార సమన్వితమైన పూజావిధానాన్ని అనుసరిస్తారు. దేవునకు అర్ఘ్యపాద్యాలిస్తారు. శంఖాలు పూరిస్తారు; గంటలు–వేణువులు – వీణలు వాయిస్తారు. నృత్య గీతాలు సంగతి వేరే చెప్పనక్కరలేదు. ధూపదీపాలు సమర్పిస్తారు. వింజామరలు వీస్తారు. తుదకు నైవేద్యము పెట్టి ఆభోజ్యములను ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇంచుమించు ఇదే విధానము క్రీటు, సుమేరియా దేవాలయాల లోనూ అనుసరించేవారు. ఇది వైదికమైన హోమ విధానమునకు విరుద్ధమైన పూజావిధానము. 'పూజ' అనుపదము ఆర్యేతరమని కొందరి అభిప్రాయము. సంస్కృతమున వినా మరి యే యితర ఇండో యూరపియను భాషలలోను 'పూజా' అనేమాట లేదట.

***పూజారులు:*** సింధు శిథిలాలో ఒక పురుష ప్రతిమ బయల్పడింది. అది ఆ ప్రజల పూజారి ప్రతిమయని చరిత్రకారుల అభిప్రాయము. ముఖ్యంగా ఈ పూజారి వేషము గమనింపదగింది. అతడు ఉత్తరీయాన్ని ధరించాడు; ధోవతి – ఉత్తరీయములు ద్రావిడ లేక ఆర్యేతర వస్త్ర పద్ధతియేయని అంగీకరిస్తున్నారు. ఉత్తరీయాన్ని ఈ పూజారి ఉపవీతం పద్ధతిలో ధరించినాడు; అనగా కుడి భుజము క్రిందుగా –

ఎడమ భుజముమీదుగా దాల్చి, ఎడమ భుజము దిగువ వక్షస్థల సమీపమున ముడివేసినాడు. ఇది యజ్ఞోపవీతమునకు అంకురార్పణ అనవచ్చును. యజ్ఞోపవీత మనగా యజ్ఞకాలమున ధరించు ఉత్తరీయము. కావున యజ్ఞోపవీతమనగా వల్లెయే! శిల్పాగమాలలో వస్త్రయజ్ఞోపవీత ప్రసక్తి ఉంది. గుప్తయుగమునాటి శిల్పాలలో సుదీర్ఘమైన వస్త్ర యజ్ఞోపవీతాలు కన్పిస్తాయి. ఉపనయనార్హతలేని, శూద్రులు సైతం పితృకార్యముల సందర్భంలో వస్త్రయజ్ఞోపవీతాలు ధరిస్తారుగదా! సింధూ పూజాది ప్రతిమను బోలినట్టివే మెసొపొటేమియాలో కూడా దొరికినాయి. దీనివలన ఉభయ దేశాలలోనూ పూజారు లొకేరకములైన దుస్తులు ధరించేవారనియే గాక యజ్ఞోపవీతము ఆర్యేతర సంప్రదాయముగ నుదయించినదనియూ, మొదట, ఉత్తరీయముగానే యుండి నేటికి లాంఛన ప్రాయమైన నూలుపోగుగ మారిపోయినదనియు గ్రహింపవచ్చును. సింధు పూజారి నుదుటిపై బాసికమును పోలినదానిని ధరించియుండుట సైతము గమనింపదగియున్నది. మత సంబంధమైన కార్యక్రమములలో నేటికిని బాసికములు, కంకణములు ధరించునాచారము మనలో నున్నది గదా. ఇది చరిత్ర పూర్వయుగంనాటి సంప్రదాయం!


మరొక విశేషమేమన, సింధు మెసొపొటేమియా పూజారులు తలకట్టు, మీసము, తీసివేసి గడ్డమును మాత్రము పెంచినారు. ప్రస్తుత మీ సంప్రదాయము ముస్లిములదని హిందువుల విశ్వాసము! అన్ని మతములలోను, గడ్డం మతమునకు చిహ్నమును విశ్వాసం కన్పిస్తున్నది. సనాత హిందువులలో సైతమీ నమ్మకము ఉంది. వారిలో మీసమును పెంచుట దోసమను నమ్మకంసైతం ఉంది. మత సంబంధమైన కార్యకలాపముల సందర్భమున "కేశశ్మశ్రుపాపయిత్వా" – తలజుట్టు, మీసము తీయించు మని ధర్మశాస్త్రం ఆదేశిస్తున్నది. ఒక సందర్భములో తిరుపతి వేంకటకవులు; 'దోసమటం చెటింగియును దుండుడు కొప్పగ పెంచినార మీ మీసలు" అంటూ చాటినారు. కావున సనాతన హిందూ ధర్మము ననుసరించి మీసము పెంచటం దోషం. దీనిని బట్టి జుట్టు, మీసము తీయించి గడ్డము పెంచుట ఇస్లాము మత సంబంధమైన ప్రత్యేక సంప్రదాయముకాదనీ, మిక్కిలి ప్రాచీనము, సనాతనమునైన భారతీయ ఆచారమేనని తెలుస్తున్నది.

***వాస్తు నిర్మాణాదులు:*** పురములు, ఆలయములు : వైదికార్యుల విరోధులైన ఫణి మున్నగు జాతులు వాస్తు విద్యలో నారితేరినట్టు పేర్కొన్నాము. వారి నిర్మాణ కౌశల్యానికి హరప్పా మొదలైన చోట్ల బయల్పడిన కట్టడాలే, నిదర్శనాలు. ఋగ్వేద సంహితాకాలంలో ఆర్యులకు స్థిరనివాసాలు లేవు. అనార్యుల పట్టణాలను, దుర్గాలను చూచి సంభ్రమాశ్చర్యములను వెల్లడించినారు. దుర్గానికి ఆనాడు 'పురము' అని వ్యవహారముంది. పురములను నిర్మూలించినవాడే పురందరుడు! బ్రాహ్మణములలో 'ఆర్మ', 'అర్మక' అనే ప్రయోగాలు తరుచు కన్పిస్తున్నాయి. వీనికి 'వినష్టగ్రామ'మని అర్థము. ఉత్తరాపథము నందలి తమ గ్రామములు ఆర్యదండయాత్రలలో నష్టపడిన తరువాతనే ఆర్యేతరులు దక్షిణాపథమును చేరి అచట పట్టణములు, పురములు, దేవా లయములు నిర్మించు కొన్నారు.



ప్రాచీన తమిళ వాఙ్మయము నుండి నాటి దాక్షిణాత్యుల నిర్మాణ కౌశల్యము స్పష్టంగా తెలుస్తున్నది. ఈ నిర్మాణములకు ఈజిప్టు, క్రీటు, బాబిలోనియా, సుమేరియా దేశాలలోని కట్టడాలకు పోలిక లున్నాయి. ఈజిప్టులోని పిరమిడులను గురించిగాని, కార్నాల్ మున్నగు దేవాలయములను గురించిగాని, చెప్పనక్కరలేదు. క్రీటులో క్నాస్సాస్ చెంత పద్మ వ్యూహమును బోలిన రాజ ప్రసాదము బయల్పడింది. సుమేరియాలో ఒక్కొక్క దేవళ మొక రాజప్రసాదము తమిళు లు తరచుగావాడు. కోవలె (దేవా లయము) పదమునకు రాజప్రసాదము అనే అర్థం ఉంది.

***గోపురాలు:*** సుమేరియన్లు 'నిప్పూర్'లో తమ ఇష్టదైవమైన 'ఎన్‌లిల్' కు పెద్ద గోపురాన్ని నిర్మించారు. ఎన్‌లిల్ వాయుదేవుడు; బహుశా ఈ పదమే 'అనిల'గా సంస్కృత భాషలో ప్రవేశించి ఉంటుంది. బైబిల్‌లో కూడా గోపురాల ప్రసక్తి (Tower of Babel) వుంది. దక్షిణాపథంలో అమలులో నున్న దేవాలయ వాస్తు పద్ధతిలో గోపురానికి ప్రముఖ స్థానముంది. ఆలయ ప్రాకారములోని గోపురమును గాలి గోపురము' అంటారు! సుమేరియాలోని ఎన్‌లిల్ గోపురానికీ, గాలిగోపురానికి సంబంధమును ఊహించవచ్చును.



## మనిషిగా పుట్టిన గంధర్వుడు

# బళ్ళారి రాఘవ

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

తత్త్వవేత్త, రాజకీయవేత్త, సంఘసంస్కర్త, విద్యాదాత, వీరందరి గుణాలు నటునిలో సమ్మిళితమైనపుడే అతడు నిజమైన నటుడు కాగలడు.... అంతేకాక ప్రజానీకంలో మంచి అభిరుచులు, నెలకొల్పుట, వారిని కళాభిజ్ఞుల కావించుట తమలో నిగూఢంగా వున్న దైవిక శక్తులను, తాము తెలుసుకొనునట్లు చేయుట నటుని విధి. జనులలో కనబడు పశుత్వమును క్రమశిక్షణ ద్వారా దైవత్వంగా పరిణమించునట్లు చేయటం నటుని బాధ్యత. ఈ ఆశయంలేని నటుడు ఎంత ప్రజ్ఞావంతుడైనా నిజమైన నటుడు కాజాలడు. అతడు ఒక బఫూన్ మాత్రమే! అంటూ కొన్నేళ్ళ క్రితం, మద్రాసు రేడియో కేంద్రం నిర్వహించిన "నటుడు – నటన" అన్న విషయంపై బళ్ళారి రాఘవ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ రీతిగా నటన యొక్క మహోన్నత లక్ష్యాన్ని నిర్వహించిన రాఘవ వ్యక్తిగత జీవితం కూడా మహోదాత్తంగా సాగింది.

రాఘవ మేనల్లుడు, డా. ఎ. నాగరాజు పేర్కొన్న వాస్తవాలను, రాఘవ చివరి రోజులలో, వారితో నాకున్న పరిచయాన్ని పురస్కరించుకొని, కొన్ని విశేషాలను తెల్పటమే నా ఉద్దేశం.

రాఘవ రోజూ వేకువనే లేచేవారు. లేచిన వెంటనే, తమ టేబుల్ మీది క్యాలెండర్ తేదీని మార్చటం ఆయన అలవాటు. ఈ అలవాటు రాఘవ జీవితాంతం సాగింది. మేన కోడలు సులోచనతో క్యాలెండర్‌లోని తేది మార్చటంలో పోటీ పడేవారు. వేకువనే లేచే అలవాటు బాల్యంలోనే కల్గించాలని ఆయన అభిప్రాయం. ప్రార్థనతో (మానసికంగా) దైనందిన కార్యక్రమాలు ప్రారంభించేవారు. తర్వాత సాహిత్య నాటక, కళారంగాల గ్రంథాలు, అధ్యయనం, న్యాయవాద వృత్తికి సంబంధించిన కార్యక్రమాలకు పూనుకొనేవారు. సాయంత్రం కోర్టునుంచి రాగానే పండిత మిత్రులతో, నాటక, సాహిత్య గోష్ఠి సాగించే వారు. సాయంత్రం ఎవరు వచ్చినా కోర్టు వ్యవహారాల గురించి మాట్లాడేవారు కారు.

రాఘవ ఆధ్యాత్మిక గురువు పండిత తారానాథ్. ఈయన నైజాంకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించిన వారు. నిజాం ప్రభుత్వం అక్కడి నుండి బహిష్కరించగా, కర్నూలు జిల్లా తుంగభద్ర గ్రామంలో, ప్రేమాయతనం ఆశ్రమం స్థాపించి అక్కడే స్థిరపడినారు, రాయచూరుకు చెందిన, శ్రీరామగురు, హంపీ సమీపంలోని గుహలలో యోగ సాధన చేస్తూ వుండిన శంభర్‌నాథ్‌జి మొదలగు తత్వవేత్తలు, రాఘవగారి ఇంటికి వస్తూండేవారు. రాఘవ గృహం కళాకేంద్రమే కాక, ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా వుండేది.

రాఘవ మిత్ర సంపద అపారం. వారి ఆప్తులలో, జస్టిస్. పి.వి. రాజమన్నార్ (మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి), ప్రముఖ కన్నడ నాటక కర్త టి.పి. కైలాసం, బెంగళూరుకు చెందిన మహా మేధావి. డి.వి. గుండప్ప, కన్నడ నటుడు గుబ్బి వీరణ్ణ, అభ్యుదయ రచయిత అ.న కృష్ణారావు, కట్టమంచి రామలింగారెడ్డి, దర్శక నిర్మాత బి.ఎన్.రెడ్డి, గూడవల్లి రామబ్రహ్మం, స్వామి శివశంకరులు, మరెందరో మేధావులు వారి మిత్రులు.

పండిత తారానాథ్, ప్రోత్సాహంతో రాఘవ ఇంట్లో ఒక ప్రత్యేక భజన మందిరం వుండేది. ఆ మందిరంలో హిందూ దేవతల చిత్రాలతో పాటు క్రీస్తు, బుద్ధుల చిత్రాలు, ఖురాన్ సూక్తులు వుండేవి. సాయంకాల భజనలో ఇంట్లో వాళ్ళందరూ

డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఫోన్ : 08562 - 243923

# సమవర్తి




బళ్ళారి రాఘవ చిన్నతనం నుంచి ప్రకృతిలో పక్షుల కుహుకుహురవాలను అనుకరిస్తూ ఆనందించేవాడు. ఆ విధంగా అనుకరణలోనూ ఆరితేరాడు. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చదువుకుంటున్నపుడు షేక్స్‌పియర్ నాటకాన్ని చెప్పే ఆంగ్లో ఇండియన్ అధ్యాపకుని ఆంగ్లేయ ఉచ్చారణను యథాతథంగా అనుకరిస్తూ విశ్రాంతి సమయాల్లో తనతోటి విద్యార్థులకు వినోదం కలిగించేవాడు. ఆంగ్లేయ నాటక ప్రదర్శనలో సహితం ఆరితేరిన రాఘవ ఇంగ్లాండులో కొన్ని ఆంగ్ల నాటకాలను ప్రదర్శించారు. ప్రఖ్యాత ఇంగ్లీషు నాటక కర్తయిన జార్జి బెర్నార్ట్ షా రాఘవ ఆంగ్ల ఉచ్చారణకు ముగ్ధుడయి తన అభినందనలను తెలిపారు )బెర్నార్ట్‌షా ఆంగ్లేయుల అస్పష్ట ఉచ్చారణను తూర్పార బడుతూ 'పిగ్మాలియన్' అనే నాటకాన్ని రచించారు. ఆ నాటకం తదుపరి కాలంలో 'మై ఫేయిర్ లేడి' అనే పేరుతో సంగీత నాటకంగా, ఆ తరువాత 1964 సం॥లో ఆస్కార్ విజేతగా నిలచిన సినిమాగా వచ్చింది).

రాఘవ ఎంత గొప్ప నటులో అంత గొప్ప క్రిమినల్ లాయర్. ఒక కేసులో ఆయనను వాదించడానికి తీసుకొని వచ్చారు. ఆయనను చూడడానికి, అనర్గళమైన ఆయన వాదనా పటిమను వినడానికి ప్రజలు తండోప తండోపాలుగా వచ్చి కోర్టు ఆవరణను చుట్టుముట్టారు. ప్రజలను అదుపు చేయటంలో పోలీసులు విఫలం కావటంతో, న్యాయమూర్తి వాదనలను మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఆ మర్నాడు, క్రమబద్ధీకరించబడ్డ అశేష జనవాహిని ఆయన వాగ్ధాటిని విని ముగ్ధులయ్యారు. ఈ సంఘటనను ఎన్.టి.ఆర్. (సీనియర్) లాయర్‌గా నటించిన ఒక సినిమాలో యథాతథంగా పొందుపరిచారు.

ఇప్పుడు ప్రదర్శించబడే అనేక నాటకాలలో కొన్ని అనివార్య సాంకేతికపరమైన అడ్డంకులు ఉండటము వలన, నటులు తలుపులు మూస్తున్నట్లు, గడయ పెడుతున్నట్లు మూకాభినయం చేస్తున్నారు. బళ్ళారి తన నాటకాలలో సహజత్వానికి పెద్ద పీట వేశారు. ఒక నాటకంలో రాఘవ ధరించిన పాత్ర ఆత్మహత్యకు ప్రయత్నించి నదిలోనుంచి రక్షింపబడి బయటకు తీసుకుని రాబడుతుంది. ఆ సన్ని వేశంలో, రంగస్థలంలో ఆ పాత్ర వచ్చే సమయానికి ఆయన ఒక బిందెడు నీళ్ళు తన తలపైన కుమ్మరించుకుని వచ్చేవారు. ఎముకలు కొరికే చలికాలంలోనూ ఆయన ప్రదర్శన అలానే సాగేది.

ఆనాటి నాటకాలలో యమధర్మరాజు పాత్ర భయావహమైన ఆహార్యంతో ఒళ్ళు జలదరించే వాదాడంబరంతో ప్రదర్శించ బడుతూ ఉండేది. న్యాయశాస్త్ర కోవిదుడైన బళ్ళారి రాఘవ, యమధర్మరాజు సమవర్తి, న్యాయాన్యాయ విచారణ సలిపి తగు శిక్షలను విధించే న్యాయాధిపతి, అందువల్ల ఈ విధమైన భయంకర ఆకార వికారాదులతో కాక, ప్రశాంత వదనంతో నుండే విధంగా రూపకల్పన చేశారు. న్యాయ నిర్ణేతకు ఓర్పు, ఒద్దిక ముఖ్య లక్షణం అని భావించేవారాయన. అయితే వేమూరి గగ్గయ్య మూసలో యమధర్మరాజును చూసిన ప్రేక్షకులు బళ్ళారి వారి ప్రయోగాన్ని అంతగా ఆదరించలేదు. బ్రిటిష్ ప్రభుత్వం రాఘవను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. రాయబహద్దూర్ బిరుదునిచ్చి సన్మానించింది. మద్రాసులో షేక్స్పియర్ క్లబ్‌ను స్థాపించారు. ఆసియా, యూరోప్ ఖండాల్లో నాటకంపై జరిగిన సెమినార్లలో ఆయన చెప్పే ప్రసంగాన్ని శ్రోతలు జాగ్రత్తగా వినేవారు. అందులో ఎన్నో విభిన్నమైన విషయాలుండేవి.

బళ్ళారి రాఘవ తన పేరు చివరన ఉండిన ఆచార్య అన్న కులనామాన్ని విసర్జించారు. ఆయన హిందీ, ఇంగ్లీషు, తమిళ, తెలుగు, కన్నడ భాషల నాటకాలలో నటించి భారతదేశమంతా ఖ్యాతి గడించారు. ఆనాటి నాటకాలలో స్త్రీ పాత్రలు పురుషులే ధరించేవారు. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలని పట్టుబట్టారు రాఘవ. స్త్రీలు నటించడానికి ముందుకు రాకపోవటంతో ఆయన తన భార్యను, కూతురును నాటక రంగానికి పరిచయం చేశారు. ఆ ప్రేరణతోనే తరువాతి కాలంలో కొమ్మూరి పద్మావతి, టంగుటూరి సూర్యకుమారి లాంటివారు నటించటం మొదలుపెట్టారు.

గాంధీజీ, ఠాగూర్‌లు ఆయన నటనకు ప్రశంసల జల్లు కురిపించారు. భారత ప్రభుత్వం ఆయన గౌరవార్థం 'పోస్టలు స్టాంపు'ను విడుదల చేసింది. ఆయనను 'ఆంధ్ర నాటకరంగ ప్రభాకరుడు', 'సముదాత్త నటనా ప్రదీపకుడు' అని కీర్తిస్తూ హైదరాబాద్‌లోని టాంకుబండపై ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠింప జేసి ప్రభుత్వం నివాళులర్పించింది.

పాల్గొనే వారు. ఒక హరిజన భక్తుడు, చనిపోయే ముందు కానుకగా యిచ్చిన ఏకనాదం వాయిస్తూ రాఘవ పాల్గొనేవాడు. ఒక్కోమారు విదేశీయులు కూడా కార్యక్రమంలో పాల్గొనే వారు. సోమవారం సాయంత్రం విభూతి ధరించి రాఘవ భక్తి కీర్తనలు పాడేవారు. పుణే నుండి ఒక యూరోపియన్ యోగి వచ్చి, రాఘవ ఇంట్లో కొన్ని రోజులుండి భజన పాటలు పాడేవాడని, రాఘవ మేనల్లుడు, న్యాయవాది, డి. వేణుగోపాలాచారి చెప్పారు.

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన రాఘవ, కుల, మత, భేదాలను ఏ మాత్రం పాటించే వారు కాదు. పండుగ రోజు కొందరు హరిజనులు ఇంటికి ఆహ్వానించి వారితో పాటు భోజనం చేసేవారు. హరిజన బాలలకోసం బళ్ళారిలో

"ముద్దుతార" ప్రాథమిక పాఠశాలను స్థాపించారు. ఎందరో బీద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేవారు.

సాంఘిక సంస్కరణ కృషిని అసహ్యించుకొన్న సనాతనులు, రాఘవను శ్రీ వైష్ణవ మతం నుండి వెలివేయించటానికి యత్నించారు. రాఘవ ఏ మాత్రం జంకలేదు. నిజమైన వైష్ణవుడు కుల మతాలకు అతీతంగా జీవించాలనే వారు – అవహేళన చేసిన వారే క్రమంగా వారి మిత్రులయ్యారు.

న్యాయవాదిగా, నటుడుగా గొప్ప పేరు గడించిన రాఘవ, 1933లో జరిగిన బళ్ళారి పురపాలక సంఘం ఎన్నికలలో పోటీ చేయమని ఆయనను ఒత్తిడి చేశారు. ఎంత బతిమాలినా ఆయన రాజకీయాలలో తలదూర్చలేదు.

సాధారణంగా గొప్ప వారి చుట్టూ వందిమాగధులు చేరుతుంటారు, కాని రాఘవ తీరే వేరు. కట్టమంచి రామలింగారెడ్డి, టి.పి. కైలాసం, రాఘవ సన్నిహిత మిత్రులు. కట్టమంచి ఒకమారు రాఘవను ఒక ప్రశ్న వేశారు. సనకసనందులు చేత శపింపబడిన వైకుంఠ ద్వార పాలకుల ఉద్దేశించి మాట్లాడుతూ, "భగవద్వేషులుగా మూడు జన్మలెత్తుతారా? భగవద్భక్తులుగా ఏడు జన్మలెత్తుతారా?" అని విష్ణువు అడిగాడు కదా? అంటే భగద్వేషులు దైవ సన్నిధిని త్వరగా చేరుకొంటారా? అని ప్రశ్నించారు రెడ్డి గారు. ఈ ప్రశ్నను కైలాసం గారికి చేరవేశారు. ఆయన సమాధానం ఆయనకు తగినట్లే వుంది.

ఒక గీత పక్కన మరొక గీత గీచామనుకొందాం. రేఖా గణితంలో వీటిని సమాంతర రేఖలంటారు. ఇవి ఎక్కడా కలుసుకోవు. అనంతమైన దూరంలో కలుసుకొంటాయని గణిత శాస్త్రం చెబుతుంది. ఒక గీత మరొక గీత దగ్గరలో కలుసుకోవాలంటే, రెండవ గీత సూటిగా, నిటారుగా మొదటి గీతను ఢీ కొనాలి. ఇట్టి గీతను లంబరేఖ అంటారు. కాబట్టే మంచివాడు, దైవం సమాంతర రేఖల వంటివారు. మంచితనం దైవత్వం ఎప్పుడూ ఢీ కొనవు, ఘర్షించవు. జయ విజయులు సజ్జనులుగా పుట్టి వుంటే, తిరిగి వైకుంఠ ప్రాప్తి అంత త్వరగా జరిగి వుండదు. దైవ – ద్వేషులు సదా దైవంతో ఘర్షణ పడుతుంటారు. లంబ రేఖవలె, ఇక్కడ లంబరేఖ ఇంకొక రేఖను కోసి వేసే సామ్యం గమనింప దలచి, కట్టమంచి అనుబంధ ప్రశ్నవేస్తూ "అట్లయితే మన మందరం దుష్టులెందుకు కాకూడదు? అన్నారు. కైలాసం, కాసేపు ఆలోచించి, పరమాత్మ తత్వం ఏమిటంటే, తన దగ్గరకు వచ్చిన ప్రతి వస్తువునూ తననుగా మార్చి వేస్తుంది. భగవంతునితో ఘర్షణ పడితే ఏ వస్తువునైనా జర్జరిత మవుతుంది" అన్నారు. రెడ్డి, కైలాసం సమాధానం విని ఆనందించారు. (టి.ఎ. కైలాసం, విదేశాల్లో చదివి మైసూరు సంస్థాన ఛీఫ్ కన్సర్వేటర్ పదవిలో వుండి, నచ్చక రాజీనామా చేసిన నాటక కర్త, మేధావి)

రాఘవ అప్పుడపుడు టెన్నిస్ ఆడేవారు. బంతిని కొట్టడంలో తగిన బలం లేకున్నా ఆటలో నైపుణ్యం చూపే వారు, రాఘవ క్రికెట్ క్రీడాకారుడు కాదు. కాని క్రికెట్ బ్యాట్‌ను కొన్నేళ్ళపాటు తన గదిలో భద్రపరచినవాడు.

నవాబుల ఠీవితో హుక్కా పీల్చడం స్పెన్సర్ సిగార్‌లు, సిగరెట్లు, చిన్న మంగళూరు బీడీలు పీల్చడం ఆయనకో సరదా. ఎక్కువగా పొగ పీల్చేవారు కాదు. పొడుం డబ్బా వుండేది. కాని నశ్యం పొడిని ముక్కుపుటాలకు దట్టించే వారు కాదు. పొడుం డబ్బీని దూరంగా వుంచుకొని వాసన చూసేవారు.

ఆయన అలవాట్లకు ఒక పద్ధతి వుండేది. ప్రతి వస్తువుకూ ఒక స్థానం. ఆస్థానంలో ఆ వస్తువు ఉంచేవారు.

వైద్యం విషయంలో ఆయనది వింత మనస్తత్వం. అలోపతి డాక్టర్ ప్యాటే శ్రీనివాసాచార్, హోమియో వైద్యులు డా. జంబులింగం, ఆయుర్వేద వైద్యులు భాస్కరాచార్య రామచంద్రస్వామి, ఆయనకు చాల ముఖ్యులు. రామచంద్ర స్వామి (మా పెద్దనాన్న) స్వయంగా ఇంట్లో లేహ్యాలు తయారు చేసేవారు. ఆ లేహ్యాలను, రాఘవ గారికి అందజేయడం నా పని. లేహ్యాలు అందుకొని చాల బాగున్నాయి అనేవారు.

కళ కోసం ఎంతో ఉదారంగా ఖర్చు చేసే రాఘవ ఆచార్య వ్యవహారాల్ల ఏమాత్రం దుబారా చేసేవారు కాదు. ఉపనయనానికి రూ. 25/– మించి ఖర్చు చేసేవారు కాదు. వివాహానికి రూ. 250/– మించి ఖర్చు చేయరాదని ఆయన సిద్ధాంతం 1938లో తన రెండవ కుమార్తె వివాహాన్ని, తమ్ముని కుమారుని వివాహాన్ని, కేవలం రూ.500/– ల ఖర్చుతో ముగించారు. బంధువులకు ఆశీస్సులు పంపమని జాబులు రాసేవారు. విందుకు పెళ్ళివారిని, ఇంట్లో వారిని మాత్రమే పిలిచేవారు. సాయంత్రం మిత్రులకు టీ పార్టీ ఇచ్చేవారు.

జాబులు రాయటంలో శ్రద్ధ వహించే వారు. ఆయన లెటర్ ప్యాడ్‌పై 'టి. రాఘువ' అని మాత్రమే వుండేది. ఊరు, తేది, ఆయనే రాసే వారు. ఆయన ఉత్తరాల్లో ఆత్మీయత వుట్టి పడుతుండేది. చెల్లెలికి రాసే ప్రతి ఉత్తరంలో "ఏన్రవ్వా, ఏద్దీరా? చాకుడిదీరా? (అమ్మగారూ లేచారా?, టీ తాగారా?) అనే కన్నడ వాక్యాలతో ప్రారంభించే వారు. రాఘువ తల్లి అరుదుగా టీ తాగేవారు. ఆయన మాత్రం ఉదయాన్నే టీ తాగేవారు.

వ్యక్తిగత శుభ్రత, భోజనం అలవాట్లు చాలా శ్రద్ధగా పాటించేవారు. వడ్డించేటప్పుడు గరిటెలు మ్రోగడం, పక్కనున్న వారు పెద్దగా మాట్లాడటం, భోజనం చేస్తూ జుర్రుకోవడం ఏ మాత్రం సహించేవారు కాదు. అలా జరిగినపుడు కళ్ళు మూసుకొనే వారు. ప్రతిపనీ కళాత్మకంగా వుండాలనే వారు.


స్నేహితులను, నౌకర్లను ఎంతగానో ప్రేమించేవారు. రాఘువ కారు చాల పెద్దది. నల్లరంగులో వుండేది. కారు డ్రైవరు దేవదాసు. రాఘువను దైవంగా భావించేవాడు. దర్జీ రమణప్ప, రాఘువ అంతిమయాత్ర (16-4-1946)లో భౌతిక కాయంపై గొడుగుపట్టుకొని స్మశానం దాకా నడిచాడు.

రాఘువ సంగీత కళాకారుడు కాదు. సంగీతం రాకపోవడం తనలోని లోపమేమో అన్నప్పుడు, గురుదేవ్ రవీంద్రనాథ్ టాగూర్ "మీనోట వెలువడిన ప్రతివాక్యం సంగీతాత్మకమే" అన్నారు. రాఘువ నాటకాల్లో హార్మోనిస్టు. టి. కుమారస్వామి (కొమ్మి) అద్భుతంగా వాయించేవాడు. రాఘువ తీర్చిదిద్దిన నటుడు జోళదారాశి దొడ్డనగౌడను పుత్రునిగా ప్రేమించేవారు. రాఘువ తుదిశ్వాస వదిలే సమయంలో బళ్ళారిలో లేడు, కన్నీరు కారుస్తూ *"బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబునగుచు"* అంటూ విలపించాను.

ఆ మహానటుడు చివరి రోజుల్లో 'పాదుకా పట్టాభిషేకం'లో దశరథుడుగా నటించారు. ఆ నాటకంలో చిన్న పాత్రధారిగా పాల్గొనటం నా పురాకృత పుణ్యఫలం.

మనిషిగా పుట్టిన గంధర్వుడు రాఘువ.

**మూడవ అట్ట :**



సర్ లారెన్స్ అల్మా టడెమా (1836-1912) డచ్ దేశస్థుడు. అల్మా టడెమా చిత్రాలన్నిటిలో భవన నిర్మాణం, ప్రకృతి నేపథ్యంలో స్త్రీ సౌందర్యం అద్భుతంగా చిత్రించబడింది. టడేమా చిత్రాలు నమూనాగా ఎన్నో ఆంగ్ల చారిత్రక సినిమాలలో, వారి సెట్టింగ్‌లు, ఆహార్యం - నిర్మాతలు రూపొందించుకున్నారు. సిసిల్ బిడి మిల్లీ తన చిత్రాలకు ఆల్మా టడెమా చిత్రాలను నమూనాగా తీసుకున్నారు. రోమ్, గ్రీస్, ఈజిప్టు భవన నిర్మాణ శిల్పాన్ని మూర్తిమంతం చేసిన రియలిస్ట్ చిత్రకారుడు ఆల్మా టడెమా చిత్రాలను తరుచూ మిసిమి పాఠకులకు పరిచయం చేయాలని సంకల్పం. సింహపు చర్మంపై నున్న ఈ సుందరి చిత్రం Lady Lever Art Gallery, Port Sunlight, U.K.లో ఉన్నది.

**నాల్గవ అట్ట :**



దేవికారాణి వాల్తేర్ (విశాఖపట్నం)లో మార్చి 30, 1908లో జన్మించారు. తండ్రి కర్నల్ ఎమ్.ఎన్. చౌధురి. మొదటి సర్జన్ జనరల్ (మద్రాస్) గా చేశారు. దేవికారాణి, రవీంద్రనాథ్ టాగూర్ సోదరికి మనుమరాలు. ఆమె రాయల్ అకాడెమీ, డ్రామా, మ్యూజిక్ - లండన్‌లో చదివారు. అప్పటి సినీ నిర్మాత హిమాంశురాయ్‌ని 1929లో వివాహమాడారు. బాంబే టాకీసు వీరిద్దరు స్థాపించినదే. అశోక్ కుమారతో 'అచ్యుత్ కన్య' (1936) లో నటించారు. దిలీప్ కుమార్‌ని పూనాలో మిలటరి క్యాంటీన్‌లో చూసి, తర్వాత తెరకు పరిచయం చేసిన ఘనత దేవికారాణిదే.

హిమాంశురాయ్‌తో యూరోప్ అన్ని దేశాలలో నాటక ప్రదర్శన లిచ్చారు. బి.బి.సి. లో మొట్టమొదటి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎన్నో చిత్రాలలో నటించి స్టార్‌గా వెలుగొంది, 1945లో బాంబే టాకీసు వదలి, రష్యన్ డా॥ స్వెతొస్లావ్ రోరిక్ (నికోలస్ రోరిక్ రెండవ కుమారుడు) ని వివాహం చేసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన డాన్స్, డ్రామా, మ్యూజిక్ అకాడమీ సభ్యులుగా చాలా కాలం ఉన్నారు. కేంద్ర లలిత కళా అకాడమీ సభ్యులుగా, భారత సాంస్కృతిక రాయబారిగా వ్యవహరించారు. 1958 జనవరి 26న భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' ఇచ్చి, 1970లో 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు మొదటిసారి దేవికారాణి కిచ్చి గౌరవించింది. 1989లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'సోవియట్ లాండ్ నెహ్రూ' పురస్కారంతో ఆమెను సన్మానించారు. మార్చి 9, 1994లో ఆమె ప్రశాంతంగా బెంగుళూరులో కన్నుమూశారు.

*- వివికె*



# మానవ శాస్త్రం విస్మృతమా?

- ముంగర జాషువ

ప్రాచీన గ్రీకు మేధావుల పుర్రెల్లోంచి మానవ శాస్త్రం (Anthropology) పుట్టినప్పటికీ, ఆధునిక మానవ శాస్త్రం రెండు శతాబ్దాలు గడిచినా, ఇది ఎక్కువగా సామాజికుల, విద్యాధికుల అధ్యయనంలో, ఆలోచనల్లో చోటుచేసుకోలేక పోయింది. అసలు ఏ శాస్త్ర దృక్పథం ఏర్పడకుండా వైదిక ధర్మ ప్రచారకులూ, వారికి కొమ్ము కాస్తున్న సంపన్న శూద్ర వర్గాలు, తన చూపుడు వేలుతో అంబేద్కర్ చూపించిన బౌద్ధాన్ని కాకుండా, సిలువను ఆశ్రయించిన దళిత వర్గాలు, కళా రూపాల్లో మిగిలిపోయిన మార్క్సు వాదులూ, ఇంకా కులవాదులు, మతవాద మైనారిటీ వాదులూ, ఎండనకా, వాననకా ప్రతి బండరాయినీ మొక్కుతున్న రాజకీయ వాదులూ, తదితరులూ పంపించే సంకేతాలు సమాజంలో సరియైన శాస్త్రీయ దృక్పథం ఏర్పడకుండా మానసిక అవరోధాలు కల్పిస్తున్నాయి. సామాజిక వాతావరణంలో కలుషితమైన గాలిని పీలుస్తున్నాం. అయితే యీ విషయాలను ప్రక్కకుపెట్టి శాస్త్రీయ దృక్పథం ఏర్పడటానికి ఒక విభాగమైన సామాజిక మానవశాస్త్రం (Social Anthropology) ని గురించి అతి స్థూలంగా పరిశీలించడమే యీ రచనోద్దేశ్యం.

అసలు మనిషి ప్రాథమికంగా తనను గురించి తెలుసుకోవడానికి, మానవ శాస్త్ర దృక్పథం నుంచి చూసినట్లయితే తాను జడ చైతన్యం నుంచి జీవ చైతన్యంగా ఏర్పడటానికి శారీరక, మానసిక, భాషా, సాంస్కృతిక పరిణామాలు కలగడానికి లక్షల, కోట్ల సంవత్సరాలు పట్టినవనే హేతుబద్ధ ఆలోచనకు చేరుకుంటాడు. గుంపు జీవనం నుంచి, కుటుంబ, నాగరిక జీవనం వరకు జరిగిన మార్పుల గురించి తెలియడం వలన ఒక సంక్లిష్ట ఆదిమ సమాజంనుంచి నాగరిక సమాజంలో జీవిస్తున్నాననే స్పృహ కలుగుతుంది. ఇంకా తనలో ఆదిమ మానవ లక్షణాలు వున్నాయనే సత్యాన్ని గ్రహిస్తాడు. ఆధునికత అనేది కాలానికి మాత్రమే వర్తిస్తుందనే వాస్తవాన్ని గ్రహించడానికి వీలు కలుగుతుంది. ఇటువంటి అనేక వాస్తవాలు అవగతం కావడం వలన, తన 'ఉనికి' యొక్క పూర్వాపరాలు స్పష్టమౌతాయి. మనిషికి తను రూపొందిన విధానం, శాస్త్రీయంగా తెలియడం వలన అనేక భ్రమలు తొలగి పోతాయి. మానవశాస్త్ర దృక్పథం భౌతిక సత్తా నుంచి ప్రారంభమై సంస్కృతీపరమైన అంశాల వరకు వ్యాప్తి చెంది వుంటుంది.

మానవశాస్త్ర దృక్పథమూ, మానవతా వాదం వేర్వేరు అనే విషయం అందరికీ తెలిసిందే అయినప్పటికీ కొంత వివరణ అవసరమై కూర్చుంది. మానవశాస్త్రం మనిషి శారీరక, సామాజిక, సాంస్కృతిక పరిణామాన్ని గురించి పరిశోధనలు చేసి ఒక గుణాత్మక, ధార్మిక మానవీయతను కలిగియుండాలని ప్రతిపాదిస్తుంది. మానవతా వాదం, నవ్య మానవతావాదం, మనస్తాత్విక మానవతా వాదం (Psycho-humanism) లాంటి కొన్ని వాదాలు వున్నట్లే, ఈ మానవశాస్త్రంలో కూడా అనేక శాఖలున్నాయి. అవి 1) శారీరక మానవ శాస్త్రం (Physical Anthropology) 2) సాంస్కృతిక మానవ శాస్త్రం (Cultural Anthropology) 3) సామాజిక మానవశాస్త్రం (Social Anthropology) 4) భాషా మానవ శాస్త్రం (Lingustic Anthropology) లాంటివి. వీటికి ఉపశాఖలు కూడా అనేకం వున్నవి. వీటి సమన్వయ అధ్యయనం వలన మనిషి పరిణామం, పుట్టుక, పెరుగుట నుంచి సమాజ జీవి, సాంస్కృతిక జీవి వరకు ఏయే దశల్లో, దిశల్లో జిజ్ఞాసా సుమం వికసించిందో అవగతం అవుతుంది. అయితే ఇంకొక ప్రయోజనం కూడా వుంది. మన సామాజిక దృక్పథం (Social aspect) బలం పుంజుకోవడానికి సామాజిక మానవ శాస్త్ర అంశాలను కూడా స్వీకరించవలసిన ఆవశ్యకత వుంది.

ఒకప్పుడు జ్ఞాన, విజ్ఞాన శాస్త్రాలు వ్రేళ్లమీద లెక్కపెట్ట కలిగినవి మాత్రమే వుండేవి. ఇప్పటి ఆధునిక విజ్ఞాన శాస్త్రాల శాఖోప శాఖలు వందల వేల సంఖ్యల్లో వుంటాయి. ఏదో ఒక శాస్త్రంలో రోజుకో సిద్ధాంతం వెల్లడవుతుంది. 'శాస్త్రం యోనిత్వాత్ (శాస్త్రం యోని వంటిది) అన్న బ్రహ్మ సూత్ర వాక్యం

ముంగర జాషువ, సెల్ : 9052676007

నిజమై కూర్చుంది. ఇటువంటి స్థితిలో వున్న శాస్త్ర పరిశోధనలు, వాటి జ్ఞాన ఫలాలు, సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఏదో ఒక శాస్త్రానికి మేధోజీవి కూడా పరిమితమై పోతున్నాడు. అయితే జ్ఞానం యొక్క బాహ్య రూపం అయినా తెలుసుకోవడానికి మానవ శాస్త్రం ఉపయోగపడుతుంది. అందులో సామాజిక మానవ శాస్త్రం సామాజిక సంబంధాలను, వివాహం, కుటుంబం, బంధుత్వం, ఆర్థిక, రాజకీయ సంస్థల స్వరూప స్వభావాలు కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థల మూల ధాతువులను విశ్లేషించి సమాజం పట్ల ఒక విశిష్ట అవగాహనను కల్పించి పాఠకుడికి ఒక మనో విస్తృతిని కల్పించి ఆలోచనాక్రమంలో మార్పుకు సహాయం చేస్తుంది. ఇటువంటి మార్పుల వలన ఇంకా కొన్ని ప్రశ్నలు తలెత్తితే మనిషి బాహ్య విజ్ఞానం నుంచి ఆంతరిక జ్ఞాన పరిశీలనకు దారి ఏర్పడుతుంది. మనిషి బలమైన భౌతిక దృక్పథం నుంచి తత్వచింతన వైపు ప్రయాణిస్తాడు. ఈ ప్రయాణంలో అనేక సత్యాలను ఒడిలో వేసుకొని 'ధర్మ శరణం గచ్ఛామి' అనే తాత్వికాచరణకు చేరుకుంటాడనడంలో ఎలాంటి సందేహం లేదు.

అయితే సమాజంలో సాహిత్య ప్రక్రియగాని మరే ఇతర కళలు గాని తమ స్థానాన్ని అతిగా వూహించుకొని శాస్త్రీయ దృక్పథానికి అడ్డుగా రాకూడదు. శాస్త్రీయ దృక్పథం అంటే, కేవలం మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం కాదు. మనోవికాసానికి 'కళ' కొంత వ్యక్తికీ, సమాజానికీ కారణమైనప్పటికీ, శాస్త్రీయ దృష్టిలేని రస దృష్టీ, సామాజిక చింతనాత్మక కళా రూపాలు శాంతిని కలిగిస్తాయి గాని అంతగా కాంతిని కల్గించ లేవు. సాంప్రదాయ కళా దృష్టిగాని సామాజిక వాస్తవిక కళా దృష్టిగాని, ఇంకే యితర వాద ప్రకోపాలుగాని, సాహితీ కళలో ఆభాసా (Paradox) రూపంగా కనిపిస్తాయిగాని, అవే వాస్తవం కాదు. సామాజిక సమస్యల పరిష్కారానికి, శుద్ధ తాత్విక దృక్పథం లాంటిది తోడ్పడుతుంది గాని అన్యం కాదు.

కవీ, కళాకారుడూ వస్తు రూపాలను స్వీకరించి, వాటిని తన అనుభూతిలో సమన్వయం చూసి, కవితాత్మతో సృజనాత్మకంగా అభివ్యక్తపరుస్తాడు. అందువల్లనే ప్లేటో కళా సృజనను మౌలిక సత్యానికి వస్తురూపాలు ప్రతిబింబాలయితే, వాటికి కళారూపాలు ఛాయా రూపాలని 'త్రిగుణ వ్యవహితా'లన్నాడు. అంతకుముందే సోక్రటీస్ ప్రతి వృత్తికారుడినీ, కళాకారుడినీ ప్రశ్నించి, జవాబులు రాబట్టి వారి అసమగ్రతను, అజ్ఞానాన్ని వెల్లడి చేసేవాడు. కవీ స్వాప్నికుడూ, తాత్వికుడూ. స్వాప్నికుడే అయినప్పటికి, ఒకరి సృజన ఉపరితలాన్ని తాకితే ఇంకొకరి కారణాల తోరణాలు, హేతుబద్ధ, జ్ఞానవంతమైన ఆలోచనా రూపాలు వ్యక్తీ – సమాజాల అభివృద్ధికి తోడ్పడతాయి. సామాజిక వాస్తవికతను సరిగ్గా బహిర్గతం చేయాలంటే విభిన్న శాస్త్రాంశాలతో సమన్వయం పొందిన తత్వశాస్త్ర దృక్పథం తోడ్పడుతుంది గాని అన్యం కాదు. మేధోజీవి పరిశోధనా మార్గం చరిత్ర, సౌందర్య తత్వం, రాజనీతి, మానవశాస్త్రాల నుంచి తత్వశాస్త్రం వైపుకి పయనించవలసి వుంది. సమాజానికి అంతః స్ఫోటన (implosive theraphy) చికిత్స లాంటిది జరిగితేగాని సత్యాన్వేషణ ఫలితాలను అందుకొనే ప్రయత్నం చేయదు.

వ్యక్తికీ, సమాజానికి చికిత్స తప్పని సరి ప్రక్రియ. అది ఏ మార్గం నుంచి మొదలు పెట్టాలి అనేది ఒక ప్రధానమైన ప్రశ్న – దీనిని మేధావులకు వదలివేసి, సామాన్యంగా ఆలోచించడానికి ఉదాహరణకు ఒక వ్యక్తిని తీసుకుంటే, అతని మూర్తిమత్వ విచ్ఛిత్తి జరిగిపోయింది. దీనికి కారకాలయిన కొన్ని కళా, సామాజిక, రాజకీయ వాదాలను ప్రస్తుతం నిందించ తలచడం లేదు. అయితే సమాజ పరిణామ క్రమంలో యీ మురికి అంతా మనిషికి అంటుకొని పోయి వుంది. దీని నుంచి తప్పించి వ్యక్తినీ, సమాజాన్ని పురోగమనం వైపుకి నడపాలంటే కొన్ని నిర్దుష్ట అంశాలు సంస్థలు, ప్రభుత్వాలు ఏర్పరుచు కోవలసిందే! మనిషి మూర్తి మత్వాన్ని కాపాడటం కూడా ప్రభుత్వం యొక్క పనే! సామాజిక కాలుష్యాలను అరికట్టవలసిన బాధ్యత కూడా వారిదే!

ఇక్కడ చిన్న ఉదాహరణ – ప్రస్తుతం దళిత, గిరిజన సంచార జాతులే ఎక్కువగా పీడనకు గురౌతున్నాయి. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతికమైన వెనుకబాటు తనం వారిని శతాబ్దాల నుంచి వేధిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నేటి సామాజికునికి ఆదిమ జాతుల అపరిపక్వ, అపరిణత జీవన గమనాన్ని తెలియపరిచే పని సామాజిక మానవశాస్త్రం స్వీకరిస్తుంది. ఇప్పటికి గూడా లిపిలేని సంకర భాషలను మాట్లాడుతూ ఎలుకలను, పిల్లులను, గాడిదలను తింటూ, కట్టు గోచీలు మాత్రమే వున్న ఆదిమజాతులు అనేకం మనుగడ సాగిస్తున్నవి.

మానవ శాస్త్రాన్ని అనుప్రయుక్తం చేయడంలో సఫలమై, అట్టడుగు జీవితాలు దుఃఖమయ గాథలను సమాజం ముందు ఉంచి, వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించ వలసి వుంది. ఇందుకు జానపద, శాస్త్రీయ కళా రూపాలను వుపయోగించడం కూడా అవసరమే! మానవ శాస్త్రం విస్తృతిలో ఉన్నా నేడో, రేపో సమాజ జీవితంలోకి ప్రవేశిస్తుంది. మి



## తెలుగు కథకు వెలుగుబాట

# గోపీచంద్

- నర్రా కోటయ్య

**త్రిపురనేని గోపీచంద్ శతజయంతి సందర్భంగా వారి సన్నిహితుని జ్ఞాపకాలు**

ఉత్తమ కథారచయితగా, నవలాకారుడుగా, తత్వవేత్తగా ఆంధ్ర సాహిత్యాకాశంలో మూడు దశాబ్దాలు జాజ్వాల్యమానంగా ప్రకాశించిన ప్రతిభాశాలి శ్రీ త్రిపురనేని గోపీచంద్.

1910 సం. సెప్టెంబరు 8వ తేదీన కృష్ణాజిల్లా అంగలూరులోని విద్వత్ కుటుంబంలో గోపీచంద్ జన్మించారు. వీరి తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, హేతువాది, సంఘసంస్కర్త, తల్లి పేరు పున్నమాంబ. గోపీచంద్ బి.ఏ., బి.ఎల్. చదువుకొన్నారు.

**కథా రచయితగా :** విశ్వకథా సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిన చెకోవ్, బేట్సు, టాల్‌స్టాయ్, సారోయన్, పుష్కిన్, గోర్కీ, మామ్, మఫాసా, ఓహెన్రీ, పెరల్‌బక్ మొదలైన ప్రముఖ రచయితల కథలు గోపీచంద్‌ను ప్రభావితం చేశాయి. ఈ విషయాన్ని గోపీచంద్ యిలా చెప్పుకున్నారు.

''నాకు ఈ ప్రఖ్యాత కథకులందరూ ఒక్కొక్కరు ఒక్కొక్కందుకు నచ్చుతున్నారు. పుష్కిన్ కథ చెప్పే రీతిలోని స్వాభావికతకు నచ్చుతున్నాడు. చెకోవ్ కథ మొదలు పెట్టడంలోనూ, ఆపడంలోనూ వున్న చమత్కృతికి నచ్చుతున్నాడు. గోర్కీ అతనిలోని ప్రతి అక్షరంలోనూ కనుపించే సిన్సియారిటీకి నచ్చుతున్నాడు. మామ్ జీవితాన్ని చిత్రిస్తున్నట్లు కనబడుతూ కథను చెప్పుకు పోగలుగుతున్నందుకు నచ్చుతున్నాడు. బేట్సు 'ప్లాట్' లేకుండా వాతావరణాన్ని సృష్టించి మనస్సును జివ్వున లాగ గలుగుతున్నందుకూ, సారొయన్ ప్లాటు లేకుండా కథను చతుర సంభాషణలతో నడుపుకుపోతున్నందుకు నచ్చుతున్నాడు. ఓ హెన్రీ తన నైపుణ్యాన్నంతా కథ చివరి వాక్యంలోకి ప్రవేశపెట్టగలిగినందుకు నచ్చుతున్నాడు. ఇటీవల నన్ను పెరల్‌బక్ కథలు అమితంగా ఆకర్షిస్తున్నాయి. దీనికి కారణం ఆమె ఆర్ద్ర హృదయం." ఆంధ్రదేశంలో గోపీచంద్ నూతన దృష్టితో కథాసృష్టి చేశారు. 'దేశం ఏమయ్యేట్లు?' 'భార్యల్లోనే వుంది.' 'గీతాపారాయణం', 'తండ్రులు - కొడుకులు', 'సరే కానివ్వండి', 'ధర్మాసుపత్రి', 'దేవుని జీవితం', 'ఇరుగు-పొరుగు,' 'కూపస్థ మాండూక్యం', 'పాత పగలూ - కొత్త పగలూ' సంపుటాలుగా వెలువడ్డాయి.

గోపీచంద్ పది పదుల పేజీలుండే పెద్ద కథ వ్రాసినా, పది వాక్యాలలో ఇమిడిపోచే 'గల్పిక' వ్రాసినా, అది పఠితల మనస్సు మీద చెరగని ముద్ర వేస్తుంది. 'అహం' అనే ఈ గల్పికను చదవండి.

"ఒక కవి ఒక సభలో ఈ విధంగా ఉపన్యసిస్తున్నాడు. "మీరు కనిపెట్టారో లేదో గాని నేను తిక్కనకంటే గొప్పవాణ్ణి. నా కవిత్వంలో తిక్కన కవిత్వంలో వున్న గుణాలకంటే గొప్ప గుణాలున్నాయి. ఇంతవరకు భారతదేశంలో పుట్టిన వాళ్ళలో తిక్కనకంటే గొప్ప కవిని నేనే.

"ఒక సభికుడు చివాలున లేచి, "తిక్కనకంటే మీరు గొప్ప కవులనుకోవడానికి దృష్టాంతం ఏమిటి?'' ''దృష్టాంతమా! దృష్టాంతమా!! అని నట్టు కొట్టడం మొదలుపెట్టాడు కవి. ఇంకో సభికుడు లేచి ఈ విధంగా జవాబు చెప్పాడు. "దృష్టాంతాలకేం? కావలసినన్ని ఉన్నాయి. తిక్కన కవిత్వం రాశాడు. వీరూ కవిత్వం రాశారు. తిక్కనా పుట్టాడు. వీరూ పుట్టారు. వీటిని బట్టి తిక్కనకూ, వీరికి చాలా పోలికలున్నవని విశదం అవుతూ ఉంది. ఇక తిక్కనకంటే ఈయన గొప్పవాడెలాగంటారా? తిక్కన చచ్చాడు. ఈయన చావలేదు" అని కూర్చున్నాడు. కవి తెల్లమొహం వేశాడు."

నర్రా కోటయ్య, సెల్ : 9949060160


గోపీచంద్ కొన్ని కథలను సంఘటనలకు ప్రాధాన్యత యిచ్చి వ్రాస్తే, మరికొన్నిటిని మనస్తత్వ వాతావరణం ప్రధానంగా రూపొందించారు. ఇందుకు ఉదాహరణగా 'సానుభూతి' అనే చిన్న కథ చాలు. ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఒక ఐదు రూపాయలు బదులివ్వండి. ఇంట్లో బియ్యం లేవు. గోలగా ఉంది" అని తడబడుతూ అడిగాడు. ''నా దగ్గర దమ్మిడీ లేదు. డబ్బెక్కడనుండి వొస్తుంది? నా పెరట్లో పండుతుందా? అదీగాక నేనిన్నిసార్లు ఇవ్వలేను" అన్నాడు ధనవంతుడు. "నాకెప్పుడిచ్చావ్?" అన్నాడు కవి.

"నువ్వు మరణించిన తర్వాత శిలావిగ్రహానికి ఇవ్వొద్దూ? ఇప్పుడూ యిచ్చి, అప్పుడూ ఇచ్చి, నాకిదే పనా?" అన్నాడు ధనవంతుడు. కవికి ఆ రోజు రాత్రి కలలో కన్పించాయి తన భార్యా పిల్లలు తిండిలేక ఒక ప్రక్కన ఏడుస్తూ వుంటే, ఒక ప్రక్కన తన శిలావిగ్రహం తయారవుతూంటుంది. ఆ శిలావిగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్నీ, రసహృదయాన్నీ ప్రజలు వేనోళ్ళ పొగుడుతూ ఉంటారు.

**నవలా రచయిత :** గోపీచంద్ నవలా రచయిత కూడా. వారి నవలలు పఠితల మనస్సు మీద చెరగని ముద్రవేసి వినూత్న భావాలను రేకెత్తిస్తాయి. వాటిలోని శిల్ప నైపుణి దిగ్భ్రాంతులను చేస్తుంది. వారి కలం నుండి 'పరివర్తన', 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపుల మరకలు', 'పిల్లతెమ్మెర', 'గడియ పడని తలుపులు', 'పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా,' 'ప్రేమోపహతులు', 'శిథిలాలయం', 'యమపాశం', 'చీకటి గదులు' మొదలైన నవలలు పుంఖానుపుంఖంగా వెలువడ్డాయి. ఇవన్నీ స్వతంత్ర రచనలే. అనువాదాలు, అనుసరణలు కావు.

నార్ల వెంకటేశ్వరరావు గారన్నట్లు ''గోపీచంద్ రచనలన్నింటిలో, అది చిన్న కథ కానివ్వండి. పెద్ద నవల కానివ్వండి. 'మూలతత్వ విచారణకై ప్రయత్నం కనబడుతుంది. ఫలితమేమైనా, దీక్షగా, ధైర్యంతో ఆయన ఈ పరిశీలన చేశారు. ఇదే ఆయన రచనలకు ఒక ప్రత్యేకత చేకూర్చింది. ఇదే వాటికి ఒక వైశిష్ట్యాన్ని సాధించింది. జీవితం – సాహిత్యం – ఇవి గోపీచంద్‌కు విభిన్న రంగాలు కావు. జీవితమే ఆయనకు సాహిత్యం, సాహిత్యమే జీవితం.

**సినిమా రంగంలో :** గోపీచంద్ కథకులుగా ఖ్యాతి గడించిన నాటికి దక్షిణ భారతావనిలో చలనచిత్ర పరిశ్రమ వృద్ధిలోకి రాసాగింది. సినిమా పరిశ్రమకు మద్రాసు కూడలి. తెలుగు సినిమా పరిశ్రమలోకి అభ్యుదయ భావాలు కలిగిన యువకులు అప్పుడే అడుగు పెడుతున్నారు. గూడవల్లి రామబ్రహ్మంగారి




ప్రోత్సాహంతో గోపీచంద్ సినిమా పరిశ్రమలో ప్రవేశించారు. 'రైతుబిడ్డ', 'గృహప్రవేశం' చిత్రాలకు భావగర్భితమై సంభాషణలు వ్రాశారు. 'రైతుబిడ్డ', 'ప్రియురాలు', 'లక్ష్మమ్మ', 'పేరంటాలు' మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'కలిమిలేములు', 'చదువుకున్న అమ్మాయిలు' చిత్రాలకు కూడా వారు మనోరంజకమైన సంభాషణలు వ్రాశారు. హాస్యరస పోషణలోనూ, భావోద్రేకమైన సన్నివేశాల నిర్వహణలోనూ ఆయన అందెవేసిన చేయి.

**అరవిందుని ప్రభావం :** గోపీచంద్ మద్రాసులో వున్నప్పుడు పుదుచ్చేరిలోని అరవిందాశ్రమం వెళ్ళడం జరిగింది. అరవిందుని దర్శనం గోపీచంద్ జీవిత పథాన్ని పూర్తిగా మార్చి వేసింది. ఈ మార్పులవల్ల సినిమా వాతావారణంలో వారుండలేక పోయారు. ఆ రంగం, విడిచిపెట్టి కర్నూలులో సమాచార డైరెక్టరుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

గోపీచంద్ ''ఇప్పుడున్నదంతా సత్యమని మనం అనుకోకూడదు. అలాగని ఇది అసత్యం కూడా కాదు. ఇప్పుడున్నది ఇప్పటివరకే సత్యం. ఇది అర్థసత్యం. దీన్ని ఆధారం చేసుకొని మనం నిత్య సత్యం కోసం తపించాలి." ఆ 'తపనే' తత్వశాస్త్రం. ఆ తపనే ఆయనను శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారన్నట్లు, "వేదనాజీవి"గా మార్చి వేసింది. వారు రెండు భాగాలు "తత్వవేత్తలు" అనే గ్రంథం వ్రాశారు.

గోపీచంద్ భౌతికవాదిగా జీవితం ప్రారంభించారు. అరవిందుని ప్రభావం, తత్వగ్రంథ పఠనం, జీవితం నేర్పిన పాఠాలు గోపీచంద్‌ను ఆధ్యాత్మికవాదిగా మార్చివేశాయి. సూక్ష్మంగా చూస్తే, ఆధ్యాత్మిక, ఆస్తిక వాదాల ఘర్షణే వారి జీవితం. మనం తత్వశాస్త్రాన్ని పరిశీలిస్తే భౌతిక, ఆధ్యాత్మిక వాదాలు ఆనాది నుండి వున్నట్లుగా కనిపిస్తుంది. ఈ రెండు వాదాలను సమన్వయ పరచవలసిన ఆవశ్యకతను గోపీచంద్ గుర్తించారు. భౌతిక ఆధ్యాత్మిక వాదాలను సమన్వయ పరుస్తూ 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' రచించారు.

గోపీచంద్ పరిణతి చెందిన రచయిత. కథ, కథానిక, నవల నాటిక వ్యాసం, లేఖ, స్కెచ్ మొదలైన శాఖల్లో ఆయన అందెవేసిన చేయి. వ్యావహారిక భాషలో చిన్న చిన్న వాక్యాలతో, తెలుగు నుడికారంలో చురుక్కుమనిపించే వ్యంగోక్తితో, సులభ గ్రాహ్యమైన శైలిలో వ్రాయడం గోపీచంద్ గారి ప్రత్యేకత. 'మాకూ వున్నాయి స్వగతాలు'లోని పాత్రలన్నీ ఉపేక్షిత

మానవులు సమాజంలో పనిమనిషికి, కారు డ్రైవరుకి, పాకీవానికి, రైళ్ళలో పుస్తకాలమ్మే వానికి గౌరవ ప్రదమైన స్థానంలేని విషయం గోపీచంద్‌గారి హృదయాన్ని కలవర పెట్టిందట! అప్పుడు వ్రాసినవే స్వగతాలు. అందులో 'తుమ్మ చెట్టు', 'మర్రి చెట్టు', 'అగ్రుకడిగిన ఎద్దు,' తమ తమ కథలను వినిపిస్తాయి. ఈ చరాచర జగత్తులోని ప్రతి పదార్థాన్నీ, అన్ని కోణాల నుండి పరిశీలించడంలో గోపీచంద్ నిష్ణాతులు అనడానికి ఈ స్వగతాలు తిరుగులేని నిదర్శనం.

**వ్యక్తిత్వం :** తాత్విక తేజంతో తొణికిసలాడుతూ వుండే ముఖ వర్చస్సూ, పెదవుల మీద చిందులు త్రొక్కుతూ వుండే చిరునవ్వు బంగారు దేహచాయ, విశాలమైన చాతీ, గంభీరమైన విగ్రహం, చెదురు ముదురుగా రేగిన నల్లని ఉంగరాల జుట్టు, దట్టమైన కనుబొమలు, నల్లని దళసరి ఫ్రేమగల కళ్ళజోడు, చేతిలో రెండు పుస్తకాలు, కాళ్ళకు దేశవాళి చెప్పులు, సిల్క్‌లాల్చి, బిళ్ళగోచీతో తెల్లని గ్లాస్కో పంచెకట్టు – వీటి సమాహారమే శ్రీ గోపీచంద్.

ఆంధ్రాంగ్ల సాహిత్యాలలో ఆయన చదవని గ్రంథం లేదనడం అతిశయోక్తి కాదు. అరవిందుని 'దివ్య జీవన గ్రంథం', 'అతీత మానవుడు' వంటి తాత్విక గ్రంథాలనుండి సులభంగా అర్థమయ్యే డిటెక్టివ్ నవలవరకూ చదివేవారు. కాలం ఒక్క క్షణమైనా వృథాకావడం ఆయన సహించేవారు కాదు. గోపీచంద్ నాకు అత్యంత సన్నిహితమైన మిత్రుడు. ఆయన ఇంటికి దగ్గరలోనే నేను ఒక గదిలో విద్యార్థిగా వుండి చదువుకొంటూ వుండే వాణ్ణి. తరచుగా వారింటికి వెళ్ళుతూ ఉండేవాణ్ణి. వారి పిల్లలందరూ నన్ను కోటయ్య మామయ్య వచ్చాడంటూ ఆప్యాయంగా పిలుస్తూ ఉండేవారు. దీపక్ మహల్ ప్రక్కనే వున్న కాఫీహోటల్‌లో కూర్చుని, మేమిద్దరం ఆధునిక సాహిత్యంలోని వివిధ పోకడలనూ చర్చిస్తూ ఉండేవాళ్ళం. గోపీచంద్‌తో మాట్లాడటం అదొక అపూర్వమైన అనుభవం. ఆయన చక్కని సంభాషణా చతురులు. సంభాషణలో చెణుకులు విసురుతూ ఉండేవారు. కడుపుబ్బా నవ్వించేవారు. అలాంటి చెణుకులు ఆయన రచనల్లో కూడా రవ్వల్లాగా మెరుస్తుంటాయి. తెలుగు కథానికకు వెలుగుబాటను జూపి, సమాజ శ్రేయస్సు కోసం కృషి సాగించిన మహా రచయిత శ్రీ గోపీచంద్. అర్థ శతాబ్దాం క్రితం కథా రచనతో జీవితం ప్రారంభించిన శ్రీ గోపీచంద్, కథ వ్రాసుకొంటూనే 1962వ సం. నవంబరు 2వ తేదీన గుండెపోటువల్ల కీర్తిశేషులయ్యారు. ఆయన మరణం నాకు తీరని దుఃఖాన్ని కలిగించింది. నేనూ నా మిత్రుడు త్రిపురనేని సుబ్బారావు శోక తప్తమైన హృదయంతో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో సంతాప సభను ఏర్పాటు చేశాం. ఆనాటి సభలో ఆంధ్ర విశారద తాపీ ధర్మారావుగారు, ఆనాటి మునిసిపల్ పరిపాలన శాఖామాత్యులు ఆలపాటి వెంకట్రామయ్యగారు, న్యాయశాఖామాత్యులు పి.వి. నరసింహారావుగారు, జస్టిస్ గోపాలరావ్ ఎగ్బోటేగారు పాల్గొన్నారు. తాపీ ధర్మారావుగారు ప్రసంగిస్తూ "గోపీచంద్ చాలా కాలం బ్రతుకుతాడని నేను ఆశించాను. మృత్యువు ఇంత త్వరలో వారిపై తన శీతల హస్తం వేస్తుందని నేను ఊహించలేదు. ఆయన సాహిత్యంలో అలెగ్జాండరు వంటి ధీరుడు" అన్నారు.

ఆలపాటి వెంకట్రామయ్యగారు ఉపన్యసిస్తూ "రామస్వామి చౌదరిగారు కోసం సూతాశ్రమం వెళ్ళినప్పుడు గోపీచంద్‌తో పరిచయం గలిగింది. మణిపూసల్లాగా కథలను మలచడంలో వారికి వారే సాటి. సమాజాన్ని అందులోని మంచి చెడ్డలను పడుగు పేకల్లాగా మలచి చిత్రించిన వారి నవలలు మన సాహిత్యానికే గర్వకారణం" అన్నారు.

పి.వి. నరసింహారావుగారు ప్రసంగిస్తూ "గోపీచంద్ విశేష ప్రతిభావ్యుత్పత్తులు గల రచయిత. కథా రచనలోనూ, నవల రచనలోనూ సిద్ధహస్తులు, సాహిత్యపు ఉన్నత శిఖరాలందుకొన్నాడు. వర్ధమాన రచయితలు, గోపీచంద్ రచనలను క్షుణ్ణంగా పరిశీలించడానికి, అవగాహన చేసుకోవడానికి 'స్టడీ సర్కిల్స్'గా ఏర్పడితే, వారి సాహిత్యపు పోకడలను, వారి రచనల సారాన్నీ గ్రహించిన వారవుతారు" అన్నారు.

జస్టిస్ గోపాలరావ్ ఎక్బోటేగారు మాట్లాడుతూ "గోపీచంద్ సాన్నిహిత్యంతో, తెలుగు సాహిత్యం మీద అభిరుచి పెంపొంది, తెలుగు నేర్చుకొని, వారి నవల 'అసమర్థుని జీవయాత్ర'ను చదివాను. గోపీచంద్ రచనలను ఇతర భాషలలోకి అనువదించి ప్రచురింప చేయాలి" అన్నారు. నా వందన సమర్పణలో ఆనాటి సభ ముగిసింది.

ఆవుల సాంబశివరావుగారు కార్యదర్శిగా ఒక 'కమెమొరేషన్ కమిటీ' ఏర్పడింది. గోపీచంద్ 'సంస్మరణ సంచిక' సర్వాంగ సుందరంగా వెలువడింది. ఆ సంచికలో 'మాకూ వున్నాయ్ స్వగతాలు' అనే పుస్తకంపై నేను సమీక్షాత్మకమైన వ్యాసం ప్రకటించాను. అది పలువురి సాహితీవేత్తల ప్రశంసలనందుకుంది.

# గోపీచంద్ పెద్దమ్మాయి, ప్రమీలగారి జ్ఞాపకాలు

**తా**తగారి సూత్రాశ్రమం లీలగా గుర్తున్నది. పెద్ద స్థలం అన్ని చెట్లు పచ్చగా, పూలమొక్కలు, చిన్న ఇల్లు, ఇదీ ఆశ్రమం. ఎందరెందరో వస్తుండేవాళ్లు. నేను మరీ చిన్న దాన్ని. పెద్దయిన తర్వాత వచ్చి చూస్తే ఎన్నో జ్ఞాపకాలు. నా చిన్నతనంలోనే మద్రాసు వచ్చేశాం. నాన్నగారు సినిమాలు దర్శకత్వం వహించడం – మాటలు రాయటం అన్నీ ప్రణాళిక ప్రకారమే జరిగిపోయేది. ఆయన ఎప్పుడూ చిత్రరంగంలోని చీకటి కోణాల్లోకి చూసినట్లుగా ఎవ్వరూ చెప్పలేదు.



రామస్వామి చౌదరి

టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నాన్నగారిని ఇన్‌ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా తీసుకు వెళ్ళారు. అప్పుడే కర్నూలు వచ్చాం. ప్రకాశం పంతులు గారికి నాన్నగారంటే ఎంతో అభిమానం. 1956లో హైద్రాబాద్ వచ్చాం. నేను అప్పటి నుంచీ ఇక్కడే వుండిపోయాను. 1957లో ఆకాశవాణిలో రూరల్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా చేరారు. అప్పటి నుంచీ ఆయన చాలా సెక్యూర్‌గా ఫీలయ్యేవారు.

అప్పుడు గవర్నరు త్రివేది. నాన్నగారి రేడియో వ్యాఖ్యానమో, ఉపన్యాసమో విన్నారు. అప్పటినుంచి త్రివేదిగారు ఎక్కడ ఉపన్యాసం చేసిన నాన్నగారినే అనువాదకునిగా తీసుకుని వెళ్ళేవారు.

తాతగారిని పాండిత్యంలో, సంస్కరణలలో ఎదుర్కోలేని వారు ఆయనను 'నాస్తికుని'గా ముద్రవేసి తప్పించుకున్నారు.

నాన్నగారికి రచయితగా వున్న 'పేరు'ను చూసి మేము ఆనందపడేవాళ్ళం. ఏనాడూ గర్వపడలేదు. అమ్మ విద్వాన్ చదివింది. మా చదువులు – డబ్బు ఇంటి వ్యవహారం అంతా అమ్మ చూసేది. నాన్నగారు ఎప్పుడు కల్పించుకునేవారు కాదు. ఎవ్వరిని గట్టిగా కోప్పడటం కూడా అరుదే. ఎప్పుడైనా అలా చేస్తే ఒక గంట, రెండు గంటల్లో వచ్చి – బాధపడ్డారా? రండి అందరం కలిసి మెరీనాకి వెళ్దాం అని తీసుకొని వెళ్ళేవారు. ఆ రోజులు ఇప్పటికీ నాకెంతో ఇష్టం.

తాతగారికి మొదటి భార్యకు ఇద్దరు సంతానం. ఆమె చనిపోయిన తర్వాత అమ్మమ్మను చేసుకున్నారు. అమ్మమ్మకు ముగ్గురు సంతానం. నాన్నగారు, మరో ఇద్దరు. అమ్మమ్మ కూడా తక్కువ వయసులోనే పోయింది. మా చుట్టాలలో – చౌదరిగారి భార్య ఎవరూ పుష్కర కాలం కాపురం చేయరా? అని అంటుండేవాళ్ళు. మూడో భార్య 'చంద్రమతి.' ఆమె నాన్నగారిని ఎంతో ప్రేమగా పెంచింది. ఆ జ్ఞాపకాలలో నుంచే 'దమయంతి' (చీకటి గదుల్లో) వచ్చింది.

నాన్నగారికి బాగా సన్నిహితులు శివలెంక శంభు ప్రసాద్. తర్వాత గుమ్మడి వెంకటేశ్వరరావు, మహతి, ఆరుద్ర కూడా తరచు కలిసేవారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, టెంపోరావు కూడా నాన్నకు సన్నిహితులే. నాన్నగారిది మంచి ఆరోగ్యమే. కాని ఆయనకు ఒక మానసికమైన ఫిక్సేషన్ వుండేది. 'నాన్న 60లోపే పోయారు. నేను కూడా అంతేనేమో' అంటుండేవారు. మళ్ళీ 'మీ ముగ్గురు పెద్ద వాళ్ళుగదా, చిన్న వాళ్ళని జాగ్రత్తగా చూడగలరు' అనేవారు. మేము మొత్తం ఆరుగురం. నేను పెద్దదానిని. తర్వాత ఇద్దరు, మిగతా ముగ్గురు వయస్సులో బాగా చిన్నవారు. ఆఖరివాడు సాయిచంద్. నరసింగరావు గారు సినిమాలో నటింపజేశారు. సాయిచంద్ 'పండిత పరమేశ్వరశాస్త్రి' టెలిఫిలిమ్ తీశాడు. మరికొన్ని కథలు కూడా టివి కోసం తీశాడు.



గుమ్మడి

అరవిందాశ్రమం వెళ్ళిన తర్వాత – ఆయన ఆలోచనలలో, రచనల్లో మార్పు వచ్చిందంటారు. కాని కుటుంబంతో ఆయన సంబంధాలకు ఎటువంటి వ్యత్యాసం లేదు. రచయితగా, సినిమా దర్శకునిగా అరవిందుని శిష్యునిగా ఆయన ఏ మానసిక స్థితిలో వున్నా – కుటుంబ పెద్దగా బాధ్యతలను విస్మరించలేదు. ఆయన ఎమోషనల్ లెవెల్ చాలా స్థిరంగా వుండేది. మొదటిసారి ఆదిలాబాదు వెళ్ళినపుడు బాగా అనారోగ్యానికి గురయ్యారు.

ఢిల్లీలో మొదటిసారి గుండెపోటు వచ్చింది. విధి నిజంగా చిత్రమైనదే. ఆయన భయమే నిజమైంది. ఆయన మరణం ఆకస్మికంగానే తలుపు తట్టింది. మేమెవ్వరము చివరకు ఆయన కూడా, సిద్ధంగా లేము. ఆయన దేహచ్ఛాయ పచ్చగా పసిడిరంగులో ఉండేది. ఆయన పోయినప్పుడు దాశరథిగారు ఆయన పార్థివ శరీరాన్ని చూసి 'ఏమిటి ఇంతటి పసిమిని ఆయనలోనే దాచుకున్నారు' అని ఎంతో విచారంతో అన్నారు.

ఆయన పుస్తకాలు ముందుగా బొల్లిముంత శివరామకృష్ణయ్యగారు ప్రచురించారు. తరువాత నవోదయ, పల్లవి పబ్లికేషన్స్ వారు ముద్రించారు. నాన్నగారి రచనల ద్వారా మాకు వచ్చిన నిధులు ఏమీ లేవు. ఆయన వారసులుగా మేము ఆనందపడతాం!

– *వివికె*



# అందమే ఆనందం...

ఆరోగ్యమైన సౌందర్యమే కళ –

"ఇప్పుడు, అందం గురించి మాతో మాట్లాడు" అడిగాడో కవి. అతడిలా జవాబిచ్చాడు : ''అందాన్ని ఎక్కడ అందుకోగలరు? ఆమెను ఎట్లా వెతక గలరు? ఆమే మీకు దారీ... దారి చూపేదీ.... అయినప్పుడు తప్ప."

తిరస్కృతులూ, గాయపడిన వాళ్లూ –

"సౌందర్యమంటే జాతి, దయ, ఔన్నత్యమనీ, ఆమె నునుసిగ్గుపడుతూ జీవన వైభవంతో వెలిగిపోయే... మనందరి మధ్యా తిరుగాడే... పచ్చి బాలింత వంటిదనీ" చెబుతారు.

*అంతులేని పిపాసులు..*

'కాదు సౌందర్యమంటే గొప్ప శక్తి, అలజడి రేకెత్తించే ఒక వస్తువు. అది ప్రళయ కాలపు ప్రభంజనం వలె కాళ్ల కింది భూమినీ, తలపైని ఆకాశాన్ని కదిలించి వేస్తుంది" అని చెబుతారు.

అలసి సొలసిన వారూ, విరక్తులూ –

"సౌందర్యమంటే ఒక మెత్తని మర్మర ధ్వని. ఆమె మన ఆత్మలోతులతో మాటలాడుతుంది, నిశీధి ఛాయకు భీతిల్లిన... తొణికిన మసక వెలుతురు వంటి మన నిశ్శబ్దాలకు .... ఆమె తన మాటల పంట నందిస్తుంది" అని చెబుతారు.

అవిశ్రాంతులు –

"పర్వత సానువుల్లో ఆమె ప్రతిధ్వనులు మేం విన్నాం! పాద ముద్రికల సవ్వడులలోంచీ... ఎగురుతున్న రెక్కల శబ్దాలలోంచీ... మార్మ్రోగుతున్న సింహగర్జనలలోంచీ... ఆమె ప్రతి ధ్వనులు మేం విన్నాం!" అని చెబుతారు.

నగర కాపులు.... రాత్రి వేళల్లో –

"సౌందర్యం తూర్పు దిక్కున ప్రభాతంతోపాటు తప్పక ఉదయిస్తుంది" అని చెబుతారు. మధ్యాహ్నపు దూరాభారాలతో సుదీర్ఘ గమ్యాల వైపు సాగే పథికులు – "సాయం సంధ్యా గవాక్షాలలోంచీ ఆమె పుడమి మీదికి దిగడం మేం చూసాం" అని చెబుతారు.

చలికాలాల్లో మంచుతో కప్పబడిన వాళ్లు –

"ఆమె కొండ శిఖరాల నుండీ వసంతం వెంటబెట్టుకొని పరవళ్లు తొక్కుతూ వస్తుంది. తప్పక వస్తుంది" అని చెబుతారు.

వేసవి వేడిమిలో పంటలు కోసే వాళ్లు –

"నేల రాలుతున్న శిశిర పత్రాలతోపాటు ఆమె నాట్యమాడటం మేం చూసాం! ఆమె నల్లని కురుల నిండా చల్లని మంచు తుంపరలుండటం మేం చూసాం!" అని చెబుతారు.

"అందం గురించి ఇవన్నీ మీరు చెప్పినవే." "అయితే అందం అవసరం కాదు. అదొక రసానుభవం. అది నాలుక దప్పిగొనడం కాదు. అది శూన్య హస్తాలు ముందుకు చాచటం కాదు." "అది అగ్నిజ్వాలలు చెలరేగిన హృదయం, అది వెంటాడే ఆత్మ."

"అది నీవు చూడగలిగే ప్రతిమ కాదు, నీవు వినగలిగే సంగీతమూ కాదు. అది నీవు కన్నులు మూసుకున్నా చూడగలిగే రూపం, చెవులు మూసుకున్నా వినగలిగే సంగీతం." "అది చెట్టు బెరడులోని రసం కాదు. అది గోటికి జత చేయబడ్డ వట్టి రెక్క కాదు. అది ఎప్పుడూ విరబూస్తున్న ఒక తోట. అది ఎప్పుడూ విహరించే ఒక దేవతల గుంపు."

"సౌందర్యమంటే జీవితం... తన పవిత్ర ముఖం కొరకు ముసుగు తొలగించుకొన్న జీవితం." అయితే, ఆ జీవితమూ మీరే! ఆ ముసుగూ మీరే!

"సౌందర్యమంటే తనను తాను అద్దంలో స్థిరంగా చూసుకొంటున్న ఒక నిత్యత్వం." అయితే, ఆ నిత్యత్వమూ మీరే! ఆ అద్దమూ మీరే!

మూలం : ఖలీల్ జిబ్రాన్ : అనువాదం : డా. కాకుమాని శ్రీనివాసరావు సెల్ : 8008070775

ఈ క్రింది **మిసిమి** ప్రచురణలు, వేమన ఫౌండేషన్, ధర్మదీపం ఫౌండేషన్ వారి పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

| | | | |
|---|---|---|---|
| **I.** | **మిసిమి ప్రచురణలు** | | **రూ.** |
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| | ***అన్నపరెడ్డి రచనలు:*** | | |
| 1. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | (హార్డ్ బౌండ్) | 500.00 |
| 2. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | | 200.00 |
| 3. | ఆచార్య నాగార్జునుడు | | 150.00 |
| **II.** | **వేమన ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం<br>*(మూలం : ప్రొ. హరిమోహన్ ఝూ, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | | 100.00 |
| 8. | THE FIRST POETIC READER<br>- *Walter Joyes and N.C. Sashacharloo* | | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | | 25.00 |
| **III.** | **ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్<br>*రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్* | | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ<br>*రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి* | | 75.00 |
| 3. | మిళింద పన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | | 75.00 |
| 4. | మహా పరిత్తం – *బోధ చైతన్య* | | 100.00 |
| 5. | జాతక కథలు – *శివశంకర స్వామి* | | 60.00 |

---


మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

***మిసిమి*** *నెలనెలా విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా రూ. 200/– తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా రూ. 30/– కలపండి.

**1. పేరు :** ....................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ....................................................................

వీధి ....................................................................

పేట ....................................................................

ఊరు ....................................................................

పిన్ ....................................................................

**3. సంతకం :** ....................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **'మిసిమి'** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



Lady lying on Lion’s skin

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



దేవికారాణి